

ANDHRA PATRIKA
ILLUSTRATED WEEKLY

ఆంధ్రపత్రిక

సచిత్ర వార పత్రిక


HAZELINE SNOW
ముఖ్యంగా చూచుట...
"'హేజ్‌లైన్' స్నో" ను కొనునప్పుడు పైన
విలువ యూనికార్న్ చిత్రముగల వెండిరంగు
అల్యూమినమ్ మూత గట్టిగా బిగించబడి
యుండుటను, అప్పుడు అది అచ్చమైన
"'హేజ్‌లైన్' స్నో" అని నెరుగుదును.
"'HAZELINE' SNOW"
(TRADE MARK)
"'హేజ్‌లైన్' స్నో" (ట్రేడ్‌మార్క్)
బర్రోస్ వెల్‌కమ్ అండ్ కో, (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్.
పోస్టు బాక్సు నం. 290, బొంబాయి.

“సత్యాగ్రహ
పంథీ”

మహాత్మా
గాంధీ

[వర్ధంతి జనవరి 30]

దండి సత్యాగ్రహయాత్రా
చిత్రం:—

చిత్రకారుడు: వడ్లమాని
మధుసూదనరావు
(హైదరాబాదు)



“అమార్
జీబనీ
అమార్
బానీ”

“నా జీవితమే
నా సందేశం”

—గాంధీజీ.

సంవత్సర చందా
రు. 12-0-0
విడిపత్రిక 4 అ.

ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక


Founder : K. NAGESWARA RAO

సంపుటము 51
సంచిక 22
30-1-57

దుర్ముఖ పుష్య బహుళ అమావాస్య బుధవారం

★ విషయానుక్రమణిక

ఆరేళ్ళక్రితం అవతరించిన భారత రిపబ్లిక్ ఈనెల 26 న సప్తమ వార్షికోత్సవం మహోజ్జ్వలంగా జరుపుకుంటున్నది.



శ్రీరామ రక్ష

హైదరాబాదు, సికిందరాబాదులకు వచ్చే రైళ్లు, అక్కడినుంచి పోయే రైళ్లు గంటలకొద్దీ ఆలస్యంగా నడుస్తున్నవనీ, రైలు ప్రయాణ సౌకర్యాలు ఏమాత్రం సంతృప్తి కరంగా లేవనీ, అందుచేత వీలుచేసుకొని ఒక సారి వచ్చి పరిస్థితులను సర్దుబాటు చేసే మార్గం ఆలోచించవలసిందిగా రైళ్ళ మంత్రి శ్రీ జగ్ జీవన్‌రామ్‌ను ఆహ్వానించామనీ రాష్ట్ర ఆర్థికమంత్రి శ్రీ కళా వెంకటరావు తెలియజేస్తున్నారు. శ్రీ జగ్ జీవన్‌రామ్ ఇందుకు సమ్మతించారనీ, రేపో మాపో హైదరాబాదుకు రాబోతున్నారనీ కూడా వార్త. మంచిదే. కేంద్రమంత్రి అవశ్యం రావలసిందే; పరిస్థితి సర్దుబాటు చేయవలసిందే.

"మందగమనలు"గా మారిపోయిన మన హైదరాబాదురైళ్ళు పరుగెత్తి పాలుతాగే కంటే, నిలుచుని నిదానంగా, నీళ్లు తాగడం మంచిదనే ధర్మసూత్రాన్ని గ్రహించి వుండాలి. అందుచేతే వాటి 'గతి' ఇంత 'మందగతి' అయివుంటుంది. ఇటీవల వాటి "గతి" తెగహెచ్చేసరికి, ప్రయాణీకుల 'గతి' "అధోగతి"గా మారిపోయింది. సర్వం "నదీ నాంసాగరోగతిః" అయింది; జడచర్ల, జనగాంల పేర్లు చెబితేనే, రైలులో కూర్చున్న ప్రతివ్యక్తికీ హడలెత్తిపోవడం మొదలు పెట్టింది. రాష్ట్రంలో రైళ్ళు సక్రమంగా పరుగెత్తకపోయినా, జడచర్ల, జనగాం స్టేషన్లు వచ్చినవనే సరికి ఏం కొంప మునిగి పోతుందోనని ప్రయాణీకుల గుండెల్లో మాత్రం రైళ్ళు పరుగెత్తుతూనే వున్నవి. శ్రీ జగ్ జీవన్‌రామ్ వచ్చి చూశాక ఈ "గతి" ఏవిధంగా మారుతుందో చూడాలి.

* * *

రెండవ పంచవర్ష ప్రణాళిక పనులన్నీ సక్రమంగా అమలు జరగాలంటే, ఒక్క ఆంధ్ర ప్రదేశ్‌లోనే ప్రజల విరాళంగా ఈ సంవత్సరానికి మూడుకోట్ల రూపాయలు వసూలుకావలసి వున్నదంటారు ముఖ్యమంత్రి శ్రీ సంజీవరెడ్డి. అందుచేత రాష్ట్రంలోవున్న ప్రజలందరూ తలకు నెలకు ఒక అణావంతున పొదుపు పత్రాలద్వారా నిలవ చేస్తే కావలసిన డబ్బు వచ్చేస్తుందని సలహా ఇస్తున్నారు.

ముఖ్యమంత్రి సలహా ఈవిధంగావుంటే,



కీ॥ శే॥ శ్రీ పసుపులేటి వెంకటకృష్ణయ్య నాయుడు: న్యూయార్క్‌లో పత్రికా రచయితగా ఉన్న శ్రీ పి. జి. కృష్ణయ్య తండ్రి. ఆంధ్ర క్రైస్తవ కళాశాలకు వైస్ ప్రిన్సిపాల్‌గానూ, గుంటూరు పురపాలకసంఘానికి అధ్యక్షుడుగానూ పని చేశారు. శ్రీ కృష్ణయ్య, ఈ కళాశాలలో ప్రతిసంవత్సరం చదువులో శీలంలో ఉత్తమార్హతగల విద్యార్థికి తమ తండ్రి పేర ఒకపతకం బహూకరించడానికి ఏర్పాటు చేశారు.

రాష్ట్ర ఆర్థికమంత్రి శ్రీ కళా వెంకటరావు మరో రెండాకులు ఎక్కువే చదివా ననిపిస్తున్నారు; ఇంత జనాభాగల మనదేశంలో ప్రతివ్యక్తీ రోజుకు కనీసం ఒక్క కానీ పొదుపు చేస్తే ఒక్క మనరాష్ట్రంలోనే కావలసినంత ధనం పోగవుతుం దంటారు.

బాగానే వుంది. మంత్రులే తమ నెలసరిఆదాయంలో, భత్యాలలో కనీసం కొంతభాగాన్ని పొదుపు ఉద్యమానికి సమర్పించి ఎందుకు మార్గదర్శకులు కాకూడదు? అప్పుడు వీ రోజు కారోజు "... భిక్షాందేహీ" అన్నా, "ఏక్ నయా పైసా దేదో మహారాజ్!" అన్నా కొంత ఫలితం వుండవచ్చు.

* * *

నాగార్జునసాగరం ప్రాజెక్టుప్రాంతంలో 56 మందికి కలరా తగిలిందనీ, ఇప్పటికి (జనవరి 15 నాటికి) పదిమంది చనిపోయారనీ, వ్యాధిగ్రస్తులైన మిగతావారికి తగిన చికిత్స సౌకర్యాలు లేక అవస్థపడుతున్నారనీ స్థానిక కార్మిక సంఘ కార్యదర్శి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాడు. కొన్ని వేలమంది కార్మికులు చేరి పనిచేసేచోట ఇలాంటి ఉపద్రవాలు జరుగుతూనే వుంటవి. ఎప్పటి కప్పుడు ఏవేవో ప్రమాదాలు వాటిల్లుతూనే వుంటవి. రెండేళ్ల క్రితం హీరాకుడ్ ప్రాజెక్టు నిర్మాణ సందర్భంలో ఆనకట్టకు మోటించి అమర్చిన పెద్ద నిచ్చెన విరిగిపోయే సరికి, దాదాపు వందమంది పనివాళ్లు మరణించడం జరిగింది. ఇలాగే తరుచూ వస్తూపోతూ వుండే భారీ వాహనాలవల్ల కూడా ప్రమాదాలు సంభవించవచ్చు. అందుచేత ప్రతి ప్రాజెక్టు స్థలంలోనూ సమస్త ఆధునిక సౌకర్యాలు, ఔషధాలు కలిగిన ఆసుపత్రి విధిగా వుండి తీరాలి. ప్రతి పెద్దప్రాజెక్టుకూ శంకుస్థాపనోత్సవం జరపడంతోపాటు ఆ పరిసరాలలోనే ఉత్తమ తరగతి ఆసుపత్రి భవనానికికూడా శంకుస్థాపనోత్సవం జరగాలి. అందులో పనిచేయడానికి తగినంత మంది ఆడ, మగ వైద్యులను ఏర్పాటు చేయాలి. అప్పుడుగాని ఆకస్మికంగా అంటువ్యాధులను, ఇతర ప్రమాదాలను నివారించడం సాధ్యపడదు.

* * *

"ఆకాశవాణి కేంద్రంనుంచి ప్రసారమయ్యే గీతావళిలో తరుచూ అపస్వరాలు వినవస్తున్నవి," అన్నారు శ్రీ విస్సా అప్పారావు, ఈ మధ్య తెనాలిలో జరిగిన ఒక సభలో ప్రసంగిస్తూ అనేకమంది కళాకారులకు భక్తిపరులకు 'అవకాశవాణి'గా ఉపయోగ పడుతున్న తెలుగు 'ఆకాశవాణి' నిన్న మొన్నటి వరకూ "హీన స్వరం"గానే వుండేది. అందుచేత, ఏ "అపస్వరాలు" ప్రసారమైనా చెలామణీ అయింది. ఇటీవల జరిగిన పెద్దయంత్రం ఏర్పాటుతో దాని స్వరం కూడా పెద్దదయిందికాబట్టి, ఇకమీద అందులో అపస్వరాలేగాక, గార్దభ స్వరాలుకూడా రాకుండా నిర్వాహకులు చూడవలసి వుంటుంది.

* * *

(56-వ పేజీ చూడండి)

చెమట దుర్గంధమునకు, సామాన్య చర్మ వ్యాధులకు

వైజ్ఞానికంగా సరి క్రొత్తగా కనిపెట్టబడినది

ఎక్టమర్

ఇప్పుడు భారతదేశమందు, సౌందర్యమునిచ్చు సబ్బులో నున్నది

చర్మ క్రిములను చంపునట్టి ఔషధములు, మంచివి, చెడ్డవి, చాలా కాలమునుండియు తెలిసియున్నవే ...క్రొత్తదేమిటనగా, చాలా కాలము నిలవుండునట్టి గుణము గలది, అట్టి కనిపెట్టబడినది, మాన్‌సెన్‌టోవారి 'ఎక్టమర్' (బైత్యోనాల్)

ఈనాడు, మీరు భారతదేశమందు 'ఎక్టమర్'తోగూడిన టాయిలెట్ సబ్బును కొనగలరు : అది బ్రీజ్ ! ఆలోచించండి — మీరు ప్రతి రోజూ ఉపయోగించుచూ, బ్రీజ్‌ను 3 బిళ్లలవరకూ మాత్రమే వాడిన తరువాత మీ చర్మము దాదాపుగా క్రిమిరహితమైనదగును. మీరు క్రిమిరహితమైన చర్మమువల్ల ఏమి లాభమును పొందెదరో దిగువ వివరింపబడినది.

* చెమట దుర్గంధము తొలగింపబడును — చర్మ క్రిములు దానిని కలిగించును
* చర్మ వ్యాధులనుండి రక్షణ — ఈ క్రిములు సామాన్యమైనట్టి అనేక చర్మ వ్యాధులను గలిగించును.

మీరు బ్రీజ్‌ను ఇష్టపడెదరు — దీని విషయంలో కొంత ఎక్కువ ప్రత్యేకత గలదు. ఇది పరిమళమైనట్టి, శమనకరమైన, సౌందర్యమునిచ్చు సబ్బు ఇది చర్మమును కాపాడునట్టి 'ఎక్టమర్'ను గలిగియున్నది. బ్రీజ్ ఇతర సబ్బులకంటె కొంచెమే ఎక్కువ ఖరీదుండును. మీరు దీనిని చాలా కాలము వరకూ ఉపయోగించుకొనవచ్చును.

నేడే బ్రీజ్‌ను కొనుడు



ఈ సౌందర్యమునిచ్చు సబ్బు ప్రత్యేకమైనది — అది బ్రీజ్

బ్రీజ్

టాయిలెట్ సబ్బు

'ఎక్టమర్'ను గలిగియున్నది

ఆరామిక్ కంపెనీ లిమిటెడ్: లండన్. వారి తరఫున భారతదేశంలో తయారుచేయబడినది

BR. 1-X66 TL

★ 'అప్సరస' ★

"ఎలాంటి పరిస్థితులలోనైనాసరే భారత ప్రభుత్వం అణుశక్తి నెన్నడూ విధ్వంసక లక్ష్యాల కుపయోగించదు" అన్నారు శ్రీ నెహ్రూ మొన్న జనవరి 20వ తేదీని బొంబాయిలో అణుశక్తి ఉత్పాదక యంత్రానికి (రియాక్టర్) ప్రారంభోత్సవం చేస్తూ.

ఒక్క రష్యాలోతప్ప, ఆసియాలో ఇంత వరకే ఇతర ప్రభుత్వము ఇలాంటి అణుశక్తి ఉత్పాదక యంత్రం నెలకొల్పలేదు.

ఈ సందర్భంలో ప్రసంగిస్తూ డాక్టర్ హెచ్. జె. భాభా (అణుశక్తి అభివృద్ధి సంఘాధ్యక్షుడు) ఈ యంత్రం అవశ్యకతను గురించి కొన్ని ముఖ్యవిషయాలు సమావిష్టులయిన సభ్యులకు తెలియజేశారు.

ఆధునిక నాగరకత బాగా పెంపొందాలంటే, పుష్కలంగా విద్యుచ్ఛక్తి లభించాలి. విద్యుచ్ఛక్తి వాడకాన్నిబట్టి ఆయా దేశాల పారిశ్రామిక పురోభివృద్ధి లెక్కకట్టవచ్చును.

అయితే, భారతదేశంలో సగటున మనిషికి 110 టన్నుల రాతిబొగ్గు మాత్రమే లభించగలదని అంచనా వేశారు. ఇక మిగిలిన జలవిద్యుచ్ఛక్తి సప్లయి, నూనెగనుల సప్లయి కూడా చాలా తక్కువే.

మనం మిగిలిన నాగరకదేశాలతో సమానంగా ముందడుగు వెయ్యాలంటే, దేశంలో అణుశక్తి పెంపొందించుకోవలసిన అవసరం చాలా ఉంది.


ఖనిజాలు

మన దేశంలో దొరికే రాతిబొగ్గు సప్లయికంటె థోరియం, యురేనియం మొదలైన అణుశక్తి ఉత్పాదక ఖనిజాల సప్లయి 15 రెట్లు ఎక్కువ అని శాస్త్రజ్ఞులు తేల్చారు. ఈసప్లయి ముందుముందింకా ఎక్కువ కాగలదని కూడా అనుకొంటున్నారు.

రాతిబొగ్గు, పెట్రోలు మొదలైనవాటి వల్ల ఉత్పత్తిఅయ్యే విద్యుచ్ఛక్తికన్న అణుశక్తి ఖనిజాలవల్ల ఉత్పత్తిఅయ్యే విద్యుచ్ఛక్తి బాగా చవకగా ఉన్నప్పుడే ప్రజాసామాన్యానికి దానివల్ల ఎక్కువ సదుపాయా లేర్పడతాయి.

ప్రస్తుతం బొంబాయిదగ్గర ఎలిఫెంటా గుహల సమీపంలో అణుశక్తి ఉత్పాదక యంత్రం (స్విమ్మింగ్ పూల్ ఏటమిక్ రియాక్టర్) ఏర్పరిచారు.

దీనివల్ల మున్ముందు తయారుకాబోయే విద్యుచ్ఛక్తి యూనిట్ వెల ఇంచుమించుగా అర్థణాకన్న ఎక్కువ ఉండదని అంచనా వేశారు. దీని నిర్మాణానికి కెనడా, ఇంగ్లండు దేశాలు చాలావరకు సాయపడ్డాయి.



ఆంధ్రప్రదేశ్ రైఫిల్ సంఘం హైదరాబాదులో జరిపిన పోటీలలో గెలుపొందినవారికి గవర్నరు శ్రీ త్రివేదీ బహుమతులు అందించారు.

రాతిబొగ్గుగనులకు బాగా దూరంగా ఉన్న ఢిల్లీ, మద్రాసు వంటి నగరాలలో 140 "మెగవాట్ల" విద్యుచ్ఛక్తి కేంద్రం పనిచెయ్యాలంటే రోజుకి 2 వేల టన్నుల రాతిబొగ్గు సప్లయి కావాలి. దీని రవాణాకు 17 వందల వాగనులు నడపాలి. సరీగా ఇంతే విద్యుచ్ఛక్తి ఉత్పత్తి చేసే అణుశక్తి ఉత్పాదక కేంద్రానికి 50 మొదలు నూరు టన్నుల యురేనియం చాలు.

అదీగాక మనదేశంలో ముందుముందింకా, గొప్ప శక్తి కలిగిన అణుశక్తి ఉత్పాదక కేంద్రాలు నిర్మించాలంటే "యురేనియం 235, 233, ప్లూటోనియము కావాలి.

ప్రస్తుతం భారతదేశంలో ఏర్పరిచిన అణుశక్తి ఉత్పాదక యంత్రంలో పై ఖనిజాలను కూడా అవసరమైనట్లు తయారు చేసుకొనే అవకాశా లున్నాయి. ప్రస్తుతం ఈ ఖనిజాలకోసం పైదేశాలమీద ఆధారపడవలసి వస్తోంది.

బొంబాయిలో ఏర్పాటుచేస్తున్న అణుశక్తి ఉత్పాదక కేంద్రంవల్ల ఇంకొక ఉపయోగం కూడా ఉంది.

"ఘనజలం"

భారతదేశంలో "ఘనజలం" ఉత్పత్తి చెయ్యవలసిన అవసరంకూడా చాలా ఎక్కువే. బొంబాయిలో ఏర్పరిచే అణుశక్తి ఉత్పాదక కేంద్రం ఈ ఘనజలంఉత్పత్తికికూడా చాలా సహాయకారి కాగలదు.

పరిశోధన


మన అణుశక్తి ఉత్పాదక కేంద్రంలో శాస్త్ర పరిశోధకులకు చాలా అవకాశాలున్నాయి. ప్రస్తుతం వచ్చే జూన్‌నించీ ఈ కేంద్రంలో 250 మంది శాస్త్ర పరిశోధకులకు పరిశోధనావకాశాలు కల్పిస్తున్నారు. ఈ పరిశోధనకు భారతదేశంలోని వివిధ విశ్వవిద్యాలయాలపట్టభద్రులకే ఎక్కువగా అవకాశా లేర్పాటు చేస్తున్నారు. హరి సంఖ్య క్రమక్రమంగా 350 వరకు పెంచాలని కూడా అనుకుంటున్నారు.

"అప్సరస"

ఈ అణుశక్తి ఉత్పాదక కేంద్రం ఈత చెరువు ఆకారంలో నిర్మించారు. కనక నే భారతీయ శాస్త్రజ్ఞులు దీనికి 'అప్సరస' అని పేరుపెట్టారు.

ఈ 'అప్సరస' నిర్మాణానికి రష్యాదేశం కూడా సహాయంచేసింది. ప్రస్తుతం ఈ కేంద్రానికి కావలసిన 20 టన్నుల 'ఘనజలం' అమెరికా విద్యుచ్ఛక్తి సంఘం సప్లయి చేసింది.

ప్రాక్పశ్చిమ దేశాల సౌహార్దసహకారాలతో ఎలిఫెంటా గుహాల సమీపంలో అవతరించిన 'అప్సర' ఆసియాలో నూతన పారిశ్రామికాభివృద్ధికి నాందీదేవత కాగలదని శాస్త్రజ్ఞు లాశిస్తున్నారు. ★



బుడుగు! చిచ్చుల పిడుగు



[illegible]

కాని, మద్రాసులో పదిరోజులో అయ్యాక, నాన్నా అమ్మా నేనూ మెడ్రాస్ వెళ్ళిపోయాం. మెడ్రాసేగా మా అసలు నిజం ఊరు. అందుకు.

మా అబద్ధంవూళ్లో చిట్టిగాడూ వాళ్లూ నాతో వస్తామన్నారు మెడ్రాసు. నేను వాళ్లకి ఉత్తుత్తి టిక్కెట్లిచ్చాను కూడా. కాణీకి రెండు పెట్టి కొనుక్కున్నారు.

తరవాత మా నాన్నకి వాళ్ళని చూపించి యింకో వ్వది టిక్కెట్లు కొనమని చెప్పాను మెడ్రాసుకి.

కాని పాపం నాన్నదగ్గర చాలా కాణీలు లేవుగా. అందుకని కొంటా నని అబద్ధం చెప్పాడు.

నాకో టిక్కెట్టూ అమ్మకో టిక్కెట్టూ కొన్నాకా, డబ్బులు అయిపోయాయి. అందుకని నాన్నకి అరటిక్కెట్టు కొన్నాడు. అర టిక్కెట్టు అంటే ఇలా చింపి చిన్న ముక్క యిస్తారులే...యింకా నా సామానులు బండీచక్రం, గులకరాయిలూ, గోళీకాయిలూ, విరిగిపోయిన పక్కింటి పిన్నిగారి రేకుపెట్టి, వాళ్ల ముగుడు కోటూ, కళ్లజోడూ (అద్దాలు వాళ్లింట్లోనే పారేశానులే. మనదగ్గిరుంటే తులాగా విరిగి



[illegible]

పోతాయికదా) అవన్నీ తులా తేవడం.

ఇక్కడే వుంచెయ్యి, అవన్నీ బూడుసురైల్లో వస్తాయీ అలా అని చెప్పాడు నాన్న. కాని, నాన్నకేం తెలుసు. అలాటివి బూడుసు రైల్లో వేస్తారా.

అందుకని, నేనే నాన్నకి చెప్ప కుండా, వాడిపెట్లో నా సామానులు సర్దేసి, వాడి కోట్లూ పుస్తకాలూ అవన్నీ జేబులో దాచేశా ననుకో.


కావలిస్తే అవే బూడుసు రైల్లో వస్తాయి. బూడుసురైలు మెల్లిగా పరిగెట్టుతుందిట. మెడ్రాసు రైలు గబగబ పరిగెట్టుతుంది.

ఇప్పుడు బాబాయి, నేను షికారు వెళ్తాంగదా. అప్పుడు సుబ్బలష్మి వాళ్ల వీధిలో వుంటే బాబాయీ నేనూ బూడుసురైల్లా వెళ్లాలిట. ఇలా అని బాబాయి చెప్పాడు.

యేం? అంతట్లోకే సుబ్బలష్మి తాతయ్య వీధిలోకి వచ్చాడుగదా. అప్పుడు మేం మెడ్రాసురైల్లా పరిగెత్తుకెళ్లిపోతాం. అదన్న మాట.

యేం. మేం జామని జటకా ఎక్కి రైలు దగ్గిరికొచ్చాంగదా. అప్పుడేనన్న మాట నేను పోలీసువాడితో మాట్లాడేశాను.

కొంచెం డేంజరే అనుకో పోలీసుతో మాట్లాడం. గాని మనకి ధైర్యం ఉండాలిగా.



నేను మెల్లాగా పెట్లో వస్తా! — మీరిద్దరూ అందులో వెళ్ళండహో—

ధైర్యం అంటే పోలీసుతో మాట్లాడం అని అర్థం.

ధైర్యం అంటే సుబలక్ష్మితో మాట్లాడం అనికూడా అర్థంట. ఇలా అని బాబాయి చెప్పాడు.

ధైర్యం అంటే బుడుగ్గాణ్ని బజారుకి తీసి కెళ్ళడం అనికూడా ఇంకో అర్థం ఉందిట. నాన్నకి ఇలాటి ధైర్యం లేదు. ఇలాఅని అమ్మ అంటుంది.

కాని, అస్సలు రైటు ఏమిటంటే పోలీసుతో మాట్లాడమే. మీసాల పోలీసుతో మాట్లాడితే ఇంకా గొప్పగదా. నేనోసారి నాన్న ఎత్తుకున్నపుడు ఓ పోలీసుని టైమెంత అని అడిగేశా.

టైమెంతటం అంటే నాకు తెలీదు. ఏం. ఆ పోలీసు విన లేదనుకో.

రైలుదగ్గర ఎందుకు మాట్లాడానంటే, మా నాన్నని రక్షిద్దామని. మరి మానాన్న అర టిక్కట్టు కొన్నాడుగా. ఒకవేళ నాకోసం ఏమోనని అడిగితే, నాన్నకేనని అమ్మ చెప్పింది. కాదూ, అమ్మకోసం అని నాన్న చెప్పాడు.

యలాగేనా శేంజరని నాకు అవమానం వేసింది. పోలీసుని చూశాక బయం వేసింది నాక్కూడా. అందుకని పోలీసునే అడిగేశాను. అసలు బుడుగుకి టిక్కట్టు కొన్నారా అని అడగండి పోలీసు వాడూ అని చెప్పేశా.

పోలీసువాడు మంచివాడే. నన్ను ఇలా ఎత్తుకుని ముద్దు పెతేస్కున్నాడు. నాకోక్కపం వచ్చింది. కాని వూరుకున్నాను పోలీసుగదా అని. అపుడు వాడు, నాన్నని అడిగాడు బుడుక్కి టిక్కట్టు కొన్నారా అని.

కొన్నానని నాన్న చెప్పాడు.

అపుడు రైలొచ్చింది.

నాన్నేమన్నాడంటే అమ్మని ఆడవాళ్ళ పెట్టిలోఎక్కి పొమ్మన్నాడు.

నాకు బలే బయం వేసింది. అమ్మకి కూడా బయం వేసింది. ఎందుకంటే, ఆడవాళ్ళ పెట్టిలో అందరూ పోట్లాడతారు. ఎవళ్ళూ చోటెయ్యరు. జరగమంటే జరగరు.

నేను ఎక్కను బాబూ అంది అమ్మ.

నేను పరిగెడుకుని ఇంజను డ్రైవరు దగ్గిర కెళ్ళిపోయా.


ఫది బీడీలిస్తాను నన్ను రైలు తోలనిస్తావా అన్నాను. కాని వాడిదగ్గిర ఛాలా సిగరెట్లు లే వున్నాయి.


అందుకని బీడీలు ఒద్దన్నాడు.

మా అమ్మదగ్గిర కెళ్ళిపో అన్నాడు.

చివరికి ఏంచేస్తాం. నేనుకూడా అమ్మతో ఆడాళ్ళ పెట్టిలో ఎక్కిపోయాం

హబ్బబ్బ. ఈ ఆడాళ్లు ఉత్తప్పుడు మంచి





★ బుడుగు! చిచ్చుల పిడుగు! ★

వాళ్లే గాని, రైల్లో బలే చెడ్డవాళ్లు లే.

మనం వెళ్తాం. మనం మొగాళ్లం కదా. అయినాసరే నీపేరేమిటి బుడుగూ అని అడుగుతారు. పోనీలే అని బుడుగు అంటామా. అన్నాక, నా తండ్రే అని ఇలా ముద్దుపెట్టేస్కుని మనబుగ్గలు ఎంగిలిచేస్తారు. యింక మనం వద్దనిచెప్పినా వినరు. ఈ త్రిగోలు.

ఇంక మనమాటే వినకపోతే మరీ చిన్న పిల్లలమాట ఏంవింటారూ. చిన్న పిల్లలంటే, చాలాచిన్నవాళ్ళు లే. వాళ్లకి అస్సలు తెలుగు తెలీదు. వాళ్లనికూడా ఈ పెద్దాళ్లు నీపేరేమిటీ, నీముక్కేదీ, మీ అమ్మేదీ ఇలా అని గట్టిగా అడుగుతారుగదా.

అపుడు ఆ పిల్లాడు వాళ్లకేసి చూస్తాడు గదా.

అప్పుడు ఈ పెద్దాళ్లు, ఏ ఈ ఇక ఈ మా అమ్మ కాదు, మా నాన్న కాదు అని గట్టిగా అంటారుగదా. వాడు ఉంగాఉంగా అని అంటాడు.

ఉంగా అంటే కాదుఅని అర్థం.

మరి వాడు వాళ్లకి అన్నీ కాదంగా ఉంగా అంటే ఒద్దుఅని, తెలుసుకూడా అర్థం ఉంది.

అదిపెద్దాళ్లకి తెలీదు మరి. ఇపుడు, మన్ని ముద్దిస్తావా అంటారనుకో. మనం ఇవ్వద్దు అనుకున్నా ఇస్తానుఅని అబద్ధం చెప్తాంగదా. అలాఅంటే ఓకాణీ ఇస్తారు వాళ్లు.

మరి చాలా చిన్నపిల్లాడిని అడిగితే వాడు ఉంగా అంటాడు. ఉంగా అంటే ఒద్దు అని అర్థంగదా. మరి వాడికి కాణీ అక్కర్లేదుగా. అందుకని ఒద్దు అని నిజం చెప్తాడు.

అప్పలు వాడు అబద్ధం చెప్పాలన్నా చెప్పలేడు.

ఎందుకంటే వాడికి తెలుగు రాదుగా మరి. తెలుగొస్తేనే అబద్ధం చెప్పొచ్చును. తెలుగు రాకపోతే నిజం కూడా చెప్పలేంగా.

అందికని వాడు ఉంగా ఉంగా అని ఏడుస్తాడు. ఈ పెద్దవాళ్ళు వాడి మాట వినరుగా.


వీళ్ళుకూడా అందరూ కలిసి ఇంకా గట్టిగా ఉంగా ఉంగా ఉంగా ఉంగా అని కేకలేసి వాణ్ణి ముద్దులు పెట్టేస్కుంటారు ఒక్క కాణీకూడా ఇవ్వకుండా.


అందికని ఈ పెద్దవాళ్ళు చిన్నపిల్లల ఉంగా ఉంగా తెలుగు నేర్చుకోవాలి.

సుబ్బలష్మి వాళ్ళు బాబాయి కూడ తెలుగు నేర్చుకోవాలిట. ఇలా అని బాబాయి అన్నాడు.

నేను దీన్ని గురించి కొంచెం సలహాలు ఇస్తాను. ఇది ఇంకో అయిపో ఉంగా.

(ఇంకా ఉందిగా)





పాకిస్థాన్ చేస్తున్న విషప్రచారం

శ్రీ కృష్ణ
[ఆంధ్రపత్రిక ప్రతినిధి]

ఈ నెల 16 వ తేదీన ఢిల్లీ పత్రికల్లో మొదటి పేజీలలో రెండురకాల వార్తలు కనిపించాయి పాకిస్తాన్ విదేశాంగ మంత్రి ఫిరోజ్ ఖాన్ నూన్ చేసే భారత వ్యతిరేక ప్రచారం ఒకటీ; పాకిస్థాన్ వాణిజ్య మంత్రి అబుల్ మన్సూర్ అహ్మద్ భారతి రాష్ట్రపతికోసం స్వయంగా తేనె కొన్క తీసుకొచ్చారనేది రెండోది. అవసరాన్ని బట్టి పాకిస్థాన్ చేదుగాను, తీయగానుకూడా మాట్లాడగలదు. ఏదన్నా కావలసివచ్చినప్పుడు పాకిస్తాన్ తేనెకంటె తీయగా మాట్లాడగలదు.

ఇదివరకొకసారి ఇలాగే జరిగింది. పశ్చిమ పంజాబుకు నీటిసప్లయిని భారతదేశం ఆపు చేసింది. మళ్లీ నీళ్లు వదలమని బ్రతిమాలడానికి కీ॥ శే॥ గులాం మహమ్మద్ వచ్చాడు. వచ్చి కల్లబొల్లికబుర్లుచెప్పి బుద్ధిమంతుడిలాగా ఒడంబడికమీద సంతకం పెట్టాడు. తరవాత ఆఒడంబడికను పాకిస్తాన్ ఎప్పుడూ మన్నించిన పాపానపోలేదు. కాలవనీటికి రావలసిన సుంకాన్ని చెల్లించడం ఎప్పుడో ఆపు చేశారు.

సర్ ఫిరోజ్ ఖాన్ నూన్ న్యూయార్కులో మాట్లాడుతూ, పాడినపాటే పాడారు. కాశ్మీర్ సమస్య సజావుగా సరుకుపోతే, పాకిస్థాన్ ఇంకెప్పుడూ భారతదేశంతో పేచీ తెచ్చుకోదట. ఉభయ దేశాలూ సోదర భావంతో తులతూగి పోవచ్చుట. లక్నోలో కాంగ్రెసు - లీగ్ ఒడంబడిక జరిగి నప్పటినుంచీ ఈ పాట విని పిస్తూనే ఉంది. పాకిస్థాన్ ఇస్తే హిందూ ముస్లిముల మధ్య శాశ్వత ప్రేమ ఏర్పడుతుందని జిన్నా అనేవాడు. పాకిస్తాన్ వచ్చేసింది. ఇప్పుడు కాశ్మీరు సమస్యకూడా తేలిపోతే శాశ్వత ప్రేమ ఏర్పడుతుందని పాట మొదలెట్టారు. హిందువులతో సమాధానపడే ఉద్దేశమే పాకిస్తానీ ముస్లిములకున్నట్లు లేదు. ముస్లిం లీగ్ తత్త్వం వారికి బాగా వంట బట్టిపోయింది. అది నశించనంతకాలం భారతదేశానికి పాకిస్తాన్‌కీ మధ్య పచ్చగడ్డి కూడా మొలవదు, భారతదేశపు స్నేహాన్నైఖరి బలహీనతకు చిహ్నమనే భ్రమ పాకిస్తానీలకు పోదు.

ఫిరోజ్ ఖాన్ నూన్ బ్రిటిష్ వారి "పెంపుడు రాజకీయ నాయకుడు". అతడు భక్తి విశ్వాసాలతో బ్రిటిష్ వారిని కొలిచి, వారివల్ల లబ్ధిపొందాడు. బ్రిటిష్ రాజరికం ఈ దేశంలో మునిగిపోయే సమయంలో చల్లగా ఒడ్డుకు చేరుకున్నాడు. మహమ్మద్ అలీజిన్నా అతని తత్త్వం కాచివడపోసిన మనిషి గనుక ఎప్పుడూ అతన్ని నమ్మలేదు. చాలకాలం అడుగున అణిగిమణిగి ఉండి, ఇప్పుడు మరో రాజకీయ అవకాశవాది పాకిస్తాన్ ప్రధాని కావడంలో, మళ్ళీ పైకి తేలాడు. భారతదేశాన్ని దుమ్మెత్తిపోస్తూ

(55-వ పేజీ చూడండి)



భారతదేశం చూడవచ్చిన సిరియా అధ్యక్షుడు షుక్రీ అల్ కువాట్లీతో భారతరాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధానమంత్రి.

ఆ ఘడియ రావాలి

[సన్నగా రేడియో సంగీతం...టేబుల్సూ కుర్చీలూ, సోఫాలూ సర్దుతున్న చప్పుడూ.]

సిమ్మాద్రి : ఏటో! అంతా యిసిత్రం! సిన్నమ్మగోరు సక్కంగుంటారు...సదువుకుండారు. అయినా ఏటో ఒక్క సమ్మందం కరారవటంలేదు. ఈతూరయినా కరారయితే బాగుణ్ను. చూస్తుండాగందా...

భారతమ్మ : (ప్రవేశిస్తూ) ఏమిటి సిమ్మాద్రీ! చూస్తున్నానంటున్నావ్?

(రేడియో ఆఫ్ చేసిన శబ్దం)

సిమ్మా : ఇంకేటుందమ్మా! సిన్నమ్మగోరి పెళ్లిసమయమే అనుకుంటుండా. ఆ బగమంతుడు ఎక్కడ రాసిపెట్టిండో అని.

భార : (దీర్ఘంగా నిట్టూర్పి) అదే నా దిగులూ సిమ్మాద్రీ! అమ్మాయికి మొన్న సంక్రాంతికి పదహారెళ్ళు పదిహేడుకూడా వచ్చింది. ఇప్పటికి పది సంబంధాలదాకా చూశామా? ఒక్కటీ కుదరకపోయె! ఇదయినా ముడిపడితే బాగుండును.

సిమ్మా : అబ్బాయిగారిది ఏ ఊరమ్మగోరూ!

భార : గుంటూరటరా

సిమ్మా : ఏం సదువుకుండరూ?

భార : ఇంజనీరింగు చదివాడట.

సిమ్మా : ఉద్దేగం సేత్తుండరా? ఇంకా సదుకుతుండరా?

భార : ఉద్యోగమే.

సిమ్మా : మరి గట్టయితే మన సిన్నమ్మగోరికన్నా ఎర్రంగా, అందంగా ఉంటరా?

భార : ఏమోసిమ్మాద్రీ! నేనుమాత్రం చూశానా?!

సిమ్మా : బాబుగారు సెప్పలేదూ?

భార : ఆయన మాత్రం ఎప్పుడు చూశారూ?

సిమ్మా : అదేటమ్మగారూ! ఎవరూ సూడకుండా ఆ అబ్బాయిగోరట్ట తెల్సూ?!

భార : ఈ రోజుల్లో అంతేరా. ఆ అబ్బాయేమో పేపర్లో ప్రకటించాడట తనకు పెళ్లి చేసుకోవటానికి ఒక చదువుకున్న అందమయిన బ్రాహ్మణపిల్ల కావాలని...

[మమ్మీ! మమ్మీ!!—అని దూరం నుండి సంధ్య పిలుపు]

భార : ఇక్కడే! వంటయింటిలో.

సంధ్య : (ప్రవేశించి) టేబుల్ మీది బుక్స్ తీశావా?

భార : [illegible]

పాత్రలు :

రామనాథం, భారతమ్మ,

సంధ్య, సిమ్మాద్రి

అబ్బాయి వచ్చే టైమవుతుంటే.

సంధ్య : టైమవుతున్నది కాబట్టే.

భార : అంటే.

సంధ్య : అంటె అంతేనేమమ్మీ! ఆ నావల్స్ యీ గదిలో ఉండాలి యీపూట.

భార : నీదంతా సోద్యమమ్మా.

సం : నీ కర్థంకాదుమమ్మీ.

భార : ఏం మమ్మీయే చంపుతున్నావ్ శుభ్రంగా అమ్మా అనలేవూ రోజూలాగా.

సం. ఈపూట కంతేనేమమ్మీ! అలా పిలిస్తేనే మనం కల్చర్డు అన్నమాట.

సిమ్మా : కల్చెడ్ అంటే కలకటేరనా సిన్నమ్మగోరూ?

సం : నాన్సెన్స్...కల్చర్ అంటే సంస్కృతి...అలా ఉంటేనే మనం నాగరికులం అనిపించుకుంటాం.

భార : బాగానే ఉందమ్మా. మీరూ, మీ నాగరికతా.

(రోడ్డుమీద కారాగిన శబ్దం)

రామనాథం : (లోపలికి వచ్చి) ఏమిటి నాగరికత అంటున్నావ్?

భార : సరే! దానికేమిలేగాని అబ్బాయి రాలేదూ?

రాము : ఏ అబ్బాయీ?

భార : మనఅబ్బాయేనండీ, భాస్కరం.

రాము : మెయిల్ పోయిందే! వస్తే ఈ వేళకు యింటికి రావాల్సిందే నే.

సంధ్య : రాలేదు కాబోలు.

రాము : ఇదిగో సిమ్మాద్రీ! అలా బయట కూర్చో.

సిమ్మా : మర్చిపోయా అల్లుడుగారు వత్తరుకదూ.

కొండముది హనుమంతరావు

[సిమ్మాద్రి నిష్క్రమణ]

రాము : అమ్మాయ్! అంతా అయినట్టేగదూ.

సం : ఫినిష్ డాడీ.

రాము : దట్సాల్ బాగుంది డెకరేషన్.

భార : ఒక్కడే వస్తాడో...ఇంకా...

రాము : ఇంకా గింకానై తనొక్కడే వస్తానన్నట్లు రాశాడుగా.

భార : ఎక్స్‌ప్రెస్‌కు వస్తాడా?

సిమ్మా : (ప్రవేశించి) బాబుగారూ... అబ్బాయిగారు-అదే అల్లుడుగారు-వచ్చిండు.

రాము : అబ్బాయివస్తే వాకట్లో నిలబెట్టారుట్రా తెలివితక్కువ దద్దమ్మా!

(యువకుడు ప్రవేశం)

రాము : హల్లో! రండి. రండి. మీకోసమే వెయిట్ చేస్తున్నారా.

యువ : (త్రుళ్ళిపడి) నాకోసం...... మీరు...వెయిట్ చేస్తున్నారా?

రాము : అమ్మాయిని చూడటానికి ఎక్స్‌ప్రెస్‌కు వస్తున్నామని రాశారుగా.

యువ : (తేప్పరిల్లి) సర్లెన్లీ......నిన్నే మీకు చేరి ఉంటుంది ఆలెటర్.

రాము : ఆఁ! అంతే! అమ్మాయ్ సంధ్యా! కాఫీ, ఫలహారం తీసుకురా.

(కమింగ్ డాడీ—లోపలినుండి సమాధానం)

[సంధ్యా కాఫీ ఫలహారాలతో ప్రవేశం]

రాము : కూర్చో సంధ్యా! (యువకునితో) మొన్న మార్చిలో ఇంటర్ పరీక్షకు కూర్చుందండీ.

యువ : (సంధ్య నుద్దేశిస్తూ) సైన్సా? ఆర్ట్సా?

సం : బై. పి. సి.

యువ : బి పి. మంచిగ్రూపే సెలెక్ట్ చేశారు.

రాము : చూడండీ! ఈ రోజుల్లో సైన్స్ ఎంతగా డెవలప్ అవుతున్నదో! ఆర్ట్స్‌లో ఏముందండీ.

యువ : ఏం డెవలప్‌మెంట్ లెండీ... ఒకరు హైడ్రోజన్ బాంబ్ కనిపెట్టే మరొకరు కోబాల్ట్ బాంబు— ఎందుకు వచ్చిన బాంబులు (సంధ్యతో) క్లాస్ ఎక్సెప్ట్ చేస్తున్నారా?

సం : జస్ట్ రావచ్చును.

యువ : (టేబుల్ మీది నావల్స్ చూసి) మీరు నావల్స్ చదువుతారు లాగుందే!

భార : ఎక్కువగా చదువదు నాయనా! ఎప్పుడో, ఏమీ తోచనప్పుడు.

యువ : చదువుతే తప్పేటండీ.

రామ : ఇంగ్లీషే ఎక్కువ చదివిస్తుంటాను...అందుకే కొస్త ఇంగ్లీషులో మాట్లాడగలదు. అదిగాకబోయినా అసలు తెలుగులో గొప్ప రచనలేమున్నయ్ ?

యువ : అదేం మాటలెండీ! మన తెలుగులో కూడా యీనాడు పాశ్చాత్య సాహిత్యంతో తులతూగే రచనలు వస్తున్నయ్యండీ.

రామ : అవుననుకోండీ... అవి చదువుతుంటుంది.

యువ : సంగీతంలో ప్రవేశం ఉందా?

భార : లేకేం నాయనా! త్యాగరాయ కృతులు ఎంతో చక్కగా పాడుతుంది.

రామ : అవన్నీ చిన్నప్పుడు నేర్పించినవి లెండీ...అవి అంతగా రావుగాని... హిందీ పాటలు బాగా పాడుతుంది. ఈనాడు నిజం చెప్పాలంటే త్యాగరాయ కృతులూ జావళీలూ పాడేవారెరూ? వినేవారెవరూ ?

యువ : మై గుడ్నెస్! మీరు చాలా పొరపడుతున్నారు. నేనుమాత్రం కర్ణాటక సంగీతం అంటే చెవికోసుకుంటానుసుమండీ! చచ్చు సినిమాపాటల్లో ఏముందండీ!

భార: అందుకనే నాయనా! రోజు సాయంత్రం కాలేజీనించి వచ్చాక ఓ అరగంటయినా వీణమీద పాడుకోందే ఊరుకోను.

యువ: ఇంట్లోమరి ఎవరో ఒకరు పట్టించుకోపోతే ఎలా? అన్నట్లు మర్చాను. మీ అబ్బాయి భాస్కరం రాలేదా!

భార: ఫలానాసాడు అమ్మాయిని చూడటానికి వస్తున్నారు. ఆనాటికి రావాల్సిందీ అంటూ ఉత్తరంకూడా రాయించాను.

రామ : రావాల్సిందే నండీ!-ట్రెయిన్ మిస్ అయాడేమో.

యువ. కాకినాడలోనే కదూ చదువుకుంటున్నాడు.

రామ: అవును!-థర్డ్ బి. ఇ.

యువ: ఫలానా అందుకు రాలేకపోతున్నానూ అంటూ ఉత్తరం ముక్క రాయలేదూ.

సిమ్మ: (ప్రవేశించి) బాబుగారూ! ఎవరో సదువుకుంటే అబ్బాయి లాగుంది వచ్చిందు.

రామ: మాట్లాడుతున్నారని చెప్పు. (సిమ్మద్రి నిష్క్రమణ)

భార: నేను యింటికి వచ్చినప్పుడల్లా చెప్తూనే ఉంటాను నాయనా. వారానికోసారయినా ఒక ఉత్తరం ముక్క రాస్తుండమని. ఎప్పుడో దబ్బువసరమయినపుడు రాస్తుంటాడు.

★ ఆషాఢము రావాలి ★

సం: అందులో ఎంతడబ్బు కావాల్నింది రాస్తుంటాడు అంతే!

యువ: అంతేనండీ! చాలామందికి అలవాటుండదండి ఉత్తరాలు రాయటం.

సం: అలవాటు లేకపోవటంకాదు-బద్దకం అని నేనంటేమా మమ్మీ ఏమాత్రం ఒప్పుకోదు.

రామ: ఆ బద్దకం డబ్బవసరమయినపుడు మాత్రం ఉండదు లెండి.

యువ: చాలా బాగా చెప్పారు. అయితే క్రిందటి నెలలో డబ్బవసరమయినపుడు రాసి ఉంటాడు.

భార: నిజం చెప్పావు. అర్జంటుగా నాలుగువందలు పంపించమని రాశాడు. పాపం. పిల్లాడికి ఎంత అవసరమో, ఏకష్టంలో ఉన్నాడోనని వెంటనే పంపమన్నాను.

రామ: అదికాదండీ, పిల్లలు ఎంత పంపమని రాస్తే అంత పంపటమేనా? మీరు చెప్పండి అసలు.

యువ: డబ్బుచేతిలో ఉంటే చెడిపోతారని మీ ఉద్దేశ్యం.

రామ: ఉద్దేశ్యమేమిటి? చాలా చోట్ల జరిగే విషయమే అది. అది ఫాక్టుకూడాను. ఏమంటారు?

యువ: నన్నడిగితే ఏమీ చెప్పలేనుగాని. ఐన్‌స్టీన్నడిగితే-సంధ్యాదేవిగారూ! ఐన్‌స్టీన్ పేరువిన్నారనుకుంటాను.

సం: అవునండి ఫిజిక్స్‌లో వింటాం... సాపేక్ష సిద్ధాంతం...థియరీ ఆఫ్ రెలటివిటి ఐన్‌స్టీన్ని అర్థం చేసుకోవటం చాలా కష్టం అటారు.

యువ: ఆ! ఆ! ఆ ఐన్‌స్టీనే. ఫాక్ట్ అనేది అసలీ ప్రపంచంలో లేదంటాడు. భూత, వర్తమాన భవిష్యత్తులనేవి ప్రదేశాన్ని పట్టి మారిపోతుంటయ్. న్యూయార్కులో ఉన్నవాని 'భవిష్యత్తు' ఇక్కడ తెనాలిలోఉన్న మనకు వర్తమానం కావచ్చు లేదా భూతంకావచ్చు. ఒక్కమాటలో చెప్పాలంటే కాలం అబ్సల్యూట్ టరమ్ కాదు. అందుకని ఫాక్టుఅనేది అసలు లేదంటాడు. అదంతా ఓగొడవలెండి. మనకెందుకిప్పుడు? ఇందాక సంధ్యాదేవిగారు అన్నట్లు ఐన్‌స్టీన్ని అర్థంచేసుకోవటం చాలా కష్టం. అయితే ఇంతకీ ఏవందో, రెండువందలో పంపివుంటారు భాస్కరానికి.

రామ: అంతకన్న ఎక్కువెందుకండీ!

యువ: డబ్బు అందుకున్న తర్వాత ఉత్తరమేమీ రాయలేదూ?

రామ: బద్ధకమని అనుకున్నాంకదూ.

యువ: ఓ అయాంసారీ! (కొంచెంఆగి) మీఅబ్బాయి నడవడిమీద మీకు నమ్మకమేనా!

భార: (త్రుళ్ళిపడి)అదేంమాటనాయనా! మాఅబ్బాయికేం? మాఅమ్మాయికేం? ఇంతవరకు మేమెన్నడు వేలెత్తి చూపించుకోలేదు.

రామ: సంప్రదాయం విషయం మీరెవర్నయినా విచారించుకోవచ్చు.

యువ: నాకా అనుమానమేమీ లేదండీ! అబ్బాయికి వివాహం కాలేదుకదూ.

భార: చేయాలి. ఇద్దరిదీ ఒకేసారి చేయాలనివుంది.

యువ: మీఅబ్బాయి ఒకఅమ్మాయిని ప్రేమించాడు.

సం: అది సహజం...ఆరోగ్యకరసూచన.

భార: మా భాస్కరానికి ప్రేమకూడానా? ఉత్తఅమాయకుడు మాఅబ్బాయి నీకు తెల్సునా?

రామ. మీరు మా భాస్కరాన్ని ఎరుగుదురా?

యువ: ఆఁ! తెల్సును.

సం: ఎవర్ని ప్రేమించాడంటారు?

యువ: పక్కింటి అమ్మాయిని.

సం: ఆ అమ్మాయికూడా ప్రేమించిందా?

యువ: ఆ భయమేమీ వద్దు. టూవే ట్రాఫిక్కే.

సం: ఇంక చిక్కేముంది? చక్కగా పెళ్లి చేసుకుంటారు.

భార: అంతా నీచేతిలోవున్నట్లు చెప్తున్నావే, సంగతీ, సంప్రదాయం విచారించుకోకుండా పెళ్లి చేసుకోవటమే.

రామ: మీకుబాగా తెల్సునా ఆవిషయం?

యువ: అంతవరకే కాదు. ఇంకా ఎక్కువ తెల్సును.

రామ: కథ ఎంతవరకు పోయిందంటారు?

యువ: చాలాదాకా పోయింది. ఆ అమ్మాయి గర్భవతిఅయింది.

భార: ఇదంతా నిజమేనా?

యువ: అక్షరాలానిజం...మీ అమాయకుడు...సుపుత్రుడు చేసిన ఘనకార్యం . మీతో చెప్పేధైర్యం లేకపోయింది. అవసరమంటూ అర్జంటుగా నాలుగువందలు పంపమన్నాడు.

సం: నాలుగువందలతో ఇద్దరూ లేచిపోదామనుకున్నారు కాబోలు.

యువ: అదేఉద్దేశం అయివుండవచ్చు. కాని నాలుగువందలు రాకపోవటంతో కథ అడ్డంతిరిగింది. రెండువందలతో ఒంటరిగా పరారయాడు. ఆమాత్రం రెక్కలు రాలేకపోలేదుగా!

సం: అంతా కథల్లోలాగా ఉన్నది.

యువ: కథల్లో రాసేవి కథల్లో తప్ప వాస్తవిక జగత్తులో జరగవనా మీ ఉద్దేశం.

రామ: మీరు మా భాస్కరాన్ని బాగా ఎఱుగున్నారా?

యువ: ఎందుకెఱుగనండీ! సన్నగా, పొడుగ్గా.

రామ: పొడుగేనుందిలెండి. మీ అంత ఉంటాడు.

భార: నీకన్న ఒక ఛాయ ఎక్కువ, మా సంధ్యకన్న ఒక ఛాయ తక్కువ.

యువ: ఆఁ! అంతేనండి.

రామ: ఎన్నిరోజులయిందంటారు పరారయి.

భార: నాకు మాత్రం నమ్మకం లేదు సుమండీ! మా బాబు అంత అఘాయిత్యం చేయడు.

యువ: అందరూ తల్లులూ అలానే అనుకుంటారు. కొడుకులు మాత్రం...ఇంతెందుకు? మీ అబ్బాయి ఫోటో ఏమీ లేదూ దగ్గఱ.

సం: లేకేం? కార్డ్‌సైజ్ ఫోటో ఒకటి ఉండాలి. తెస్తానుండండి (పోతుంది)

భార: ఏమో బాబూ! ఇదంతా నాకేదో కలలాగా ఉన్నది.

యువ: మీకు కలలాగా ఉన్నది. మీ అమ్మాయికేమో కథలాగా ఉన్నది.

సం: ఇదిగోనండి ఫోటో.

యువ: (ఫోటో అందుకుని) ఓ. కే. ఇదే కదూ మీ అబ్బాయి ఫోటో.

రామ: అవును!—అదే.

యువ: ఈ ఫోటో మీ కుమారుడు యస్. భాస్కరం—థర్డ్ బి. ఇ. కాకినాడలో చదువుతున్న భాస్కరం—నేనంటారు.

భార: అనుమానమెందుకు. అదే.


యువ: అయితే నేను చెప్పేది ఈ అబ్బాయి గాథే!

భార: అయితే (విచారంగా) మాబాబేనా పరారీ అయింది.

యువ· అంతేకాదు. అప్పుడే అంతం కాలేదు కథ. ఆ అమ్మాయి మీ సుపుత్రుని తీయని మాటలమీద ఎత్తయిన కోటలు కట్టుకుంది. కాని తీరాసమయం వచ్చేసరికి అబ్బాయిగారు తన మాట మీద తను నిలబడలేకపోయాడు. మాటల పునాదులు కూలినయ్.

(48-వ పేజీ చూడండి)

అపర బుద్ధి



డిటెక్టివ్ సీరియల్

తుమ్మలపల్లి సీతారామారావు

ఇటీవల ఆ పరిసరాలలో జరిగిన అనేక దారుణ హత్యలవల్ల ఆ ఇంటికి "మృత్యు గృహం" అనే పేరు వచ్చింది. పత్రికలలో ప్రకటించిన వార్తలు ఆ ఇంట్లో నివసిస్తున్న వారికి సంబంధించినవే. కొండమొదట్లో ఉన్న మేడ క్రిందిభాగంలో మోటారు కారుపెట్టుకునే షెడ్ వుంది. పైనఉన్న మొదటి రెండు అంతస్తులలో నూనెగనిలో పనిచేస్తున్న ఇంజనీరు చంద్రశేఖర్ వుంటున్నాడు. కొండమలుపులో కొన్ని మెట్లు ఎక్కితే, ఆ బంగళా సింహద్వారం కనపడుతుంది. చంద్రశేఖర్ మోటార్ కారు భీమా చేశాను. భీమాగడువు పూర్తికావచ్చింది. వచ్చే సంవత్సరానికి కూడా భీమా చేయించటానికి నిశ్చయించుకున్నాను. కారులో బయలుదేరి కొండమలుపు దగ్గరకు చేరాను. మెట్లమీద నుంచి బంగళా సింహద్వారాన్ని సమీపించాను.

బంగళా చాలా చక్కగా, ఆకర్షణీయంగా చిత్తరువులతో అలంకరించివుంది ఆ పరిసరాలు కూడా మనసుకు ఉల్లాసం కలిగిస్తున్నవి. అందమైన ప్రదేశంలో ఉన్న ఆ బంగళాకు "మృత్యు గృహం" అని పేరు పెట్టటానికి పైకి కనపడే దృశ్యాలు ఎంత మాత్రం ప్రోత్సహించటం లేదు. కాని, ఆ ఇంటికి ఆ పేరు రానే వచ్చింది. అక్కడికే నేను వెళ్ళవలసి వచ్చింది. సింహద్వారానికి కట్టివున్న తెరపక్క నుంచి ఒక నౌకరు తల బయటికి పెట్టినన్ను చూసింది.

"చంద్రశేఖర్ గారు వున్నారా?"

"నాకు తెలియదు. మీ పేరు?"

"కృష్ణమోహన్"

"ఏంపనీ మీద వచ్చారు?"

"సొంత వ్యవహారం."

"క్షమించాలి. ఎవరు వచ్చినప్పటికీ, వారు వచ్చినపని తెలుసుకుని, అటుతరువాత వారిని లోపల ప్రవేశపెట్టాలని ఇక్కడ ఉత్తరువు."

నేను లోపల ప్రవేశించటానికి అనుమతి దొరకటం ఒకపెద్ద సమస్యే అయింది. నేను వచ్చిన పనిని గురించి మరికొంచం విపులంగా చెపితే, అగకొంతివరకు అననుకూలానికి గోవతీస్తుంది. అసలు వచ్చిన పని నూటిగా చెప్పటం భీమా ఏజంటుకుతగనిపని. అందులో నాలాంటి అనుభవశాలి ఎవరూ అలాంటి పొరపాటు చెయ్యడు. ఒకవేళ యజమాని ఇంట్లో లేరని జవాబువస్తే, అక్కడే కని పెట్టుకు కూర్చుంటానని చెప్పటం చాలా తెలివితక్కువ విషయం. ఒకసారి ఇంట్లో ప్రవేశించిన తరువాత, వచ్చిన పనిని గురించి అవతలి వాళ్ళ మనస్తత్వానికి అనుగుణంగా చెప్పటం, చిట్ట చివరికి వాళ్ళు వొప్పుకొనేలా చేయటం ఆరితేరిన వ్యాపారి లక్షణం.

"చంద్రశేఖర్ గారిని చూడటానికి వస్తానని చెప్పాను. పోనీలే. ఇంకోసారి వీలైనప్పుడు వస్తా."

ఒక విధంగా ఇది నిజమే. మోటారుకారు భీమా గడువు పూర్తి కావటం వల్ల, మరుసటి సంవత్సరానికి తిరిగి భీమా చేయించాలని ఉత్తరం రాయటం కంటె స్వయంగా వారిని కలుసుకోవటం మంచిపని. వారిని చూసి దాదాపు సంవత్సరం అయింది. ఆయన చిరపరిచితుడైన ఒక పూర్వ స్నేహితుడి వలె చెప్పటంలో మంత్రం పారింది. నౌకరు తికమక పడింది.

"లోపలికి దయ చేయండి," అన్నది ఆ నౌకరు,

హాలు లోపలికి వెళ్ళి, సోఫాలో కూర్చున్నాను. కిటికీలకు ద్వారాలకు కట్టిన ఎర్రటి సిల్కు తెరలు, గోడలకు అలంకరించిన చిత్తరువులు, ఆ భవన సౌందర్యాన్ని అతిశయింప చేస్తున్నవి. నేలమీద పరిచిన ఖరీదైన తివాసీ టీపాయిమీద వుంచిన ఇత్తడి విగ్రహం గృహయజమాని కళాభిరుచిని వెల్లడిస్తున్నవి.

"ఎవరు?" అని మధురమైన కంఠ ధ్వని వినపడింది.

అందమైన ఒక స్త్రీ విగ్రహం నిలుచుని వుంది. అలాంటి రూపసిని ఇదివరకెప్పుడూ నేను చూడలేదు. ఆమెకు ముప్పై సంవత్సరాలు ఉంటయి. విశాలమైన పెద్దకళ్లు, అర్ధచంద్రాకారంగా వంపు తిరిగిన నల్లటి కనుబొమలు, గులాబీ ఎరుపురంగు కలిగిన ఆమె ముఖ వర్చస్సుముద్రాభినయంలో వున్న

★ అపర బుద్ధి ★

ఆమె చేతులు, ఒక సుందర సృష్టికళ లా కన పడింది.

"చంద్రశేఖర్ గారిని చూడటానికి వచ్చాను."

"వారు ఇప్పుడు ఇంట్లో లేరు. నేను వారి భార్యను. మీకు వారివల్ల కావలసినపని ఏమిటో చెపితే, తెలియపరుస్తాను ఆవిషయం వారికి," అంటూ ఆమె నన్ను ఒకమారు చురుకైనచూపులతో చూసింది.

నే వచ్చిన పనివిషయమై ఆమెకు చెప్పటం అవసరమైంది.

"చాలా కృతజ్ఞుణ్ణి, అవసరం లేదు. ఆవిషయంలో వారిని మరోసారి కలుసుకుంటాను. తొందరలేదు. నేనుకూడా సమీపంలోనే వుంటున్నాను. నాపేరు కృష్ణమోహన్. భీమావ్యాపారం చేస్తున్నాను. ఇదేగాక "మోటార్ ఫైనాన్స్ కార్పొరేషన్"కు మేనేజింగ్ డైరెక్టరుగా పనిచేస్తున్నాను. చంద్రశేఖర్ గారి కారు భీమాగడువు ఒక వారంలో పూర్తిఅవుతుంది. ఆవిషయం వారికి ఉత్తరం రాద్దామనుకున్నాను. కాని, మీ ఇల్లు సమీపంలోనే వున్నందువల్ల వారిని స్వయంగా కలిసి మాట్లాడుదామని వచ్చాను. వారిని చూడటానికి మంచి సమయం ఎప్పుడు? మధ్యాహ్న భోజనం అయిన తరువాత, వారికి తీరిక వుంటుందనుకుంటారా? తిరిగి అప్పుడు వస్తాను. మీకు శ్రమకలిగించటం నాకు ఇష్టం లేదు."

"వారు ఎలాంటి భీమా చేస్తున్నారు? నాకు ఆవిషయాలు సరిగా తెలియవుకూడా. తెలుసుకోవటం అవసర మనుకుంటాను."

"ఏదో ఒక పెద్ద అవాంతరం జరిగేవరకూ, మనం అలాంటి విషయాలను సాధారణంగా ఆలోచించము. మామూలు భీమావ్యవహారం—అంటే అగ్ని, దొంగతనం, ప్రమాదం, జీవితం మొదలైనవాటివల్ల కలిగే కష్టానికి "హామీ" అని చెప్పకోవచ్చు."

"ఔను, నిజమే."

"ఇది అంతా మామూలుగా జరిగే వ్యవహారం. కాని వారికి ఇలాంటి ప్రమాదాల నుంచి రక్షణ కావాలంటే, సకాలంలో ముందుగానే జాగ్రత్తపడాలి."

"ఈవిషయం నాకు బాగా తెలియదు. ఇటీవల వారు ఒకమోటార్ క్లబ్బులో సభ్యుడుగా చేరాలని, వారిద్వారా భీమా చేయాలని ఎవరితోనో అనటం మాత్రం విన్నాను."

"వారికి మోటార్ క్లబులో సభ్యత్వం వుందా?"

"లేదు కాని చేరాలనుకుంటున్నారు. ఇక్కడికి వచ్చిన ఆక్లబ్బు ఏజంటు జీవిత భీమా విషయం కూడా మాట్లాడాడు."

"మోటార్ క్లబులో సభ్యత్వం మంచిదే. వాళ్ళు చాలా జాగ్రత్తగా సమర్థతో ఆ సంస్థను నిర్వహిస్తూ, శీఘ్రంగా పరిహారాలు ఇస్తున్నారు."

ఆమె చాలాసేపు మాట్లాడింది. కాని మోటార్ క్లబ్బు విషయమై ఆమెకు ప్రత్యేక ఆసక్తి వున్నట్టు కనపడలేదు. ఆమె మాట్లాడే విషయాలపై నాకు ఆసక్తి లేకపోయినప్పటికీ, ఆమె అభిప్రాయాల్ని ప్రతిఘటించటం వ్యాపారలక్షణం కాదు. నేను మౌనంగా శ్రద్ధతో వింటున్నట్టే కూర్చున్నాను. ఆమె భర్త మోటారుకారు భీమాచేస్తే, అందులో వచ్చే కమీషనులో భాగం కావాలంటుందేమోనన్న అభిప్రాయం కలిగింది. ఇలాంటివి మామూలుగా జరిగే సంఘటనలే. కాని అనుభవశాలి అయిన ఏజంటు ఇటువంటి విషయాలలో చిక్కుకోడు. ఆమె హాలులో పచార్లు చేస్తూ సంభాషణ సాగించింది. ఆమె శరీరపు వొంపుల్లోని సౌందర్యం, విగ్రహంలోని నిండుతనం, నా కళ్ళకు మిరుమిట్లు గొలిపింది. భీమావ్యాపారంలోని ఉత్కృష్ట గుణాలను ఆమెకు తెలియచెప్పాలని ఉద్యుక్తుణ్ణైనాను.

అకస్మాత్తుగా నడుస్తున్న ఆమె నిలిచి ఒకసారి నావైపు నిశ్చలంగా చూసింది. ఆ చూపుల్లో అర్థంగాని గాంభీర్యం నాకు స్ఫురించింది.

"మీరు ప్రమాదభీమా చేయిస్తారా?" అని ప్రశ్నించింది.

ఈ ప్రశ్న నాకు కొంత ఆశ్చర్యం కలిగించింది. సాధారణంగా అంతా జీవిత భీమా, అగ్ని భీమా కావాలని అడుగుతారు. ఏజంట్లు అందరు ఈవ్యాపారంకోసం అహర్నిశలు తిరుగుతూ వుంటారు. ప్రమాదభరితమైన వృత్తులలో అనుదినం పనిచేసేవాళ్లు ప్రమాద భీమా చేయటం అవసరమే. సహజంగా జరుగుతుంది కూడాను. నాకు కలిగిన ఆశ్చర్యం, ఒక స్త్రీ ఇలా ప్రశ్నించడంవల్లనే.

"ప్రమాద భీమాచేస్తే, కంపెనీ రెట్టింపు మొత్తం పరిహారంగా ఇస్తుంది. భీమాచేస్తున్న వాళ్లకి తెలియకుండా కూడా ప్రమాద భీమా చేయవచ్చు, ఈ భీమా చేయటానికి వైద్య పరీక్ష అవసరంలేదు. దీనికి కావలసింది ప్రీమియం కట్టటమే. రోడ్డుమీద నడుస్తున్న మనిషికి అకస్మాత్తుగా ఏప్రమాదమైనా తటస్థించవచ్చు! ఈలాంటి ప్రమాదాలవల్ల అతడి ఆప్తులకు అనేక ఇక్కట్లు సంప్రాప్తము కావచ్చు. ప్రమాదంవల్ల ప్రాణాలు కోల్పోయినవాళ్లకు వాళ్ళ ప్రియ సన్నిహితులు పొందే ఆవేదన తెలియదు. నేను అన్ని రకాల భీమా చేయిస్తాను."

మోటారు క్లబును గురించి తిరిగి ఆమె సంభాషణ ప్రారంభించి, నా దృష్టిని మరల్చటానికి ప్రయత్నించింది. నాదృష్టిని ఆమె వైపునుంచి మరల్చుకోలేక పోయాను: సమీపంలో వున్న సోఫా దగ్గరకు వచ్చి కూర్చుంది.

"మీరు చెప్పిన సంగతులను గురించి నేను వారితో మాట్లాడుతాను."

నేను మాట్లాడవలసిన భీమా విషయాలు ఆమే స్వయంగా వారితో మాట్లాడతానని చెప్పినందుకు నేను సంతోషించాను.

"చాలా సంతోషం," అన్నాను.

"అనవసరమైన కాలయాపన జరుగదు"

"ఔను. ఈ విషయం వారు వెంటనే శ్రద్ధ తీసుకోవాలి."

"కొంచెం మాట్లాడిన తరువాత, మీరు వారిని కలుసుకోవచ్చు. రేపు రాత్రి ఏడున్నరకు రండి. ఆ సమయంలో మేము భోజనం చేసి వుంటాము."

"మంచి అనుకూలమైన సమయం."

"మీ కోసం ఎదురు చూస్తుంటాను" అంటూ మరోకసారి ఆమె నావైపు వింతగా చూసింది. ఆమె చూపులు మత్తుమందువలె నాకు వివశత్వం కలిగించినవి. మెల్లగా బయటికి వచ్చి, నా కారులో కూర్చుని ఆఫీసుకి వెళ్ళాను.

పాండ్య నా రాకకోసం ఎదురు చూస్తున్నాడు. భీమా కంపెనీకి ఆయన జనరల్ మేనేజరు. భీమాకంపెనీ నిర్వహణంలో ఆరితేరిన అనుభవశాలి. నడివయసు దాటింది. ఎంత తెలివిగలవాడికైనా, ఆయన దగ్గర పని చేయటం కత్తిమీద సాము లాంటి పని.

ఆయన ఎంత మేధావంతుడో, అంత అను మానస్తుడు. నిత్య శంకితుడు. ఇవాళ మంగళ వారం అని ఆయనకు చెపితే, వెంటనే ఆయన నమ్మడు. కేలండరు చూస్తాడు. తరువాత అది ఏ సంవత్సరం కేలండరో, దానిని ఎవరు ముద్రించారో, అన్నీ చూసి అపుడు గాని ఆ రోజు మంగళవారం అని అంగీకరించడు. ఇంత హంగామా జరిగితే గాని, ఆయనకు సంతృప్తి వుండదు. వయస్సుతోపాటు ఆయన శరీరం కూడా ఆయేటి కాయేడు స్థూలమాతూంది. కార్యాలయంలో అన్ని శాఖలవారు తరుచుగా ఆయన పేరు చెపితే, గడగడ లాడుతారు. ఎప్పుడూ ఏదో ఒక విషయాన్ని గురించి తీవ్రంగా పెద్ద గొంతుతో విమర్శిస్తూ వుంటాడు.

నన్ను చూడగానే పాండ్య, "కృష్ణ మోహన్" అని కేకవేశాడు.

ఆయన నన్ను ఎందుకు పిలిచింది వెంటనే నాకు అర్థమైంది.

ఆరునెలల క్రితం నేను ఒక మోటారు లారీని భీమా చేయించాను. ఆ యజమాని తన లారీని తగలపెట్టించి, పరిహారం కావాలని కంపెనీకి రాశాడు. సకాలంలోనే నేను జాగ్రత్తపడి, ఈ విషయం విచారణచేసి, ముఖ్యమైన వివరాలతో, పూర్తి పరిశీలన చేయంది అతడికి పరిహారం ఇవ్వకూడదని తెలిపాను.

"లారీ యజమానికి డబ్బు ఇవ్వాలనుకుంటున్నావా? ఈ విషయం అంతా విచారణ చేయాలని, అంతవరకు పరిహారం ఇవ్వటానికి అంగీకరించకూడదని నేను స్పష్టంగా రాశాను."

"పరిహారం ఇవ్వాలని కోరటంలేదు. నేను కూడా ఇదే విషయం తెలిపాను. మీరు చూపుతున్న శ్రద్ధలో కనీసం సగమైనా అన్ని శాఖలవాళ్ళూ తమధర్మం నిర్వర్తించటంలో చూపితే బాగుంటుంది."

"ఆ లారీని పరిశీలించటానికి, నేను మనుష్యులను పంపకపోతే, ఈపాటికి లారీ యజమానికి పరిహారం అందేది. కాని యజమానిని పిలిపించాను. అతడి ప్రవర్తన నాకు అనుమానంగా వుంది. మేనేజింగు డైరెక్టరుకు వ్రాశాను."


పాండ్య ఈ కంపెనీలో ముప్పై సంవత్సరాలనుంచి పనిచేస్తున్నాడు. ఇప్పటి మేనేజింగు డైరెక్టరు తండ్రి కాలంలో కూడా పాండ్య జనరల్ మేనేజరుగా ఉన్నాడు.

నేను నా గదిలోకి వెళ్ళాను. బల్లమీద ఒక చీటీ పెట్టివుంది. దానిలో ఇలా వుంది:

"రేపు రాత్రి మీరు రావటానికి అనుకూల పడదు. తిరిగి అనుకూలమైన సమయం తెలియ పరుస్తాను—కోమలం."

చంద్రశేఖర్ భార్య పేరు కోమలం. పేరుకు తగిన రూపం. ఆమె పిలుపుకోసం నిరీక్షించాలి. ఈ నిరీక్షణ ఫలితం ఎలా వున్నప్పటికీ, వృత్తిరీత్యా ఆమె కబురుకోసం ఎదురు చూశాను. ★

—ఇంకా వుంది.



పతిత జనోద్ధరణం

ప్రాచీన గాథాలహరి

పి. గణపతిశాస్త్రి

౧

రాగమంజరి ఆరుణిముని ఆశ్రమాని కల్లంత దూరంలోనే నిలబడి రెప్పపాటు లేకుండా నిశ్చలంగా ఆ మహాముని వైపు చూచింది. ఇంతకుపూర్వం ఆమె ఎన్నడూ ఆ ఆశ్రమంలో అడుగు పెట్టలేదు. ఆరుణి ముని నెన్నడూ సందర్శించి ఉండలేదు.

చంపానగరవాసులందరు ఆరుణి మహా తపశ్శాలి అనీ చండీ భక్తుడనీ పరమ బ్రహ్మణ్యుడనీ ఆరుణిని వేనోళ్ల ప్రశంసించడం ఆమె అనేకమారులు విన్నది. ఇప్పుడు ప్రత్యక్షంగా సందర్శించగానే రాగమంజరికా ప్రశంసలన్నీ యధార్థాలే అనిపించాయి.

ఆరుణి పద్మాసనాసీనుడై నాసాగ్రం మీద దృష్టి నిలిపి నిశ్చలంగా ధ్యానిస్తున్నాడు. అతని భ్రూమధ్యంమీది కుంకుమ తిలకం చూడగానే రాగమంజరి కది నిటలాక్షుని తృతీయ నేత్రంలా స్ఫురించింది. ప్రాతఃకాల సూర్యకాంతి అతని మేలివివన్నె దేహచ్ఛాయలో లీనమై పోయింది. లేత లేత ఎండ పొడ లతడు కూర్చున్న వ్యాఘ్రాజినం మీద రంగు రంగుల రత్నాలోలక బోశాయి.

రాగమంజరి ఆరుణిముని ధ్యానం ముగించే వరకు అలాగే నిలబడి ఆ తేజశ్శాలి ఫాలంమీది విభూతిరేఖల తీరులు పరిశీలించింది.

కొంతసేపటికతడు ధ్యానంముగించి ఒక్క దీర్ఘనిశ్శ్వాసం విడిచిపెట్టాడు. తరవాత నెమ్మదిగా పద్మాసన బంధం సడలించి యథాప్రకారంగా సుఖంగా వ్యాఘ్రాజినం మీద కూర్చున్నాడు. కాని అతనిదృష్టిలో ఏకాగ్రత ఇంకా వదలలేదు.

రాగమంజరి ఎంతో అడకువతో అతని సన్నిధికి నడిచివెళ్లింది. ఉత్తర క్షణంలో అతని పాదాలమీద వాలిపోయింది. సభక్తికంగా సాష్టాంగ నమస్కారం చేసింది.

ఆమె కన్నీటితో ఆరుణి పాదాలు రెండు తడిసిపోయాయి. ముని ఆమె ముంగురులు స్పృశించి అపార వాత్సల్యంతో ఆశీర్వదించాడు. ఆమె నెమ్మదిగా లేచికూర్చుంది. ఒక్కమారు విశాలనేత్రాలతో మునిముఖంవైపు చూచింది. ఉత్తరక్షణంలో ఆమె కనురెప్పలు వాలిపోయాయి. రాగమంజరి గద్గద స్వరంతో తన విషాదగాథ అంతా ఆరుణిముని కెరిగించింది. నిత్య దుఃఖ భూయిష్ఠమైన సంసారంమీద విరక్తి కలిగిందనీ ఇక జీవిత శేష మంతా ముని పాదపద్మ సన్నిధినే తీవ్రతర తపోనిరతిలోనే గడిపివేయ గోరుతున్నాననీ సవినయంగా విజ్ఞప్తి చేసింది. గణికావృత్తితో తన బ్రతుకంతా మహాపాప పంకిలమై పోయినదని వాపోయింది. చండీ కరుణాకటాక్షంవల్లనే తనకావిధంగా ముని సందర్శన భాగ్యం లభించినదని ఆ దేవతకు సభక్తికంగా చేయెత్తి నమస్కరించింది.

ఆరుణి క్షణకాలం నిశ్చలంగా ఆమెవైపు చూచాడు. ఆమె చెప్పిన విషాదగాథ అంతా అత్యంత శ్రద్ధతో ఆలకించాడు.

ఆరుణిమునిది చాలా జాలిగుండె. ఎవరికైనా కొంచెం కష్టం కలిగితే అతని మనసిట్టే ఆర్ద్రమై ద్రవించిపోతుంది. రాగమంజరి విషాదగాథ వినగానే అతని హృదయం అపార కారుణ్యంలో కరిగిపోయింది. అతడొక్క నిమిషం వరకు ఏదో ఆలోచించాడు:

"అమ్మా! సంసార స్వభావమే అంతటిది. నీకింకా పట్టుమని పంచవింశతి వర్షాలైనా నిండినట్లు కనబడదు. దుఃఖభూయిష్ఠమైన సంసార స్వభావం నీకేమి తెలుసును!

ఇంతటి చిన్నవయస్సులో ఇంతటి వైరాగ్యం కలగడం నిశ్చయంగా పూర్వజన్మ సుకృతి ఫలితమే.

కాని నీవీ కఠిన తపశ్చర్య కోర్చుకోలేవు! నా మాట విని తిరిగీ చంపా నగరానికి వెళ్ళిపో!"

అని తిరిగి చంపానగరానికి వెళ్ళిపోవలసిందని అనేకవిధాలుగా ఆమెకు బోధించాడు. ఆమె ఆ సదుపదేశం ఎంతో శ్రద్ధగా ఆలకించింది. కాని చంపానగరానికి తిరిగి వెళ్ళిపోవడాని కంగీకరించలేదు:

"మీ వంటి పతిత జనోద్ధారకులు లేరని విని కొండంత ఆశతో నేనిక్కడికి వచ్చాను. తమకు దయ కలగకపోతే ఉరి పోసుకుని ఇనిక్కడే మీ యెదురుగానే ప్రాణం త్యాగం చెయ్యవలెనని నిశ్చయించాను. అంతేనేగాని తిరిగి నేనా చంపానగరానికి వెళ్లదలుచుకోలేదు."

అని అలాగే తలవంచుకొని ఆరుణి పాదాలమీద దృష్టి నిలిపి ఊరూరుమని ఒక్క దీర్ఘనిశ్శ్వాసం విడిచిపెట్టింది.

ఆరుణి తిరిగీ మరి ఒకమారు రాగ మంజరి కేసి బాగా పరిశీలనగా చూచాడు:

"రాగ మంజరీ! సంసారం దుఃఖభూయిష్ఠమైనదని నీవే అన్నావు గదా! నీకేదో దారుణమైన విపత్తు సంభవించి ఉండవచ్చునని ఊహిస్తున్నాను. ఆ దుఃఖోద్వేగంలో నీకిటు వంటి సంకల్పం కలిగిఉండ వచ్చును. కాని కొన్నాళ్ళకా దుఃఖోద్వేగం ఉపశమిస్తుంది. అంతవరకు కొంచెం వేచి ఉండడం మంచిది. అప్పటికి కూడా నీలో ఈ సంకల్పం నిలబడితే తప్పక నీ వరణ్యవాసం చెయ్య వచ్చును. కాని అంతవరకు చంపానగరంలోనే ఉండడం మంచిది. నామాట విను."

అని మళ్లీ ఆమెకు నచ్చచెప్పాడు. అయినా ఆమె దాని కంగీకరించలేదు. ఆమె చెక్కిళ్లపై కన్నీరు జలజలా ప్రవహించింది. అది చూడగానే ఆరుణి మనస్సు కొంచెం కరిగింది.

దూర దూరంగా గంగానదీ ఘోష జాలిగా సన్న సన్నగా వినిపించింది. శిశిరర్తు హిమబిందువులతో తడిసిన పండుటాకులు తరువుల కన్నీటి బిందువుల్లా ఒకటొకటిగా నేల రాలిపోయాయి. ఆకాశం అంతటా పొగ కమ్మినట్లుగా దట్టంగా మంచు పట్టింది. కాని ప్రాతఃకాల సూర్యకిరణ కాంతులలో క్రమక్రమంగా అది కరిగి పోవడం ప్రారంభించింది.

రాగమంజరి దీనాతి దీనంగా ఆరుణి ముని కేసి చూసింది:

"మా వంటి పతితుల నుద్ధరించ గలిగిన వారిక మీరు గాక మరెవ్వరు?"

అని మళ్ళీ తలవంచు కుంది. ఆరుణి కిక ఏమనడానికి పాలు పోలేదు. కాని ఆమె అరణ్యవాసం అతని కంతగా రుచించ లేదు. కాని కటువుగా తిరస్కరించిన పక్షంలో ఆమె ఏదైనా సాహసాని కొడిగట్టవచ్చునని అతనికి భయం వేసింది. అందుచేత ఆమె చేత ఎల్లాగైనా ఒప్పించ వలెనని అనుకున్నాడు:

"అరణ్యవాసము, అందులో తపశ్చర్య అత్యంత దుష్కరమైన విషయాలు! మా వంటి వారికే ఇవి బహుదుష్కరమైనవి. నీవంటి సుకుమారులీ అసధారా వ్రతా లాచరించ లేరు. నా మాట విని ఈమారు చంపానగరం వెళ్లిపో! ఆ తరవాత కూడా నీకు తపశ్చర్యమీద అభిలాష కలిగితే అప్పుడు మళ్ళీ తిరిగి వత్తువుగాని!"

ఆ మాటతో రాగమంజరి నిలువునా నీరయిపోయింది:

"స్వామీ! మా వంటి పతితులకు, పాపులకు మరి తరణోపాయం లేదా? మేమీ విధంగా ఈ సంసార పంకంలోపడి నశించి పోవల సిందేనా?"

రాగమంజరి గద్గద భారంతో మరి మాటాడలేక పోయింది. ఆ ప్రశ్న ఆరుణి హృదయం కలగించివేసింది:

"పోనీ నాలుగైదురోజులపాటాశ్రమంలో ఉండు! అటుపిమ్మటకూడా నీకింకా అరణ్యవాసం చెయ్యవలెనని అభిలాష కలిగిన పక్షంలో అప్పటిమాట ఆలోచించు కోవచ్చునులే"

అని ఆరుణి తన శిష్యులనిద్దరిని పిలిచాడు. వారిద్దరు అక్కడికి రాగానే ఆశ్రమంలో ఆమె వసతికి తగిన ఏర్పాటులు చేయవలసిందని ఆజ్ఞాపించాడు. వారిద్దరు ఆమెకొక చిన్న పర్ణకుటీరంలో వసతి ఏర్పాటు చేశారు.

రాగమంజరి ఆ పర్ణకుటీరంలో ప్రవేశించ బోయేముందు ఆరుణి ముని పాదాలకు సాష్టాంగనమస్కారం చేసింది. ముని పాద ధూళి ఎంతో నమ్రతతో శిరస్సుమీద చల్లుకొని మెల్లమెల్లగా అడుగులు వేసుకుంటూ పర్ణకుటీరంలో ప్రవేశించింది.

౨

ఆనాటి సాయంకాలమే గోధూళివేళ రాగమంజరి తల్లి వలవలా ఏడుస్తూ ఆశ్రమంలో ప్రవేశించింది. ఆశ్రమాని కల్లంత దూరంలోనే ఆ ఏడ్పు విని ఆరుణి శిష్యులామెను తమ ఆచార్యుని సన్నిధికి తోడుకు పోయారు. ఆరుణి దగ్గిరికివస్తూనే ఆమె సాష్టాంగ నమస్కారంచేసి గోలుగోలున ఏడవడం మొదలుపెట్టింది. ఆరుణి ఎంతసేపోదార్చినా ఆమె మరి కుదటబడలేదు. కొంతసేపటికి కేడుపుముగించింది. రాగమంజరిని చిన్నప్పటినుంచీ పెంచి పెద్దదానిని చేశాననీ తన కింకెవరు లేరనీ తన వార్ధక్యంలో ఆమె అవిధంగా అడవులుపట్టి పోవడం కేవలం అన్యాయమనీ మొరపెట్టుకుంది. ఆమె నెల్లాగయినా తిరిగీ చంపానగరానికి పంపించ వలసిందని ప్రార్థించింది.

తరవాత ఆమె రాగమంజరి పెంపకంలో తానుపడ్డపాట్లన్నీ ఏకరువు పెట్టింది.

"స్వామీ! గణికను పెంచి పెద్దదాన్ని చెయ్యడం మాటలతో పనిగాదు. తల్లిదగ్గిర పాలు విడిచీ విడవగానే పిల్లనింటికి తెచ్చుకోవాలి. శరీరపుష్టి కలిగించే మృష్టాహారం ఇచ్చి పోషించాలి. శరీర కాంతి పోషణకోసం ప్రత్యేకంగా కొన్ని ప్రక్రియలు చేయించాలి. ఐదవ ఏటినుంచి తండ్రికికూడా ఆ పసిదాన్ని కనబడనీయకూడదు. జన్మదినోత్సవాలు పెళ్ళిళ్లుచేసినంత మహావైభవంగా జరిగించాలి.

"నృత్య గీత నాట్య చిత్రాది కళలలో మహావిద్వాంసురాలిని చెయ్యాలి. ఇంకా మిగిలిన వ్యాకరణాది శాస్త్రాలలో కూడా తనుమాత్రం పాండిత్యం కలిగించాలి. ద్యూతాదికళలలో కూడా బాగా ప్రవేశం కలిగించాలి.

"కొంచెం వయస్సురాగానే గొప్పగొప్ప ఉత్సవాలలో నృత్యగోష్ఠులేర్పాటు చేయించాలి. ఆమె సౌందర్యము, పాండిత్యము నాగరికు లందరికీ బాగా తెలిసేటట్లు చెయ్యాలి. ఆమె కీర్తి నాలుగువైపులా వ్యాపించినకొద్దీ శుల్కంకూడా దానికి అనుగుణంగా అభివృద్ధి పొందించాలి.

ఒకవేళ ఎవరైనా ముందుగా వాగ్దానం చేసిన శుల్కం ఇవ్వకుండా తప్పించుకు పోయిన పక్షంలో అధికరణాలలో ప్రాడ్వివాకుల మూలంగా ఆ ద్రవ్యం తిరిగి రాబట్టుకోవాలి-"

అని ఆ వేశ్యమాత అదే ధోరణిగా తన గోడంతా ఏకరువు పెట్టడం మొదలుపెట్టింది. ఆరుణికది వింటున్న కొద్దీ క్రమంగాలోలోపల జుగుప్స బయలుదేరింది. ఆ పైన అతడిక వినలేకపోయాడు, విసుగుగా ఒక నిట్టూర్పుని విడిచిపెట్టాడు:

"సరేగాని ఇంతకీ రాగమంజరికి సంసారం మీద ఇంతటి విరక్తి కలగడానికి కారణమేమిటి?"

ఆప్రశ్న విని వేశ్యమాత మళ్ళీ గోలుగోలున రాగాలు మొదలుపెట్టింది. కొంతసేపటికి రాగాలు తగ్గించి గద్గద స్వరంతో తన గాథ ప్రారంభించింది.

"స్వామీ! బ్రహ్మదేవుడే స్వయంగా మాకీ కులవృత్తి విధించాడు. కోటి విద్యలు కులవిద్యకు సాటిరావుగదా! అందుచేత కులవృత్తి కులధర్మ ప్రకారమే నడిపించాలి. ఆ ధర్మం ఏమాత్రం ఏమరినా రౌరవాదినరక కూపాలు కావలసిందే! మాపూర్వులెన్నడు కులధర్మం గోరంతైనా అతిక్రమించిన పాపాన్ని పోలేదు.

"ఇంతకీ మా ప్రాణాలకు చంపానగరంలో ఒక దరిద్ర బ్రాహ్మణ కుమారుడు దాపరించాడు. నా మట్టుకు నాకతడేమి బాగున్నట్టు కనబడలేదు. రాగమంజరి అంతటి నవ మన్మథుడు మరి 'నభూతో నభవిష్యతి' అని ఆకాశానికెత్తి వెయ్యడం మొదలు పెట్టింది. అతగాడు గర్భదరిద్రుడు. పోనీ అనుకుంటే పాటకోసినా అక్షరంముక్క లేదు. రాగమంజరి రాత్రింబగళ్ళు అతగాడితోనే కాలక్షేపం చెయ్యటం మొదలుపెట్టింది."

ఆ తరవాత వేశ్యమాత ఆరుణి తనగాథ అంత శ్రద్ధగా వినడం లేదని కనిపెట్టింది:

"మావంటి వారికష్ట సుఖాలిక ఎవరితో చెప్పుకో గలము. ఇక ఆరేచేవారయినా తీర్చేవారయినా మీరే! కొంచెం దయదలిచి ఈ కాస్త శ్రద్ధగాఆలకించండి!"

"అతగా డెప్పుడు ఒక్క చిల్లిగవ్వ అయినా రాగమంజరి చేతిలో పెట్టిన పాపాన పోలేదు. పైగా రాగమంజరి నేనుగడించిన ధనం అంతా అతగాడి కోసం వ్యయం చెయ్యటం మొదలు పెట్టింది.

"ఎప్పటికయినా దానికిబుద్ధి తిరక్క పోతుందా అని నేను రెండు మూడుమాసాల వరకు ఓపికపట్టాను. ఎందరెందరో కుబేరులు వచ్చినా గుడ్డనిరుకుక్కొని వారివందరనీ తిరగగొట్టి వేశాను. అయినా రాగమంజరి మనస్సు తిరగలేదు. పరిపరివిధాల నయాన భయాన చెప్పి చూచాను. కాని రాగమంజరి ససేమిరా నామాట వినవని భీష్మించుకు కూర్చుంది.

★ పతితజనోద్ధరణ ★

"ఆసందర్భంలో నాకేమి పాలుపోక ఒకసాడు గట్టిగా చీవాట్లు పెట్టాను. అంతటితో ఊరుకోక ఆ బ్రాహ్మణకుమారుణ్ణి మరి నాగడపతొక్కవద్దని కటువుగా తూలనాడాను. తిరిగీ మాగడపతొక్కితే దాసీలచేత చీపురుకట్ట తిరగవేయిస్తానని భయపెట్టాను. ఆమరునాటి నించీ అతడు మరి మాగడప తొక్కలేదు.

"నేనంతటితో ఆశని విరగడ అయిపోయిందని ఎంతైనా సంతోషించాను. అతడానాడే చంపానగరం విడిచిపెట్టి దేశాంతరాలు పట్టిపోయాడని విన్నాను. ఆవార్తవిని ఎంతో సంతోషించాను. ఆమరువాటినించీ రాగమంజరి దారికి రాకపోదని ఎంతో ఆశపడ్డాను.

"కాని నా ఆశలన్నీ అడియాసలయిపోయాయి. ఆనాటి నించీ రాగమంజరి మరి అన్నం ముట్టడమే మానివేసింది. నానాటికీ దానివైరాగ్యం బాగాపెచ్చుపెరిగిపోయింది. ఒకనాటి ఉదయమే లేచి చూస్తే మాఇంట్లో ఎక్కడా కనిపించలేదు. ఊరంతా గాలించగా మీ ఆశ్రమానికి వచ్చిందని తెలిసింది.

"మాకుటుంబం అంతా రాగమంజరి మీదే ఆధారపడి ఉంది. ఆమె ఈవిధంగా కులధర్మం విసర్జించి ఆ బ్రాహ్మణకుమారుని యెడల అంతటి మమకారంతో వ్యవహరించడం అన్యాయం! మహాపాపం! మాకులధర్మానికి కేవలం వ్యతిరేకం!

"ఆపైన నేనేదో అన్నానని నామీద పగబట్టి ఈవిధంగా అడవులు పటిపోయింది. మీరామె నెల్లాగైనా తిరిగి నాతో పంపించకపోతే నేను మీ ఎదటే ప్రాయోపవేశం చేసి ప్రాణత్యాగం చేస్తాను. నాకిక గత్యంతరం లేదు. మీరెల్లాగైనా కరుణించి రాగమంజరిని తిరిగీ చంపానగరానికి పంపించాలి. మాకుటుంబం సంరక్షించాలి."

అని కాళ్ళావేళ్ళా పడి పరిపరి విధాల బతిమాలింది. అటు పిమ్మట కూడా ఆమె ఇంకా ఏమేమో వెళ్ళబోసుకోవడం మొదలుపెట్టింది. కాని ఆరుణి అమెమరి చెప్పనక్కరలేదన్నట్టు హస్తసంజ్ఞలో సూచించాడు. అంతటితో వృద్ధవేశ్యమాత నోరు కట్టుపడిపోయింది.

ఆరుణికా పరిస్థితిలో ఎల్లాగోఅలాగ నచ్చచెప్పి రాగమంజరిని తిరిగి ఇంటికి పంపించియ్యడమేమంచిదనితోచింది. వెంటనేశిష్యుణ్ణి పిలిచి రాగమంజరి నక్కడికి తీసుకురావలసిందని చెప్పాడు.

రాగమంజరి ఆ వ్యవహారంఅంతా పర్ణకుటీరంలోనించి ఒకకంటకనిపెట్టిచూస్తూనే ఉంది. అందుచేత శిష్యుడెంత బతిమాలినా అతని వెంటవెళ్ళడానికిష్టపడలేదు. శిష్యునికి ఆమెనిక బలవంతంగా తీసుకువెళ్ళడంతప్ప వేరేగత్యంతరం కనిపించలేదు. అందుచేత అతడిక చేసేదేమీలేక ఆచార్యునికావిషయం తెలియజేశాడు. అదివిని ఆచార్యుడొక్క నిట్టూర్పు విడిచిపెట్టాడు. వేశ్యమాతను నెమ్మదిగా బుజ్జగించాడు:

"అమ్మా! రాగమంజరికింకా తపస్సంటే ఏమో తెలియదు. పదిపదిహేను రోజులీ అరణ్యవాసం చెయ్యగానే తపస్సు మీది భక్తి యావత్తు దానంతటఅదే సడలిపోతుంది. నీవిప్పటికి చంపానగరానికి వెళ్ళిపో! ఒక పక్షంరోజులలో నయాన భయాన చెప్పి రాగమంజరిని తిరిగీ పంపించివేస్తానులే!"

వేశ్యమాత ఆమాట వినిపించుకోలేదు:

"స్వామీ! పోనీ నేనంతవరకు ఇక్కడే కాలక్షేపం చేస్తాను. సరిగదా!"

"నీవిక్కడ రోజూ కనిపిస్తూంటే ఆమె మరింత బిర్రబిగిసిపోతుందేమోనని నా భయం. ఆపైన నీఇష్టం."

ఆమాటమీద వృద్ధమాత కొంచెం తమాయించింది:

"స్వామీ! మాఇంటెల్లిపాదికీ రాగమంజరి ఒక్కత్తే దిక్కు! ఆమె మరి తిరిగిరాకపోతే మేమంతా అన్నానికికూడా మొహం వాచిపోయి మలమలామాడి చావవలసిందే! అందుచేత మీరెలాగైనా పంపించితీరతామని సెలవిస్తే తిరిగి వెళ్ళిపోతాను."

"అయ్యో! వెర్రిదానా! నేనింతకుపూర్వంనించీ చెబుతూనేఉన్నాను. రాగమంజరి నామాట బొత్తిగా చెవికెక్కనీయలేదు. ఏంచెయ్యను? ఇప్పుడైనా మించిపోయిందేమీ లేదు! యథాశక్తిగా ప్రయత్నిస్తాను. ఆపైన అమ్మవారి సంకల్పం ఎలాగుంటే అలాగ జరుగుతుంది. అంతా ఆపరమేశ్వరి అనుగ్రహం!"

ఆమాటతో వృద్ధురాలికి కొంచెం ధైర్యం కలిగింది. మళ్ళీ సవినయంగా ఆరుణిమునికి నమస్కరించి చంపానగరానికి బయలుదేరింది.

వెళ్ళబోయేముందు రాగమంజరి దగ్గిరికి వెళ్ళి ఆమె ననేకవిధాల బతిమాలింది. భయపెట్టింది. ఆమె ఎంతకీ వినకపోతే వలవలా విలపిస్తూ అలాగే చంపానగరానికి వెళ్ళిపోయింది.

3

అప్పటికి బాగా పొద్దువాలింది. ఆనాడు జరిగిన విశేషాలు తలుచుకొన్నకొద్దీ ఆరుణి హృదయం విషాదాంధకారంలో మునిగిపోయింది. సంసారం దుఃఖబహుళం అన్న విషయం అతనికి తిరిగీ ఆనాడెవరో వెన్నుచరిచి బోధించినట్లయింది.


అప్పటికప్పుడే అరణ్యంలోని కీచురాళ్ళమోత బాగా శ్రుతిమించిపోయింది. దూరదూరంగా ఆటవికుల కుటీరాలమంటల వెలుగులలో అరణ్యవృక్షాలు పెనుభూతాల్లా కనిపించాయి.

ఆరుణి శుద్ధశ్రోత్రియకుటుంబంలో జన్మించాడు. అతని కుటుంబంవారంతా నిత్యాగ్నిహోత్రులు. సోమపీథులు. కాని ఆరుణిది చాలా బీదకుటుంబం. అయినా ఏదో కలిగినదానితోనే కాలక్షేపం చేస్తూ ఆకుటుంబంవారంతా గుట్టుగా కాలం వెళ్ళబుచ్చుకునేవారు. వారెప్పుడు 'దేహి' అని ఒకరిదగ్గిర చెయ్యి చాచలేదు.

ఆరుణి చిన్నతనంలో అతని కుటుంబానికెన్నో విపత్పరంపరలు సంభవించాయి. ముందుగా అతని తండ్రి మహామారిజాడ్యంతో మరణించాడు. ఆపైన పదిరోజులైనా తిరగకముందే అతని తల్లి కూడా ఆవ్యాధితోనే దారుణమరణానికి ఆహుతి అయిపోయింది. ఆ భీకరసంఘటనలతో ఆరుణికి సంసారంపై విపరీతమైన విరక్తి కలిగింది. వెంటనే సన్యసించవలెనని అనుకొన్నాడు.

ఆ విషయం అన్నగారికి తెలియజేశాడు. ఇక కుటుంబానికంతటికీ ఆయనే పెద్ద. ఆయన కేమనడానికీ పాలుపోలేదు. వివాహం చేసుకొని గృహస్థధర్మం అవలంబించడమే న్యాయమని అనేక విధాల చెప్పిచూచాడు. అయినా ఆరుణి వినలేదు.

ఒకనాడెవరితో చెప్పకుండా బయలుదేరాడు. కేవలం కాలినడకతో కొన్ని వందల యోజనాలు ప్రయాణంచేసి అంగరాజ్యంలో గంగానదీతీరంలో ఉన్న మరీచిమహర్షి ఆశ్రమానికి చేరుకొన్నాడు. అనేక



మైలాపూర్ కపాలేశ్వరాలయంవద్ద తెప్పతిరుణాళ్ల దృశ్యం.
—ఫొటో: వి. గోపాలకృష్ణన్.

విధాల శుశ్రూషచేసి మరీచిమహర్షి వాత్సల్యం చూరగొన్నాడు.

అనతికాలంలోనే సన్యాసాశ్రమం స్వీకరించాడు., ఆపైనకొంతకాలం మరీచిమహర్షి ఆశ్రమంలోనే తన తపశ్చర్య సాగించాడు. అటుపిమ్మట మరీచిమహర్షి ఆశ్రమానికి కొంతదూరంలో ఉన్న చండీక్షేత్రంలో తపశ్చర్య కుపక్రమించాడు. అప్పటినించీ దానికి అరుణి ఆశ్రమం అనే పేరు చంపానగరం అంతటా మారుమోగింది.

రాగమంజరి వృత్తాంతం తెలుసుకొన్నకొద్దీ అరుణికి తన చిన్ననాటి విపత్పరంపరలన్నీ జ్ఞాపకం వచ్చాయి. అందుచేతనే రాగమంజరి యెడల అతని కంత జాలికలిగింది.

కాని అటుపిమ్మట ఆ వృద్ధమాత యొగవిన్న తరవాత అతని మనస్సులో ఒకవిధమైన డోలాందోళన ప్రారంభమైనది. ఇకవెంటనే రాగమంజరి నెలాగైనా తిరిగి పంపించివెయ్యడమే మంచి దనుకొన్నాడు.

అయినా అరుణికి వెనువెంటనే ఆవిషయం రాగమంజరితో ప్రస్తావించడం సముచితం కాదని అనిపించింది.

అలాగలాగ ఒక పక్షంరోజులు గడిచిపోయాయి. ఆ పక్షం రోజులలోను రాగమంజరి ఆశ్రమంలో ఎంతో అనువర్తనగా ప్రవర్తించింది. నిత్యము ఆమె చండీక్షేత్రంలోనే తనకాలం వెళ్ళబుచ్చుతు నేది. తెల్లవారు ఝామునే లేచి ఎముకలు కొరికివేసే చలిలో గంగానదిలో స్నానంచేసి జపతపాలతో కాలం వెళ్ళబుచ్చేది.

ఆ పదిహేనురోజులు గడిచిపోగానే వృద్ధమాత మళ్ళీ తిరిగి ప్రశాంతమైన ఆ ఆశ్రమంలో లేనిపోని అలజడి రేకెత్తిస్తుందేమోనని అరుణికి కొంచెం భయంవేసింది.

ఆ మరునాటి ఉదయం రాగమంజరి తెల్లవారుఝామునే లేచి పరిశుభ్రమైన నారచీర ధరించి అరుణికి పాదాభివందనంచేసింది. అరుణి ఎంతో వాత్సల్యంతో ఆమె నాశీర్వదించాడు:

"రాగమంజరీ! నీవాశ్రమానికి వచ్చి అప్పుడే ఒకపక్షం రోజులయింది. నీకీ అరణ్యవాసం ఎలాగుంది?"

"స్వామీ! నేనిక్కడకి వచ్చినప్పటినించీ ఎన్నడు ఎరగని మనశ్శాంతి అనుభవిస్తున్నాను."

అరుణి ఆమె అలాగ సమాధానం చెప్పగలదని అనుకోలేను. కొంత సేపేదో ఆలోచించాడు :

"మొట్టమొదట నీవి ఆశ్రమంలో కష్టసుఖాల కోర్చుకోలేవేమోనని అనుకున్నాను."

రాగమంజరి అవ్యంగ్యప్రశస్తివిని తలవంచుకుంది:

"అదంతా మీ అనుగ్రహం"

"నాలో ఏమి ఉంది? అదంతా అమ్మవారి అనుగ్రహం"

(43-వ పేజీ చూడండి)

బండి మలుపుతిరిగి నూకాలమ్మగుడి కనిపించగానే రాధగుండెలు ఒక్కసారి కొట్టుకున్నాయి. ఇంకొక మలుపు తిరగగానే తనకి చిరపరిచితమైన ఇళ్లూ, వ్యక్తులూ, గతుకులబాట వెంబడి మందంగా సాగుతున్నా రాధకి బండి వేగంగా పోతున్నట్టే అనిపించింది. ఆరాటపడే హృదయాన్ని ఎంత అణచిపెట్ట ప్రయత్నించినా వ్యర్థమే అయింది.

నాల్గు సంవత్సరాల అనంతరం స్వగ్రామానికి వస్తున్న ఆనందం రాధహృదయంలో లవలేశమైనా లేదు. దాని మనస్సు నిండా అనేక సంశయాలూ, భయాలూ.

ఇన్ని యేళ్ళకి తిరిగి వస్తున్న తన్ని చూచి అన్నయ్య ఆదరిస్తాడా? వదిన చేరదీస్తుందా? అన్నయ్య తన్ను క్షమించినా, క్షమించకపోయినా తన తప్పిదంమాత్రం సామాన్యమైనది కాదు.

తనకి పరిచితమైన ఆ ప్రదేశాన్ని చూడగానే రాధమనస్సు గతంలోని అనేక స్మృతుల్ని నెమరు వేసుకోసాగింది.

అన్నయ్య తన్ను ప్రాణంగా చూసుకొనేవాడు. వదిన తనంటే యిష్టంలేకపోయినా అన్నయ్యకి భయపడి తన్ను ఏమీ అనేదికాదు.

ఆ వూళ్లో అందరూ తన్ను ప్రేమించేవారు. చిన్న వయస్సులో తనకి కల్గిన దౌర్భాగ్యానికి జాలిపడేవారు.

అన్నయ్య తన్నుచూచి కంట తడిపెట్టేవాడు. తల్లీ తండ్రీ లేకపోయినా అన్నయ్య ఆదరణలో తనకు ఆ లోటు కనిపించలేదు.

అటువంటి అన్నయ్య ప్రతిష్ఠనీ, గౌరవాన్నీ మంటగలిపి నాలుగేళ్ళక్రితం తను వెళ్ళిపోయింది. నిష్కళంకమైన వంశానికి యింత మసిపూసి మాయమయింది. మళ్ళీ యింతకాలానికి మానినగాయాన్ని రేపటానికి తిరిగివస్తున్నది.

తను వెళ్ళిపోయిన నాటిరాత్రి యివేమీ ఆలోచించలేదు. ఒక క్షణిక దౌర్బల్యానికి తను లొంగిపోయింది. తన్ను ప్రాణానికి ప్రాణంగా చూసుకొనే అన్నయ్య ఆనాడు జ్ఞప్తికిరాలేదు. తనకళ్ళకి అంత మైకం కమ్మటానికి కారణం ఎవరు?

మూర్తి! అవును. మూర్తే తన హృదయంలో విషంనింపాడు. ఆనాడు తనకి హితుడుగా కనిపించాడు. అతనిమాటలే తనకి వేదవాక్కులుగా వినిపించాయి. తన దౌర్భాగ్య జీవితాన్ని సుఖమయంచేస్తాడని నమ్మింది.

కాని చివరికి జరిగిం దేమిటి? తన్ను సర్వనాశనంచేసి చివరికి చెప్పకుండా వెళ్ళిపోయాడు.

చివరికి, అన్నివిధాల తను భ్రష్టురాలు అయినతర్వాత మళ్ళీ అన్నయ్యే కనిపించాడు.

మూర్తి వెళ్ళిపోయాక తను ఏవిధంగానూ అన్నయ్యకి ముఖం చూపించలే ననుకుంది. తనవంటి పతితజీవితానికి మరణమే శరణ్యమనుకుంది.

కాని, అన్నయ్యనీ, స్వగ్రామాన్నీ చూడాలనేకోరికను అణచుకోలేకపోయింది. అందువల్లనే సిగ్గునూ, సంకోచాన్నీ అణచిపెట్టి మళ్ళీ తిరిగిరావటానికి సిద్ధపడింది.

"ఎవరింటికి వెళ్ళాలి? అమ్మగారూ!" అన్న బండివాని ప్రశ్న రాధ మనస్సులోని ఆలోచనల్ని చెదరగొట్టింది.

****

[illegible] ఆనందం

****

బండి ఊళ్లో ప్రవేశించింది. చీకటి పడటంమూలంగా తన్ను ఎవరూ గుర్తించలేదు. అంతవరకూ అదృష్టమే.

"అదిగో! అదే! ఆగాంధీబొమ్మ కెదురుగా నున్న ఎత్తరుగుల యిల్లు. అక్కడ ఆపు చెయ్యి." రాధవణుకుతున్న కంఠంతో చెప్పింది.

బండి గుమ్మందగ్గిర ఆగగానే రాధ గుండెలు కూడా ఒక్కసారి ఆగినట్టు అనిపించింది.

బండిలోని సామాను అరుగుమీద దించి, డబ్బులు తీసుకుని బండివాడు వెళ్ళిపోగానే రాధ యింట్లో అడుగు పెట్టింది.

తను పుట్టి పెరిగిన ఆయింటిని చూడగానే రాధకి దుఃఖం ఉబికి వచ్చింది. పొంగివచ్చే కన్నీటిని ఆపుకుని లోపల అడుగు పెట్టింది.

"ఎవరువారు?" అంటూనే మేడదిగి వస్తున్న సీతయ్య రాధని చూడగానే బావురుమన్నాడు.

గందరగోళం విని బైటికి వచ్చిన రాజ్యలక్ష్మి సావిట్లో రాధని చూడగానే నిశ్చేష్టయై నిలబడిపోయింది. కొద్దిసేపు అలాగే నిలబడి తర్వాత తలవంచుకొని లోపలికి వెళ్ళిపోయింది.

రాధ ఆమెను అనుసరించబోయి మళ్ళీ సంకోచంతో అక్కడే నిలబడిపోయింది.

కళ్లు తుడుచుకుంటూ నిలబడిన సీతయ్యని చూడగానే రాధకళ్ళల్లో నీళ్లు తిరిగినై. సీతయ్య! ఈసీతయ్య చేతులలోనే తను పెరిగి పెద్దయింది.

"మేడమీదకు పద తల్లీ! సామాను నీగదిలో పెడతాను" అంటూ కళ్ళు ఒత్తుకుంటూ సీతయ్య సామాను తేవటానికి బైటికివెళ్ళి పోయాడు.

"ఈ ముసలివాడు నన్ను క్షమించాడు" అనుకుంది రాధ మనస్సులో.

మేడమీద పూర్వం తనుండేగదిలోకి ప్రవేశించగానే రాధ ఏడుపుని దిగమింగుకోలేకపోయింది. ఈ గదిలోనే తను బాల్యంనించి యౌవనం వరకూ అనేక సంవత్సరాల నిర్మల జీవితం గడిపింది. ఆ స్మృతులు చితులై ఆమె హృదయాన్ని దహించి వేయసాగినై. కుర్చీలో కూలబడి రెండు చేతులలోనూ ముఖాన్ని కప్పుకొని వెక్కి వెక్కి ఏడ్చింది.

"రాధమ్మ"

రాధ తలఎత్తి చూచింది. సామానులోపల పెట్టి సీతయ్య ఎదురుగా నుంచున్నాడు.

"సీతయ్య" అంటూనే మళ్లీ వెక్కి వెక్కి ఏడ్చింది.

సీతయ్య కన్నీటిని తువ్వాలుతో మాటిమాటికీ తుడుచుకుంటూ నుంచున్నాడు.

రాధ దుఃఖాన్ని దిగమింగుకుని "అన్నయ్య ఏడి, సీతయ్యా" అని అడిగింది.

"ఎక్కడికో వెళ్ళారమ్మా" అని సీతయ్య క్షణంసేపు వూరుకుని "ఏవన్నయ్యామ్మా! ఆబాబును చూస్తే గుండె చెరువైపోతున్నాది. పైకి ఏమీ కనిపించడు కానీ నీకోసం ఆయన ఎంత కుమిలిపోతున్నాడో? అట్టాంటి అన్నయ్యని వదిలి ఎక్కడి కెళ్ళావమ్మా?" అన్నాడు.

రాధ మౌనంగా ఆలోచిస్తూ కూర్చుండిపోయింది. కొద్దిసేపటికి మెల్లగా "అన్నయ్య నేను చచ్చిపోయానని అనుకోలేదా సీతయ్యా?" అని అడిగింది.

సీతయ్య బిగ్గరగా ఏడుస్తూ "అట్టాంటి మాట లనకమ్మా" అన్నాడు.

రాధ నిశ్చలంగా శూన్యంలోకి చూస్తూ "నిజంగా రాధమ్మ చచ్చిపోయింది సీతయ్యా!" అంది.

సీతయ్య చెవులు మూసుకుని "నేను వినలేనమ్మా రాధమ్మతల్లీ!" అని ఏడుస్తూనే బైటికి వెళ్ళిపోయాడు.

సీతయ్య వెళ్ళిపోగానే రాధకి మళ్ళీ

ఒక్కసారి బిగ్గరగా ఏడవాలనిపించింది. కాని యీ వేళ తన ఏడుపుకి విలువేమీ లేదు.

రాధ కుర్చీలోనించి పైకిలేచి కిటికీ తలుపులు తెరిచింది. కిటికీలోనించి ఆ గ్రామమంతా కనిపిస్తుంది. పూర్వం యీ కిటికీలోనించి క్రిందికి చూస్తూ గంటలతరబడి గడిపేది. కాని, యీ వేళ నిద్రాముద్రితమైన ఆ గ్రామదృశ్యం ఆమె హృదయంలో కలవరం రేపుతోంది.

ఎదురుగా కనిపించే మేడ చూడగానే రాధ ఒక్కసారి ఉలిక్కిపడింది. తను ఎప్పుడూ ఆ మేడ కిటికీ కేసే చూసేది. ఆ కిటికీలోనించే మూర్తి తనమీద అస్త్రాన్ని ప్రయోగించింది. దాని పర్యవసానమే ఈ వేళటి తన స్థితి. రాధ కిటికీ తలుపులు మూసివేసింది.

క్రింద రాజ్యలక్ష్మి కంఠం రాధని మళ్ళీ యీ లోకంలోనికి తీసుకొనివచ్చింది.

"మీ ముద్దుల చెల్లెలు వచ్చింది. పైకివెళ్ళి పలకరించలేదేం?" వదిన కంఠం వినిపించింది.

"రాధ వచ్చిందా?" ఆశ్చర్యంతో కూడిన అన్నయ్య కంఠం వినిపించిది.

"ఆ! వెళ్ళి పరామర్శించండి" వదిన వ్యంగ్య బాణం విసిరింది.

"నోర్ముయ్యి" అని అన్నయ్య గదమాయింపు.

సంభాషణ అంతటితో ఆగిపోయింది. రాధగుండెలు దడదడ కొట్టుకోసాగినై. అన్నయ్యకి తనముఖం ఎలా చూపెంచగలదు.?

నిలుచున్న పళంగా తను చచ్చిపోతే బాగుండు ననిపించింది. తన పాపిష్టి ముఖం చూసి అన్నయ్య క్షమిస్తాడా?

"రాధా" ప్రేమ పూరితమైన అన్నయ్య గద్గద స్వరం వినగానే రాధ వుక్కిరి బిక్కిరయింది. అన్నయ్యముఖం చూడలేక పోయింది.

"అన్నయ్యా" అంటూ అతని పాదాల వద్ద కూర్చుండి పోయింది.


"చెల్లాయీ" అంటూ ఆమె తల నిమిరి కళ్ళు తుడుచుకుంటూ బైటికి వెళ్ళి పోయాడు.

రాధ వెక్కుతూ అలాగే కూర్చుండి పోయింది.

సీతయ్య అన్నం తీసుకునివచ్చి పలకరించే వరకూ రాధ అలాగే కూర్చుండి పోయింది. సీతయ్య దగ్గరకివచ్చి తల నిమురుతూ "అన్నం తీసుకువచ్చాను. తిని పడుకో తల్లీ! పొద్దుపోయింది" అన్నాడు.

రాధ పైటచెంగుతో కన్నీళ్ళు తుడుచుకుంటూ

"సీతయ్యా! అన్నయ్య నన్ను క్షమించాడా?" అని అడిగింది.



విద్యుద్దీపాలతో ప్రకాశించే సెంట్రల్ స్టేషను.

—ఫొటో: వి. కేశవశర్మ.

సీతయ్య కొద్దిగా నవ్వుతూ "పిచ్చితల్లీ! ఆయన అందరి లాంటి వాడు కాదమ్మ" అన్నాడు.

రాధకళ్లు సంతృప్తితో మెరిశాయి

"నా కాకలి కావటం లేదు సీతయ్యా!" అంది. సీతయ్య ఆతురతపడుతూ "అట్లా కాదమ్మ. కొద్దిగా ఎంగిలిపడు. ఎప్పుడో సగా తిన్నావో" అన్నాడు.

రాధ యింకేమీ మాట్లాడకుండా భోజనం ముగించింది. సీతయ్య కంచం తీసుకుని వెళ్ళి పోయాడు.

రాధ హృదయం యిప్పుడు తేలికపడింది అన్నయ్య తన్ను క్షమించాడు. తన కింకేమీ అవసరం లేదు.

వదిన తను యిక్కడికి వచ్చినదగ్గరనించీ ఒక్కసారి కూడ యిటు తొంగి చూడలేదు భోజనం పైకి పంపించటంలోని భావంకూడా తనకి బాగానే అర్థమయింది. అన్నయ్య క్షమించాడన్న ఆనందంలో వదిన చేసిన యీ సత్కారం తన్నేమీ బాధించలేదు.

మంచంమీద పడుకుని సంతృప్తిగా నిట్టూర్చింది అన్నయ్య హృదయం తనకి తెలుసు. చిన్నతనంనించీ అన్నయ్య తన చెల్లెల్ని ఎన్నోమార్లు క్షమిస్తూ వచ్చాడు.

చిన్నతనంలో తను అన్నయ్య పుస్తకాలు చింపివేసేది. పెన్ను పాళీలు విరగకొట్టేది. అన్నయ్యకి కోపం వచ్చేది.

కోపంగా "చెల్లాయి" అని అరిచేవాడు. తను భయంతో ఒణికిపోతూ అమ్మదగ్గర దాక్కునేది

అన్నయ్య బెత్తం తీసుకుని వచ్చి "ఏంరా" అని కళ్ళెర్రచేసి పిలిచేవాడు.

తను అమ్మని కావలించుకునేది. అన్నయ్య "రమ్మంటే నీకాదూ? ఇలారా!" అనేవాడు.

అమ్మ "దాని ప్రాణాలు తీసేస్తావేమిట్రా"

★ సినీవాలి ★

అనేది. "నీకు తెలియదు వూరుకో అమ్మా" అని అమ్మని కసురుకొనేవాడు.

తన్ని చేయిపట్టుకుని గదిలోకి తీసుకెళ్ళి "వూ! చెప్పు. నా గదిలోకి వచ్చి యివన్నీ ఎందుకు పాడుచేశావ్. చెప్పు. చెప్పవేం?" అని బెత్తం ఎత్తేవాడు.

తను భయంతో బెదురుచూపులు చూసేది. అన్నయ్య చప్పున చేతిలో బెత్తం అవతలికి విసిరేసి తన్ను ఎత్తుకుని ముద్దుపెట్టుకునే వాడు.

"పోయి ఆడుకో. ఇంకెప్పుడూ యిలాంటి పాడు పనులు చేయకేం" అనేవాడు నవ్వుతూ.

తనూ అన్నయ్య మెడచుట్టూ చేతులు వేసి కిలకిలా నవ్వేది.

అప్పటిలాగే అన్నయ్య యిప్పుడూ తన్ను క్షమించాడు. అన్నయ్య ఏమీ మారలేదు. అప్పటి అన్నయ్యే. కాని తనే మారింది. అన్నయ్య ఆనాటి అన్నయ్యే. కాని తను మాత్రం ఆనాటి ముద్దులచెల్లెలు కాదు. ఆ పసితనపు నిర్మలత్వం ఈనాడు తన హృదయంలో ఏకోశానా లేదు.

రాధ యింక ఆలోచించలేకపోయింది. కాని ఆనాటి స్మృతులు రాధహృదయంలో మెదుల్తూనే వున్నాయి.

తన చిలిపితనం భరించలేక అమ్మ తన్ను కొట్టడానికి వచ్చేది.

తను పరిగెత్తుకుని అన్నయ్య దగ్గిరికి వెళ్ళేది. అన్నయ్య తన్ను దగ్గిరికి తీసుకునే వాడు.

అమ్మ కోపంతో మండిపడుతూ వచ్చేది. అన్నయ్య నవ్వుతూ "ఇంకెప్పుడూ చెయ్యదులే. ఈవేళకి వూరుకో అమ్మా!" అనే వాడు.

అమ్మ "నువ్విలా నెత్తికెక్కించుకో బట్టే అదిలా తయారయింది. వదులు. దాని సంగతేవిటో యివేళ తేలుస్తాను" అనేది కోపంతో.

అన్నయ్య అడిగేవాడు "దాన్ని కొడితే కాని యీవేళ నీకోపం తీరదా అమ్మా?"

"దాని చర్మం వొలిచేదాకా నాకు కోపం పోదు" అనేది అమ్మ.

అన్నయ్య నవ్వుతూ "అయితే దాని బదులు నన్ను కొట్టుకో అమ్మా!" అనే వాడు.

అమ్మ మనస్సు కరిగిపోయేది. నవ్వుతూ "అయితే నీ కొక్కడికేనా ఏవిట్రా చెల్లెలు వున్నది? ఇంతోటి చెల్లెలూనూ. బాగా దొరికార్రా మీ రిద్దరూనూ" అనేది.

అన్నయ్య తన తల నిమురుతూ ప్రేమతో అనేవాడు "అవునమ్మా! యిలాంటి చెల్లాయి నా కొక్కడికే వుంది" ఆనందంతో అమ్మ కళ్ళల్లో నీళ్లు తిరిగేవి.

ఎలాంటి చెల్లాయి? అన్నయ్య గౌరవాన్నీ, ప్రతిష్ఠనీ మంటకలిపిన యిలాంటి చెల్లాయేనా? యిలాంటి చెల్లాయిని చూసేనా ఆనాడు అన్నయ్య మురిసి పోయింది?

ఛీ! ఆ అన్నయ్యకి చెల్లాయి అనిపించుకునే యోగ్యతలేదు తనకి. అన్నయ్యను అన్యాయంచేసి తను యింకా ఎలా జీవించి వుండగలిగింది?

అన్నయ్య ఇప్పుడు ఏం చేస్తున్నాడో?

....

అన్నయ్య రాధనుగురించే ఆలోచిస్తున్నాడు. రాధ అలా ఎందుకు వెళ్లిపోయింది? తను ప్రాణపదంగా చూసుకునే చెల్లాయి తన్ను విడిచి ఎందుకు వెళ్ళిపోయింది?

అమ్మ, నాన్నగారు చచ్చిపోయినా ఆ లోటు కనిపించకుండా తన చేతులతో ఎంతో అపురూపంగా పెంచాడు.

తన తాహతుకు మించినదే అయినా ఎంతో కష్టపడి పెద్ద సంబంధమే తీసుకుని వచ్చి పెళ్ళి చేశాడు.

ఆరోజుల్లో అందరూ తన్ని అభినందించారు. అప్పగింతల రోజున ఆడదానిలాగే భోరున ఏడ్చాడు.


ఎప్పుడూ తన కళ్ళఎదుట తిరిగే చెల్లాయి వెళ్ళి పోతుందన్నప్పుడు తన సర్వస్వాన్నీ పోగొట్టుకొన్నవానిలాగే బాధ పడ్డాడు.

అయినా ఆమె పెద్దయింటికి వెళుతోందన్న ఆనందం తన బాధని మరచిపోయేటట్టే చేసింది.

కాని, ఆ ఆనందం ఆట్టేకాలం నిలవలేదు. ఆరునెలల్లోనే ఆమె తిరిగి తనయింటికి వచ్చి వేసింది. వచ్చేటప్పుడు తన మాంగళ్యాన్నీ, సౌభాగ్యాన్నీ తుడిచి పెట్టుకుని మరీ వచ్చింది.

పసితనంలో ఆమెకి కలిగిన దౌర్భాగ్యాన్ని తలుచుకొని కుమిలికుమిలి ఏడ్చాడు.

ఆమె వైధవ్యం తలుచుకొన్నప్పుడల్లా అతని గుండె తరుక్కుపోయేది.



చార్మినార్

—ఫోటో: వి. గోపాలకృష్ణన్.

ఆమె మనస్సు ఎక్కడ నొచ్చుకుంటుందోనని ఎంతో ప్రేమతో చూసేవాడు.

ఆడబిడ్డంటే కళ్ళల్లో నిప్పులు పోసుకునే తన భార్యనుకూడా ఆమెజోలికి పోనిచ్చేవాడుకాదు,

తను యింతచేసినా ఆమె తన్నువిడిచి ఎందుకు వెళ్ళిపోయింది!

తన చెల్లాయి చేసినపనికి తను వూళ్ళో తలెత్తుకొని తిరుగలేకపోయాడు.

ఆమె చేసిన పని ఎలాంటిదయినా తను మాత్రం ఆమెను మనస్ఫూర్తిగా క్షమించాడు. ఆమెతప్పు క్షమించరానిదీ కావచ్చు. అసామాన్యమైనది మాత్రం కాదు.

ఆమె తనకి అన్యాయంచేసి వెళ్ళిపోయింది. కాని, భగవంతుడు ఆమెని అన్యాయం చేశాడు.

వయసులో వుండే కోర్కెల్నీ, వాంఛల్నీ అణచుకోలేక క్షణిక దౌర్బల్యానికి లొంగిపోయింది.

తన నిర్మలత్వాన్నీ, చరిత్రనీ కళంకితం చేసుకుంది.

అన్నివిధాల భ్రష్టురాలయి నతర్వాత మళ్ళీ తన దగ్గిరికి వచ్చింది.

ఈ స్థితిలో ఆమెను దిక్కులేనిదానిలా ఇంటినుండి ఎలా వెళ్ళగొట్టగలడు?

మరొకరైతే అలా చెయ్యగలరేమో! తన చేతుల్లో పెంచిన చెల్లెల్ని తను మాత్రం దిక్కులేనిదానిలా బైటికి వెళ్ళగొట్టలేడు.

పతితయైన తన చెల్లెల్ని తను చేరదీసి ఆదరిస్తాడు. ఎవరేమనుకున్నా తనకేమీ లెక్కలేదు.

ఏ సంకోచంవల్ల కొద్దిసేపటి క్రింద రాధని పలకరించలేకపోయాడో ఆ సంకోచము ఇప్పుడు అతనిహృదయంలో లేదు.

కలవరపడే ఆమె మనస్సుకి అభయమిచ్చి ఊరట కలిగించాలి.

అతడు మంచం దిగి చెల్లెలు గదివైపుకు వెళ్ళాడు. దగ్గరగా వేసివున్న తలుపులు త్రోసుకుని లోపలికి వెళ్లాడు.

"చెల్లాయి" మృదువుగా ప్రేమ వుట్టిపడుతూ పిలిచాడు. కాని రాధ ఆ గదిలో లేదు.

అతడు భయంతో వణికిపోయాడు.

"చెల్లాయి" బిగ్గరగా పిలిచాడు. రాధ పలకలేదు. ఎక్కడకు వెళ్ళింది!

ఆతురతతో బయటికివచ్చి చూశాడు. రాధ కనిపించలేదు. అతడు నిస్పృహతో లోపలికి వచ్చాడు.

చెల్లాయి లేదు. మళ్ళీ వెళ్ళిపోయింది. ఇక తిరిగిరాదు.

ఆమె వెళ్ళిపోవటానికి కారణం తనే. ఆమెను తను సరిగా పలకరించలేదు. అందుకనే వెళ్ళిపోయింది.

దుఃఖంతో మంచం మీద కూలబడిపోయాడు. మంచంమీద ఏదో కాగితం కనిపించింది. వణుకుతున్న చేతులతో దాన్ని తీసుకుని చదువుకున్నాడు.

రాధ వ్రాసింది.

"అన్నయ్యా!,

నన్ను క్షమించావు. నాకంతే చాలు. యీ పాపిష్టిదానికి యింక ఏ ఆశాలేదు. నన్ను క్షమించి నీ ఉదారతని మరోసారి నిరూపించుకున్నావు.

కాని, నీ చెల్లెల్నని పించుకునే యోగ్యత యీ దౌర్భాగ్యురాలికి లేదు. నేను వెళ్ళిపోతున్నాను. నీ చెల్లెలివలన నీకు కలిగిన అప్రతిష్టను నీ చెల్లెలితోనే నాశనం కానీ. నేను ఇంకా వుండి దాన్ని పెంపొందించటం ఇష్టంలేదు. అందువల్లనే వెళ్ళిపోతున్నాను.

జన్మంటూ వుంటే మళ్ళీ నీకు చెల్లెలుగానే జన్మించాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను. శెలవు. —రాధ."

సజలనేత్రాలకు కాగితంలోని అక్షరాలు అలికిపోయినట్లు అగుపించాయి. రుద్ధకంఠంనుంచి "చెల్లాయి" అన్న పిలుపు పైకి రాలేక హృదయంలోనే ఉండిపోయింది.

★

సానుభూతి

వేములపల్లి గోపాలకృష్ణ

రాత్రి పదిగంటలు దాటింది. పగలంతా అలసిన శరీరం నిద్రను కోరుతున్నది. రోజులాగే బాతాఖానీకి వచ్చిన మిత్రద్వయం త్వరలో కదిలే సూచనలు కనిపించలేదు. గదిలో వున్న మంచి కుర్చీలు చెరొకటి ఆక్రమించుకొని, సిగరెట్లకు దహన సంస్కారం చేస్తున్నారు. మా బాతాఖానీ ఆవరణలోకి రాని విషయాలంటూ వుండవు. విశ్వనిర్మాణం దగ్గరనుంచి పరమాణు స్వరూపం వరకు, అనాది మానవ నాగరికత మొదలుకొని రాబోయే కాలములలో వర్ధిల్లబోయే నాగరికతవరకు, ఇతిహాసాల దగ్గరనుంచి అత్యాధునిక సాహిత్యంవరకు — మానవకోటికి తెలిసిన ప్రతివిషయం—ఆ బాతాఖానీ ఆవరణలోనికి వస్తాయి. ఆరోజు వాళ్ళిద్దరూ చాల గట్టిగా మాట్లాడుతున్నారు. నేను మాత్రం నిద్రాభారంవలన అంతగా మాట్లాడటంలేదు. వాళ్లు ఏ విషయం మీద మాట్లాడుతున్నది కూడ నాకు అంతగా పట్టలేదు.

"ఎలాగయినా నలుగురి సానుభూతి లేకుండా జీవించటం చాలకష్టం. నా వుద్దేశంలో అసంభవం" అన్నాడు నరసింహం కుర్చీ కిటికీ దగ్గరకు జరుపుతూ.

"సుఖంగా బ్రతకటానికి సానుభూతికి సంబంధం లేదు. నలుగురూ నిన్ను అసహ్యించుకొంటే నీకు వచ్చే జీతం రాకపోతుందా?... తిండి కూడా దొరకకుండా పోతాయా? మనం జీవించటానికి యితరుల సానుభూతి వుండాలనటంలో అర్థం లేదు." రామారావు తన అభిప్రాయాన్ని చెప్పాడు. రామారావు ఎప్పుడు మాట్లాడినా చివరివాక్యం ఎదుటివాని మాటకు అర్థం లేదని సూచిస్తుంది.

"అదేంమాటగాని, అందరూ మనను ద్వేషిస్తూవుంటే జీవితం చాల బాధగా వుంటుంది. నీకు ఒక్క స్నేహితుడంటూ లేడనుకో, నీకు తెలిసిన వాళ్ళందరకు నీవంటే అసహ్యంఅనుకో—అప్పుడు యింత ఆనందంగా జీవించగలవా?" ప్రశ్నించాడు నరసింహం.

"అలా జీవించినవాళ్ళు లక్షమంది. అసలు అలాంటి జీవితం గడపిన వాళ్ళు చాల గొప్ప వాళ్ళయ్యారు" అన్నాడు రామారావు. రామారావు మాటలు ఆ పేటలో వున్న వాళ్ళందరికి వినిపించి వుంటాయి.

"ఎవరో ఒకళ్ళిద్దరి సంగతి చెప్పకు; మన లాంటివాడి సంగతి మాట్లాడు......... ఇంతెందుకు కనకారావు ఏమయ్యాడు?" అన్నాడు నరసింహం.

ఏనాటి కనకారావు? ఆ మాటతో హృదయంలో ఎక్కడో దాగివున్న పాత ఘట్టం మీద కాంతి ప్రసరింపజేసినట్లయింది. మాలో వున్న క్రూరత్వానికి, కాఠిన్యానికి, గురి కనకారావు. కేంద్రీకరించబడిన సూర్యకిరణాలకు మెత్తని దూది భగ్గుమన్నట్లు, అతని జీవితం మాద్వేషానికి కాలిపోయింది.

* * * *

అయిదేళ్ళ క్రితం జరిగిన సంగతి:

మబ్బులు దట్టంగా కమ్ముకొని, వుదయం తొమ్మిది గంటలకుకూడ చీకటిగా వుంది. వర్షం కురుస్తానని భయపెడుతోంది. వండినవాడిని మనస్సులో తిట్టుకుంటూ హాస్టలు మెస్సులో అన్నం తింటున్నాను. ఇంతలో నా ప్రక్క యింకొక వ్యక్తి వచ్చి కూర్చున్నాడు. మొఖం చూడగానే హాస్టలులో కొత్తగా చేరాడనుకున్నాను. వచ్చిన వ్యక్తి తెల్లటి బట్టలు వేసికొన్నాడు. అతను పొడగరికాకపోయినా కురూపకాదు. పచ్చటి శరీరచ్ఛాయ. అతనిని చూసినవెంటనే నాటకాలలో స్త్రీ పాత్ర ధరించటానికి సరిపోతా డనిపిస్తుంది.

కొద్ది నిముషాలలో యిద్దరం మాటలలోకి దిగాం. "క్రొత్తగా చేరారా?" అని ప్రశ్నించాను నేను.

"అవును"

"పేరు"

"కనకారావు"

"ఏందులో చేరారు"

"బి. యస్. సి; ఫిజిక్స్"

"ఇంటర్ మీడియెట్ ఎక్కడ చదివారు?"

"రాజమండ్రిలో"

"బి. యస్. సి. కూడ అక్కడే చదవక పోయారా?"

"అక్కడ సీటు దొరక లేదు"

కొద్ద నిముషాలు యిద్దరం మాట్లాడలేదు. "మీరేం చదువుతున్నారు?" అన్నాడు కనకారావు.

"బి. యస్. సి; కెమిస్ట్రీ"

తరువాత భోజనాలు అయ్యేవరకు మేము మాట్లాడలేదు. ఇది కనకారావుతో నా మొదటి పరిచయం. తరువాత ఎప్పుడు కలుసుకొన్నా అభినందించేవాడు. నేను కూడ చిరునవ్వుతో జవాబు చెప్పేవాడిని. అంతకు విశేషించి మా పరిచయం దృఢపడలేదు. నాకు అప్పటినుండి కనకారావు అంటే మంచి అభిప్రాయం వుండేది — ఆ అభిప్రాయానికి కారణం తెలియదు.

వేసంగి సెలవులవరకు మా పరిచయం అలాగే వుండిపోయింది.

వేసంగి సెలవులు వచ్చాయి. హాస్టలు విద్యార్థులంతా — పరీక్షలున్న సీనియర్సు తప్ప—ప్రయాణం హడావుడిలో వున్నారు. నేను సాయంత్రం బండికి ప్రయాణం నిశ్చయించుకొన్నాను. కనకారావుకూడ వస్తాడేమో కనుక్కోటానికి అతని గదికి వెళ్లాను. నేను వెళ్లేసరికి కనకారావు ఏదో పుస్తకం — నవల కాబోలు — చదువుతున్నాడు. తలుపు తెరచిన చప్పుడు విని తలయెత్తి, నేను రావటం చూసి "రండి, కూర్చోండి" అన్నాడు, ఎదురుగా వున్న కుర్చీ చూపిస్తూ.

నేను కూర్చున్నాను. కొద్ది నిముషాల తరువాత "హాస్టలుకు సెలవు లిచ్చారు" అన్నాను.

అవును అన్నట్లు చిన్నగా నవ్వాడు కనకారావు.

"యేడాది అంతా చిటికెలో గడచినట్లు వుందండి" అన్నాను నేను.

"జూనియర్ క్లాసు గదా!" అన్నాడు కనకరావు చేతిలో వున్న పుస్తకాన్ని బల్లమీద పెడుతూ, కొంచెం సేపు ఆగి.

"ఎప్పుడు వెళ్తున్నారు" అని అడిగాను.

"సాయంత్రం...మీరు?"

"నేను వెళ్ళటం లేదు"

"ఏమి"

కనకారావు చాలాసేపటివరకు మాట్లాడలేదు. నా ప్రశ్న వినిపించుకోలేదేమో అనుకొని, మరల ప్రశ్నించబోయే సరికి జవాబు చెప్పాడు.

"మా అమ్మ, నాన్న లేరు...చిన్నప్పుడే చనిపోయారు"

"తోడబుట్టిన వాళ్ళెవరూ లేరా?" అన్నాను ఆశ్చర్యాన్ని ప్రదర్శిస్తూ.

"ఎవ్వరూ లేరు. మా తల్లిదండ్రులకు నేను ఒక్కడినే" అన్నాడు కనకారావు. అతని గొంతుక స్పష్టంగా వుంది. అతని గొంతుక బాధను వెల్లడిస్తోంది.

"చుట్టాలెవరూ లేరా!" మరింత ఆశ్చర్యంతో ప్రశ్నించాను.

"దగ్గర చుట్టాలెవరూ లేరు" అన్నాడు కనకారావు. ఈసారి అతను ఆ బాధను, నా ప్రశ్నలమూలంగా వుద్భవించిన విసుగును కప్పిపుచ్చటానికి కాబోలు చిన్నగా నవ్వాడు.

నేను చాలా సేపటివరకు మాట్లాడలేదు. అటువంటి సమయంలో ఏమి మాట్లాడాలో నాకు తట్టలేదు. చివరకు "మరి చిన్నప్పటినుండి మీ చదువు" అన్నాను.

కనకారావు కొద్ది నిముషాలవరకు మాటలాడలేదు. ఆ తరువాత జవాబు చెప్పాడు: "నేను పుట్టిన వెంటనే మా అమ్మ మరణించింది. నేను మా అమ్మను ఫొటోలో తప్ప చూడలేదు. నేనంతా మా అమ్మ పోలికే." మా నాన్నగారు మాత్రం నా పదమూడవ సంవత్సరం వరకు బ్రతికివున్నారు కాని..." కొంచంసేపు ఆగి మిగతా చరిత్రను ఎలా చెప్పాలో ఆలోచిస్తున్నట్లు నేలకేసి చూస్తూ వూరుకొన్నాడు. "...మా నాన్న అదో రకం వ్యక్తి. నాకు తెలిసినంతవరకు ఆయనకు వ్యాపారం మీద తప్పితే మిగతా విషయాలమీద మనస్సు పోయేది కాదు. ఆయన మోటారు లారీలమీద రవాణా వ్యాపారం చేస్తూ వుండేవాడు. వారానికి అయిదురోజులయినా వ్యాపార నిమిత్తం ఇంకో వూరిలో వుండేవాడు. వూర్లో వున్నప్పుడయినా ఎక్కువకాలం యింట్లో వుండేవారు కాదు. ఆ బజారులో వున్న వ్యాపారస్తులతో మాట్లాడడానికి వెళ్ళేవారు. ఇంట్లో వున్నప్పుడు బీరువాముందు కూర్చుని ఏవో కాగితాలు తిరగవేస్తూ వుండేవారు. నాతో అంతగా మాట్లాడేవారు కాదు.

"మా నాన్నగారితో మాట్లాడాలంటే చీకటిపడిన తరువాతగాని వీలుండదు. రాత్రి నాన్నగారు—వూరిలో వుంటే— సావడిలో మంచం వేసికొని పడుకొనేవారు. నేనుఏదో మాట్లాడదామని కుతూహలంతో వచ్చి మంచానికి దూరంగా కాలి బొటనవ్రేలు నేల మీద రాస్తూ నిలబడేవాడిని. చాలాసేపటికి గాని నన్ను గమనించేవారు కాదు. అప్పుడు "ఏమిటిరా?" అనేవారు. నేను "ఏం లేదు" అనేవాడిని. "ఇలా వచ్చి కూర్చో" అనేవారు మంచం పట్టె చూపెడుతూ. నేను మంచం పట్టెమీదకూర్చునేవాడిని, అరచెయ్యి గడ్డానికి ఆనించి. చాలసేపటివరకు అలాగే కూర్చునేవాడిని; కాని ఆయన ఏమీ మాట్లాడేవాడు కాదు. ఏవో తెగని విషయం మీద ఆలోచిస్తూ వుండేవారు చివరకు 'వెళ్ళి మంచంమీద పడుకో' అనేవారు... అలావుండేది మా సంభాషణ.

"బాగా వయస్సు ముదిరిన ఒక ముసలమ్మ మాయింట్లో నేవుండి అన్నం వండిపెట్టేది. [illegible] గాని, అమ్మమ్మా అని పిలిచేవాడిని. ఆవిడ కూడా అంతగా మాట్లాడేది కాదు ఎప్పుడూ ఏవో గొణుక్కుంటూ వుండేది. నేను ఆవిడతో అవసరమయిన విషయాలు తప్పించి మాట్లాడేవాడిని కాదు."

కనకారావు మరల ఆగాడు. చాలసేపటికి క్షీణించిన గొంతుకతో మొదలుపెట్టాడు.

"ఇలా నా పదమూడవ సంవత్సరం వరకు జరిగింది. అప్పుడు నేను నాల్గవఫారం చదువుతున్నాను. ఒకనాడు నేను బడి నుండి వచ్చేసరికి నాన్నగారు నూటమూడు డిగ్రీల జ్వరంతో పడుకొని వున్నారు. అలా జ్వరం నాలుగురోజులు కాబోలు వుంది. అయిదోరోజు మధ్యాహ్నం మంచం ప్రక్కగా విచారంగా నిలుచుని వున్నాను. నాన్నగారు కొంచంసేపటికి కన్ను తెరచి చుట్టూ చూశారు. నావైపు తిరిగి దగ్గరకు రమ్మనమన్నట్లు సంజ్ఞచేశారు. నేనువెళ్ళి మంచం పట్టెమీద కూర్చున్నాను. అప్రయత్నంగా నాకళ్లు చెమ్మగిల్లాయి. నాన్నగారు ఒకచేత్తో నావీపు నిమురుతూ, రెండో చేతిలోకి నాచేతిని తీసుకొని, వినిపించీ వినిపించకుండా ఏదో చెప్పారు. అంతవరకు నాలోవున్న దుఃఖం అంతా ఒక్కసారి బయటకు వచ్చింది— నేను కుమిలి కుమిలి ఏడవటం మొదలుపెట్టాను. నాన్నగారు మాత్రం నావీపు నిమురుతూ నన్ను ఓదార్చటానికి ఏవోమాటలు చెప్పారు......నేను మా నాన్నగారి కళ్ళలోకి ఎప్పుడూ సూటిగా చూడలేదు. ఆయనంటే నాకు మొదటి నుండి ఒకరకం భయం వుండేది. కాని ఆ నిముషాన ఆయన కళ్లుగూడ చెమ్మగిల్లి వున్నాయని నా నమ్మకం...తరువాత ఒక గంటకు నాన్నగారు చనిపోయారు" కనకారావు ఒకనిట్టూర్పు విడిచాడు. చాలాసేపటి వరకు మాట్లాడలేదు. నేను యిక చెప్పవలసినది అయిపోయింది అనుకుంటూవుంటే తిరిగి ప్రారంభించాడు.

"చనిపోయేముందు ఆ ఆస్తిఅంతా నా పేర వ్రాసి గుంటూరులో ఒకప్లీడరును ట్రస్టీగా వుంచారు. మా నాన్నగారు చనిపోయిన రెండు నెలలకు వంటవండే ముసలమ్మకూడ మరణించింది. తరువాత నేను రెసిడెంషి

★ సానుభూతి ★

"యల్ స్కూలులో చదివాను," కనకారావు ముగించాడు.

ఇద్దరం మూగగా చాలాసేపు కూర్చున్నాం. ఆసమయానికి మాటలుకన్నా నిశ్శబ్దం ఉచితంగావుంది. ఆ నిశ్శబ్దాన్ని భరించలేక "వస్తాను"అంటూ యివతలకు వచ్చాను ఆ తరువాత చాలరోజులవరకు, ఖాళీగా కూర్చున్నప్పుడు, కనకారావుతో నాసంభాషణ జ్ఞాపకంవచ్చి, మనస్సు చివుక్కుమనేది.

కనకారావును మొట్టమొదట నేను కలుసుకొన్నప్పుడు, చాల తెలివయిన వ్యక్తి అయివుంటాడనుకున్నాను. అతని ముఖకవళికలు చూచిన వారెవరయినా అలాగే వూహిస్తారు. కాని నావూహ నిజంకాదని తెలియటానికి ఎంతోకాలం పట్టలేదు. కనకారావుకు అందరికన్నా తక్కువమార్కులు వచ్చేయి. అతను పరీక్షలలో వ్రాసే జవాబులలో చెయ్యరాని తప్పులు వుండేయి. ఒకొక్కసారి అడిగిన ప్రశ్నకు, వ్రాసినజవాబుకు సంబంధం వుండేదికాదు. అయినా అతనియెడల నా అభిమానంపోలేదు. అప్పుడప్పుడు అతనిమీద పైవిషయం మూలంగా కలిగిన జాలి అభిమానాన్ని ద్విగుణీకృతం చేసేది. మేమిద్దరం చాల తక్కువసార్లు మాట్లాడుకొనేవాళ్ళం; కనకారావుది అంతగా మాట్లాడే స్వభావంకాదు.

హోస్టలులో వున్న చాలమంది విద్యార్థులకు కనకారావు వచ్చిన కొద్దికాలంలోనే లోకువ అయ్యాడు. దీనికికారణం కనకారావు క్లాసులో ఆఖరివ్యక్తి అవటం ఒక్కటే కాదు. నిజంగా తక్కువమార్కులు వచ్చిన వాళ్లు నలుగురి ముందు 'షైన్' అవుతారు. కనకారావు ఎవ్వరితోనూ అంతగా మాట్లాడడు. అస్తమానూ తన పని తను చేసికొంటూ వుంటాడు. పలకరించినా ముక్తసరిగా జవాబు చెపుతాడు. అతను మాట్లాడితే ఏదో వింతధోరణిలో వుంటుంది. ఉద్దేశాలలో, ఆచరణలో తనలాగా లేనివానిని క్షమించటం కష్టం. తెలిసీ తెలియని వూహాల విద్యార్థులు తమ మనస్తత్వానికి అవగాహనగాని వ్యక్తిని క్షమించలేరు. అటువంటప్పుడు హోస్టలు కనకారావును నిర్దాక్షిణ్యంగా విమర్శించక ఎలావదిలివేస్తుంది? కనకారావు రోజుకొక గంటసేపు నలుగురితోనూ కలసి సినిమాలమీద, కాలేజీ లెక్చరర్లమీద, ఆడపిల్లలమీద ఘాటుగా మట్లాడివుంటే, అతను నలుగురి దృష్టిలోనూ తెలివయిన వాడికింద పరిగణింపబడేవాడు.

బహుశా ఆ రెండేళ్లు అతని జీవితం ఆ ధోరణిలో గడచివా బాగుండును—అప్పుడు ఈ ఘట్టం అంతా జ్ఞాపకం తెచ్చుకునే అవసరం వుండదు.

రెండవ సంవత్సరం హాఫ్ ఇయర్లీ పరీక్షలకు ఆశ్చర్యకరంగా కనకారావుకు చాల ఎక్కువ మార్కులు వచ్చాయి. ఎవరూ అతనికి అటువంటి మార్కులు వూహించలేదు. నేను యిది చూసి చాల సంతోషించాను. తరువాతగాని, ఈ సంఘటన అతని పతనానికి ఎలా దారి తీస్తుందో తెలియలేదు.

ఒకరోజు ప్రొద్దున నేను స్నానం చేసి గదిలోకి వస్తున్నాను. మేడ మెట్లు ఎక్కి గేలరీలో ప్రవేశించగానే అక్కడో పది మంది విద్యార్థులు బాతాఖానీ వెయ్యటం చూశాను.

నన్ను చూడగానే అందులో ఒకడు—కృష్ణమూర్తి—"మీకు డెబ్బయి మార్కులు కావాలా?" అన్నాడు. వెంటనే మిగతా విద్యార్థులంతా గొల్లుమని నవ్వారు. నాకు ఆ ప్రశ్నకు, నీళ్ళ విపరీతపు నవ్వుకు అర్థం తెలియలేదు.

"యిస్తారా?" అన్నాను.

"మార్గం చెపుతాం; మీరు తెచ్చుకోవాలి." అన్నాడు.

"చెప్పండి" అన్నాను నవ్వుతూ

"కాపీ చెయ్యండి" అక్కడున్న వాళ్ళంతా మరల గొల్లుమన్నారు. మొట్టమొదటలో దీని భావం ఏమిటో తెలియలేదు. తరువాత నాకు తెలిసినది:ఆ మాట్లాడడం ఆ నవ్వటం కనకారావును వుద్దేశించి జరిగినవి. నేను అటువంటి సంభాషణలో తెలియకుండా పాల్గొన్నందుకు ఎంతో విచారించాను. ఆ సంభాషణ కనకరావుకు తెలిస్తే ఎంత విచారిస్తాడో అని మనస్సు చివుక్కుమంది.

అతనిమీద ప్రచారం అంతటితో ఆగిపోతుం దనుకున్నాను. ఈ సంఘటన జరిగిన నాలుగు రోజుల తరువాత, పనివుండి ఫిజిక్స్ డిపార్టుమెంటుకు వెళ్లాను. ఫిజిక్స్ డిపార్టుమెంటు అంతా చాల నిశ్శబ్దంగావుంది. ప్రక్కనే క్లాసులు జరుగుతున్నాయి. ఆ నిశ్శబ్దాన్ని భంగపరచకుండా వరండాలో నుంచి వెళుతున్నాను. ప్రక్కనే క్లాసులో నుంచి ఈ మాటలు వినిపించాయి: "అడ్డదారులు గుండా మార్కులు తెచ్చుకోవటం అనుకున్నావా మిస్టర్ కనకారావు! కొంచమయినా ప్రాథమిక సూత్రాలు తెలియాలి." కిటికీలోనుంచి లోపలకు చాటుగా చూశాను. క్లాసు మధ్యలో కనకారావు బల్లమీద చేతులుఆనించి నిలబడి వున్నాడు. అతని మొహం కాంతి విహీనంగావుంది, బల్లకు ఆనించిన అతని వేళ్లు కంపిస్తున్నాయి. మాటాడుదామని నోరు తెరచాడు కాని పెదిమలు కూడ కంపిస్తున్నాయి.

నేను చప్పుడు చెయ్యకుండా వరండా దాటి వెళ్ళాను. కాలేజీ కమిటీ మెంబర్ల బంధుకోటికి అడ్డదారులు కలుగజేస్తూ బ్రతుకుతున్న లెక్చరర్‌కు ఎదుటివాని నిజాయితీ తెలుసుకోవటం కష్టం.

ఈ విషయం జరిగి అయిదురోజులయింది. కాలేజీ మధ్యాహ్నం విశ్రాంతికి అప్పుడే వదలి పెట్టారు. మెట్ల దగ్గర గొడవగాను తోపెడిగాను వుంది. ఆ గుంపులో నుంచి "హల్లో, మీ స్నేహితునికి అయిదు రూపాయిలు జుల్మానా పడిందండోయ్" అని కృష్ణమూర్తి గొంతుక వినిపించింది. ఆ మాటలు కనకారావును గురించి చెప్పినవని తెలుసు. అయినా తెచ్చిపెట్టుకొన్న నవ్వుతో "నా స్నేహితుడంటే? నాకు చాల మంది స్నేహితులు వున్నారు. మీరు కూడ నా స్నేహితులే కదా!" అన్నాను.

"తెలియనట్లు మాట్లాడకండి. కనకారావుకు అయిదు రూపాయిలు జుల్మానా" అన్నాడు కృష్ణమూర్తి. మెట్లు దిగటం పూర్తి అయింది, హోస్టలు వైపు నడుస్తున్నాం.

"ఆ లెక్చరర్ ఏమైనా ప్రిన్సిపాలుతో రిపోర్టు చేశాడా?" అన్నాను. నా గొంతుక నాకే కృత్రిమంగా, ఆవేశపూరితంగా వుం దనిపించింది.

"ఆ విషయం మీకెలా తెలుసు?" కృష్ణమూర్తి ప్రశ్నించాడు.

"లెక్చరర్ అతనిని కోప్పడుతూ వున్నప్పుడు నేను వరండాలోనుంచి వెళ్తున్నాను. తరువాత ఏమయిందో తెలియదు" అన్నాను ఆవేశాన్ని తగ్గించుకొంటూ.

"తరువాత ఏముంది. ఇతను 'నేను కాపీ చెయ్యలేదు' అన్నాడు. అప్పుడు లెక్చరర్ 'నేను కాపీవిషయం కాదు మాట్లాడుతున్నది—అడ్డదారుల విషయం మాట్లాడుతున్నాను' అన్నాడు. కనకారావు కొంచంసేపు ఆగి 'అయినా మీకు నామీద అనుమానం వుందనుకుంటాను. దయవుంచి అటువంటి అనుమానం విడిచిపెట్టమని ప్రార్థిస్తున్నాను' అన్నాడు. లెక్చరర్ 'అనుమానం విడిచిపెట్టటమో, దృఢపరచుకోవటమో ప్రిన్సిపాలుకు వదల దల్చుకున్నాను' అని జవాబుచెప్పాడు. తరువాత ప్రిన్సిపాలుకు రిపోర్టు యిచ్చాడట. యిది మొత్తం గ్రంథం" కృష్ణమూర్తి ముగించాడు.

"ఆ నిముషాన కనకారావు మొహం చూసి అతను కాపీచేశాడని మీరు అనుమానించగలరా?" అన్నమాటలు నాలిక చివరివరకు వచ్చాయి. కాని ఆమాటలు కృష్ణమూర్తిలో అనవలసినవి కాదని వూరుకొన్నాను. ఇంతలో హోస్టలు జేరాం.

ఆరోజు సాయంత్రం ప్రకృతి చాల

...ంది. చీకటులు మేఘాలలాగ ...టున్నాయి. కర్రమెట్లమీద మను...క్క దిగుతున్న చప్పుడు అవ్యక్తంగా ...ంది. హాస్టలు పాత ప్రక్కన అప్పుడే ...న దీపాలు ప్రకాశవంతంగా లేవు. ...కుడి నవ్వులాగా గాలి ఒక్కసారి ...కరంగావచ్చి ఆగిపోయింది. నాచుట్టూ రూపంలేనిభావం ఆవరించుకొంది. ...యింకా దీపం వెయ్యలేదు.

...ంతలో నాగది చప్పుడు అయింది. "...పలకు రండి" అన్నాను గోడదగ్గరకు ... స్విచ్ వేస్తూ. లోపలకు వచ్చినది కనకా...వు. అతని మొహం కొంతివిహీనంగా వుంది. "...ర్చోండి" అన్నాను. కనకారావు ఎదు...గా వున్న కుర్చీలో కూర్చున్నాడు. చాల ...పటివరకు మాట్లాడలేదు. ఆ నిశ్శబ్దం బాధా...రంగా పరిణమించింది. చివరకు అతను ...దో మాట్లాడాలనే ప్రయత్నంలో "బాగా ...దువుతున్నారా?" అన్నాడు.

"ఆఁ! వచ్చిన పనిఏమిటి?" అన్నాను ...శ్శబ్దం అంతమయినందుకు తేలికపడుతూ.

"ఏమీ లేదూ. ఊరికే వచ్చాను" అన్నాడు. కాని ఆ మాటల వెనుక ఏదో దాస్తున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది.

"చెప్పండి ఫరవాలేదు."

"ఆఁ ఏంలేదు" మరల అదేజవాబు. కొంచెంసేపు మాటలులేవు. "వస్తాను" అంటూ కనకారావు లేచాడు. నేను "ఓఁ" అన్నాను అతనుఎందుకువచ్చాడో వూహించలేక. అతను కొంతదూరం వెళ్లగానే "కనకారావుగారూ" అని పిలచాను కాని ఆ పిలుపు అతనికి వినిపించి వుండకపోవచ్చు. నేను తిరిగి పిలువలేదు కూడా.

మెస్సునుంచి తిరిగివస్తూ కనకారావు గదికి వెళ్ళాను "ఇందాక మీరు ఏదో చెప్పటానికి వచ్చారు" అన్నాను సూటిగా కుర్చీ లాగుకుంటూ.

"ఆఁ ఏంలేదు" అన్నాడు తెచ్చి పెట్టుకొన్న చిరునవ్వుతో.

"మీరు వేసిన జుల్మానాగురించి మాట్లాడుదామని వచ్చారా?"

కనకారావు కొంచంసేపు తటపటాయించాడు. చివరకు "అవును" అన్నాడు.

"మీరు వ్యాకుల పడకండి. నేను ప్రిన్సిపాలు దగ్గరకు వెళ్లి ఆ విషయం మాట్లాడుతాను"

"థాంక్స్"

నేను ప్రిన్సిపాలు దగ్గరకు ఎందుకు వెళ్లానని అతనితో చెప్పానో నాకే అవగాహన కాలేదు. ప్రిన్సిపాలు నా మాట వినడని నాకు నమ్మకంవుంది.

మరుసటిరోజు ప్రిన్సిపాలు యింటికి వెళ్లాను. చిన్న కాగితం మీద నాపేరు, చదువుతున్నక్లాసు వ్రాసి అక్కడున్న ప్యూనుకి యిచ్చాను. వెంటనే లోపలకు రమ్మనమని కబురు వచ్చింది. నేను లోపలకు వెళ్లేసరికి ప్రిన్సిపాలు పెద్ద కుర్చీలో కూర్చొని వార్తాపత్రిక చదువుతున్నాడు. కాలరులేని చొక్కా వేసికొని, మల్లెపువ్వుకన్న తెల్లటిలుంగీ కట్టుకున్నాడు. బట్టతల. బంగారపుఫ్రేము కళ్ళజోడులోనుంచి చాల తీక్షణంగా చూడగలడు. అతనిని చూడగానే విద్యార్థులు తడబడతారు. నవ్వినప్పుడు అతని మొహం చాల వికృతంగా తయారవుతుంది; దేవుడు అతనిని నవ్వటానికి సృష్టించలేదు.

నేను గదిలో ప్రవేశించగానే "ఆ కుర్చీలో కూర్చోవచ్చు" అన్నాడు ఇంగ్లీషులో.

నేను వెంటనే నాపని అయనతో చెప్పాను. "నా స్నేహితుడు కనకారావు విషయం మాట్లాడటానికి వచ్చాను. అతనిని నేను చాలకాలం నుండి ఎరుగుదును. అతను కాపీ చేసి వుండడని నా నమ్మకం. ఈ విషయం తిరిగి ఆలోచించండి"

"ఆలోచించే ఈపని చేశాము" ప్రిన్సిపాలు విసుగు కనపర్చాడు. విద్యార్థుల దగ్గర పులితోలు కప్పుకోవటం తెలుసు కాబట్టి మంచి ప్రిన్సిపాలు అని ఖ్యాతి గడించాడు.

"అతనిది చాల లేతహృదయం. ఈ జుల్మానా విషయం విని చాల కృంగిపోయాడు. మీరు గనక......"

"ఇరవై ఏళ్ల అనుభవాన్ని బట్టి నా వుద్దేశం విద్యార్థులందరివి లేత హృదయాలని మంచి హృదయాలని కూడా. అయినా ప్రిన్సిపాలు అన్నవాడు క్రమశిక్షణకోసం ఇటువంటి చర్య తీసికోవాలి," అంటూ ప్రిన్సిపాలు లేచాడు. నేను తిరిగి అభ్యర్థించేలోపుగా "సరే, నాకు టౌన్‌హాలులో పని వుంది. మనం ఎక్కువసేపు మాట్లాడలేనందుకు విచారిస్తున్నాను" అంటూ లోపలకు వెళ్ళాడు.

ఈ విషయం కనకారావుకు చెప్పటానికి జంకాను. నాకు ప్రిన్సిపాలుకు జరిగిన సంభాషణ అంతా ఒక కాగితంమీద వ్రాసి అతనికి పంపించాను.

తరువాత కొద్దిరోజులలో కనకారావులో విచిత్రమయిన మార్పు వచ్చినది. అతని దినచర్య తను కాపీచెయ్యలేదని ఇతరులను నమ్మించటానికి నిర్విరామకృషి. ప్రతిరోజూ ప్రొద్దుననుంచి అర్ధరాత్రివరకు హాస్టలులో ప్రతివాడి గదికి వెళ్లి చెప్పిన విషయాలే చెప్పుతూ వుండేవాడు. అతనిమాటలు వాళ్లు నమ్మలేదు. అతను చెప్పేనంతసేపు వాళ్ళు జాగ్రత్తగా విన్నట్లు నటించారు, కాని వెనుక ఫక్కున నవ్వారు.

కనకారావు తన నిర్దోషిత్వాన్ని చాటటానికి రోజుకొకవిధంగా వాదించేవాడు. తను కాపీచేస్తే ఎవరిదగ్గర చేసివుంటాడు? పరీక్షహాలులో తనచుట్టూ క్లాసుమేట్లు లేరు గదా! పోనీ కాగితాలమీద వ్రాసుకు వెళ్లాడా? అలాంటప్పుడు అన్ని ప్రశ్నలు చూసి వ్రాయటానికి మూడు గంటలకన్నా ఎక్కువకాలం పడుతుంది. కాని తనుమూడు గంటలలోనే అన్ని ప్రశ్నలకు జవాబులు వ్రాశాడుకదా!—ఇలా వుండేవి అతని వాదనలు. హాస్టలులో విద్యార్థులంతా యీ వాదనను సరదాగా వినేవారు. అతనిని పైకిమాత్రం ఉత్సాహపరచి లోలోపల నవ్వుకొనేవారు. అతనిని తెలివైన దొంగగా పరిగణించేవారు.

తరువాత మాఘమాసంలో ఒక చీకటి రాత్రి, తీవ్రమయిన జ్వరంలో తాను పరీక్షలలో కాపీచెయ్యలేదని కలవరిస్తూ మరణించాడు. చనిపోయేముందు—సిక్ రూములో అతనితోపాటు నేను వున్నాను—అతను కోరుకొన్నది పెట్టెలోవున్న అతని తల్లిదండ్రుల ఫోటోలు చూపించమని. ఆ ఫోటోలు అతనిబాధను అవగాహన చేసుకొన్నాయేమో. అతని నిజాయితీని నమ్మాయేమో.

* * *

ఇది కనకారావు విషాద గాథ.

నేను జరిగిపోయిన సంగతులు జ్ఞాపకం వచ్చి బాధపడటం గ్రహించాడు నరసింహం.

"కనకారావు మాట యెత్తగానే పాత సంగతులు జ్ఞాపకం వచ్చాయి కాబోసు. పొరపాటున కనకారావు విషయం వచ్చిందిలే. వెరీ సారీ" అన్నాడు నరసింహం.

"పాపం కనకారావుది చాల సెన్సిటివ్ హార్ట్ రా" అన్నాడు రామారావు.

నాకు కనకారావు విషయం వాళ్ళతో మాట్లాడటం ఇష్టంలేదు.

"నాకిప్పుడు నిద్ర వస్తోంది" అన్నాను వాళ్ళిద్దరూ సెలవు తీసుకుంటారేమోనని.

"నీకు నిద్ర రానిదెప్పుడుగాని, గుడ్ నైట్" అన్నాడు నరసింహం.

"డిట్టో" అన్నాడు రామారావు.

"గుడ్ నైట్" నిస్సత్తువగా అన్నాను. ★


మాంత్రికుడు
మాండ్రేక్
కల్పన, రచన:
....లీ ఫాక్, ఫిల్ డేవిస్....
అర్ధరాత్రి వేళ. ఆ శ్మశానంలో ....
1
2
గోరీలోని ఈ పెట్టె మోసుకొచ్చిన శాల్తీలేమిటో!..
ఇదేకాబోలు నార్దాచెప్పినగోరీ. మూత తెరుచుకుందంది.
4
5


తే....
మూత వచ్చేసింది..అరే!..దీన్నిండా డబ్బు! నోట్లు!!
3
స్పృహతప్పిన మాండ్రేక్ ఆ గోరీలోకి లాగివేయ
బడ్డాడు. మెల్లిగా గోరీకి మూతపడింది.
6
CONTINUED—

(ఇంకా ఉంది)

మంత్రాలు: నమ్మకాలు

★ విషసర్పాల్లో రెండురకాలు ★

"మంత్రాలు, నమ్మకాలు" శీర్షిక క్రింద కొద్ది వారాలనుంచి ప్రకటితమవుతున్న అభిప్రాయములను—ముఖ్యముగా పాముమంత్రములను గురించి—నేను చాలా కుతూహలముతోను కొద్దిగా శాస్త్ర దృష్టితోను అవగాహన చేసుకొంటూ ఉన్నాను. 2-1-57 తేదీ వారపత్రికలో శ్రీ జి. వాసుగారి అభిప్రాయం చూసి నాకు తెలిసినదానిని గురించి వ్రాయడానికి పూనుకొన్నాను.

శాస్త్రదృష్టితో చూస్తే పాము మంత్రాలను వట్టి నమ్మకాలుగానే చూడాలి. మన దేశంలో విషసర్పాలు ఆరో, ఏడో రకాలు ఉన్నాయి. వీటియొక్క విషాలు ముఖ్యంగా రెండురకాలు. పెద్దజాతి నాగుబాము, నాగుబాము, కట్లపాము న్యూరోటాక్సిన్ విషము కలవి. ఇది మానవుడి నరాలమీద, మెదడు మీద పనిచేసి అపాయం కలుగజేస్తుంది. ఇక రక్తపింజరి, ఎఖిస్ అనే పొడ పాము హిమోటాక్సిన్ విషముకలవి. ఇది రక్తనాళాలమీద, రక్తంమీద తీవ్రంగా పనిచేస్తుంది. అనుభవజ్ఞులయిన మనవాళ్ళందరికీ వీటి తేడా తెలుస్తుంది. అయితే పాము మంత్రాల్లో ఈ రెండురకాల విషాలకి వేరువేరు మంత్రాలు వేస్తున్నట్లు నేను ఎప్పుడూ వినలేదు. ఇంజక్షన్లలో మాత్రం ఈ రెండు రకాల పాము కాట్లకి రెండురకాల ఏంటివెనమ్ ఇంజక్షన్లు ఉన్నాయి. ఒకదానికి ఇంకొకటి పనిచేయదు. దీనినిబట్టి మంత్రాలను ఉత్తినమ్మకాలుగానే చూడవలసివస్తుంది.

విషసర్పాలు ఇండియాలోనే కాక అనేక దేశాల్లో ఉన్నాయి. శాస్త్రజ్ఞానాభివృద్ధి చెందిన ఏ దేశంలోను ఈ మంత్రాల మీద నమ్మకము లేకపోవడమే కాక, అటువంటివి వుంటాయనికూడా తెలియదు. ఆ దేశాల్లో విషపుకాటు తిన్న తరువాత వెంటనే ఒక ఇంజక్షను తీసుకొంటారు; బ్రతుకుతారు. మంత్రాలు లేవని చనిపోవడం లేదు. అక్కడ చావులు చాలామట్టుకు తగ్గిపోయాయి. మంత్రాలవల్ల మనదేశంలోనూ బ్రతుకుతున్నారని మనవారు అనుకోవచ్చు. కాని దినానికి సగటున 70-75 మంది మనదేశంలో పాముకాట్లవల్ల మరణిస్తున్నారు.

కొద్ది నెలల క్రితం వార్తలలో చూసే వుంటారు, జర్మనీలోని ఒక జంతుప్రదర్శనశాలలో పాములను గురించి విపులంగా తెలిసిన ఒక శాస్త్రజ్ఞుడు మరణించాడు. అతనికి అంతకుపూర్వం పాములు ఎన్నోసార్లు కాటు వేశాయట. కాని వెంటనే ఇంజక్షను తీసుకొనేవాడు. ఆరోజు ప్రమాదవశాత్తు ఒక నాగు కాటు వేసిందట. ఏమీ గాభరా పడకుండా కట్టుతో యింటికి వస్తే, ఆ ప్రత్యేక నాగుబాముకు సరిపడే ఇంజక్షను (Antivenom of Coidra) దురదృష్టవశాత్తు లేదు. అప్పుడే విషపుకాటు లక్షణాలు క్రమంగా వస్తున్నాయి. ఆప్రక్కనే వున్న పట్టణంలోనుంచి ఫోనులో చెప్పి కారులో తెప్పించినా, తొందరలో ఇంటి దగ్గరే ఆ ఇంజక్షనుట్యూబు పగిలిపోయింది. తరువాత అతను ఈ దురదృష్ట సంఘటనవల్ల చనిపోయాడు. ఎన్నిసార్లో కాటుతిన్నా, ఇంజక్షను తీసుకోవడంవల్ల బ్రతికి, చివరకు అది లేకనే చనిపోయాడు. మంత్రం సంగతి అతనికి తెలియనే తెలియదు.

నమ్మకాలు కూడా ఒక విధంగా కొన్ని రకాల మానవుల మీద సైకలాజికల్‌గా పనిచేస్తాయి. శరీరంలో ఏ లోపము లేకపోయినా, ఉన్నదనుకొని బెంగతో నీరసించిన వారు చాలా మంది ఉన్నారు. లోపం ఉన్నా ధైర్యంతో నిలద్రొక్కుకున్నవారు ఉన్నారు. కాటు విషసర్పానిది కానప్పుడయితే మంత్రం వేస్తే-అతని శరీరంలో నిజంగా విషం లేదు కాబట్టి—ధైర్యంతో అతడు లేవడంలో ఆశ్చర్యం ఏమీ లేదు. అయితే కాటు విషసర్పానిదయితే ఎంత మంత్రం వేసినా చనిపోవడం తథ్యం. ఏ కొద్ది సందర్భాల్లోనో బ్రతకవచ్చునుకాని దీనికి అనేక శాస్త్రీయమైన కారణాలుకూడా ఉంటాయి.

విషసర్ప దష్టుడు మంత్రాలకే నిజంగా బ్రతికితే అంతకన్న ఏముంది? బ్రతకడమే అంటూ జరిగితే శరీరంలోనికి ప్రవేశించిన విషం విరుగుడు అయిఉండాలి. అంటే ఏంటివెనమ్ ఇంజక్షనువల్ల జరిగే పనే జరిగి ఉండాలి. ఈ సందర్భంలో నిరూపణకి మానవుని ప్రాణంతో మనం ప్రయోగం చెయ్యలేము. రెండు కోతుల్ని తీసికొని నాగుబాము విషాన్ని సరియైన పరిమాణాల్లో వాటి రక్తప్రవాహాల్లోకి ప్రవేశపెట్టి ఒకదానిని మంచి మంత్రగానికి వప్పజెప్పి, రెండవ దాని శరీరంలోనికి ఏంటివెనమ్ ఇంజక్షను ఎక్కించి చూడాలి. ఈ ప్రయోగంలో మనకి సులభంగా వాటివాటి శక్తుల ప్రభావం తెలుస్తుంది. కోతి చాలా విషయాల్లో మానవుని పోలికలున్న జంతువు కావటంవల్ల ఈ ప్రయోగానికి అనువైనది. మంత్రాలు తెలిసినవారు, వానిమీద నమ్మకమున్నవారు శాస్త్ర రీత్యా వారి జ్ఞానాన్ని నిరూపించుకోవాలి. నిరూపణ ఉంటే కాని ఏది శాస్త్ర జ్ఞానమనిపించుకోదు. అది నమ్మకంగానే ఉంటుంది.

పాము కాటు తిన్నవాళ్లు మంత్రాలతో బ్రతకడం గురించి తెలియదు కాని, నాకు తెలిసిన ఒక సందర్భము వివరిస్తాను. కాశీవిశ్వవిద్యాలయంలో 6 సంవత్సరాల క్రిందట ఒక నాడు రాత్రి ఒక హాస్టలు విద్యార్థిని నిద్రలో ఒక కట్లపాము కాటు వేసింది. ఎన్నిగంటలకో సుమారుగా తెలియలేదు కాని, అతడు అలాగే నిద్రపోయినాడట. తెల్లవారు ఝామున బాధతో లేచి ప్రక్క విద్యార్థులకు చెప్పగా వారికి ఆగదిలోనే కట్లపాము కనుపించిందట. దృఢకాయుడు కావడం మూలాన్న నిలద్రొక్కుకొని ఉండగలిగి ఉంటాడు. కాని అప్పుడే చాల కాలమైపోవడం మూలాన్న విషం తన పని తాను చేసివేసింది. నిద్రమత్తో, మరి ఏమో 5,6 గంటలు అతను లేవనేలేదు. ఎవరికీ కాటు సంగతి తెలియదు. అప్పుడు మంత్రాలు, ఇంజక్షన్లు రెండూ అయినాయి. రెండూ పని చెయ్యలేదు. కాటు వెంటనే ఇంజక్షను తీసికొని ఉంటే బ్రతికి ఉండేవాడు. ఉదయమే అతను మరణించినాడు. ఇంతగా చెప్పడానికి కారణం, ఆలస్యంఅయితే ఇంజక్షను కూడా పని చేయలేదని.

తేలుకాటు పాముకాటుకన్న తీవ్రతలో చాలా తక్కువ. చనిపోయిన సందర్భాలు సాధారణంగా ఉండవు - పిల్లలయితే తప్ప. బాధ పడడం, గాభరాలు ఎక్కువ.

ఆడవారికంటె మగవారు చాలా తక్కువ బాధపడతారు. ఇది స్వభావాన్నిబట్టే ఉంటుంది. నాముట్టుకు నేను తేలుకాటు రెండు సార్లుతిన్నాను. మొదటిసారి ఏదోమందు వేసినారు. తెల్లవారేసరికి తగ్గింది. రెండోసారి చాలా తీవ్రంగా కుట్టినా ఏమీ మందు, మంత్రం లేకుండానే తెల్లారేసరికి బాధ తగ్గింది. రాత్రి బాధ ఉంది కాని గాభరా లేదు.

తేలువిషం కొన్ని గంటలు లేక ఒకరోజు పోయేక క్రమంగా తగ్గిపోతుంది. మంత్రాల మీద నమ్మకముంటే వేయించుకోవచ్చు. అయితే విషసర్పపువాత పడ్డప్పుడు మాత్రం ఇలా ఊరుకొంటే లాభంలేదు. అనేకమయిన ప్రాథమిక చికిత్సలు తీసికొని దగ్గరగా ఉన్న డిస్పెన్సరీలో ఏంటివెనమ్ ఇంజక్షను తీసికొంటే పాము కరచినవాడు బ్రతకడం తథ్యం. అయితే ఇది తొందరగా చేయాలి. నమ్మకముంటే ఇది అయిన తరువాత మంత్రం కూడా వేయించుకోవచ్చు. కాని ఇంజక్షను తీసికోకముందు మంత్రాల కోసమని కాలం వృధాచేయడం క్షేమము కాదు.

జె. కె. రావు (తిరుపతి)

* * *

భూతవైద్య ప్రభావం

1944 వ సంవత్సరం యేప్రిలు 11 వ తారీఖున నేను ఒక గ్రామము నుండి మా గ్రామమునకు నడిచి వచ్చుచున్నాను. ఆ గ్రామము రెండు మైళ్ళుంది. 1½ మైలు వచ్చాక నా కుడికాలు మోకాలు క్రింద కండె పట్టింది. కాసేపు కూర్చొని తిరిగి బయలుదేరాను. ఇంటికి చేరాను. ఆరోజు మొదలుకొని మూడు మాసములవరకు ½ మైలు నడిస్తే కండెపట్టేది. బాధ పడలేక వైద్యము చేయించుటకు పూనుకొన్నాను. ఒక ఆయుర్వేద వైద్యుడు వక పట్టు వేశాడు. ఆ పట్టుతో నడుముదగ్గరనుండి చివరి పాదమువరకు బాధ కలిగింది. మంచము పట్టాను. 4 మాసములు వైద్యముచేసి ఆ వైద్యుడు విసుగుచెంది వెళ్లిపోయాడు. దానంతట అదే 15 రోజులకు తగ్గింది. తిరిగి 4 మాసములకొక పర్యాయము ఆ బాధ వచ్చేది. వైద్యము చేస్తే యెక్కువ అయి 5 లేక 6 మాసములు వుండేది. వైద్యము చేయకపోతే వక నెల రోజులకు తగ్గేది. 1946 సం॥లో ఒంగోలు అమెరికన్ ఆస్పత్రిలో చేరాను. వారు జబ్బు లేదని నిర్ణయించారు. 1947 సం॥లో మద్రాసులో పేరు పొందిన గురుస్వామి మొదలియారుగారికి చూపాను. వారు వకమాసమురోజులు మం

(56-వ పేజీ చూడండి)

మొదటి పేచీ

ఎం. వి. జగన్నాధరావు

తెల్లతెల్ల వార్తోంది. కోడికూతలు ప్రభువుని మేలుకొలుపే వైతాళికుల్లాగ ప్రజానీకాన్ని నిద్రనుంచి లేపుతున్నాయి. తూర్పు దిక్కాంత మెడలో వున్న హారంలోని పతకంలాగ మెరుస్తోంది తూర్పున వేకువను పొడకట్టే వేగుజుక్క. రాత్రి సే పాముచేత కరవబడి మూర్ఛలో మునిగివున్న ప్రపంచాన్ని, పక్షిసంతతుల కూజితాలనే మంత్రాలతో మంత్రించి ఆ మూర్ఛలోనుంచి లేపడానికొచ్చే పాములవాడిలాగ సూర్యుడప్పుడప్పుడే ఉదయగిరి నధిష్ఠిస్తున్నాడు.

విద్యానగర రాజవీధిలో అలికిడి అధికం కాజొచ్చింది. బంగారపుటంబారీ ధరించిన రాచయేనుగు వీధివంట దర్జాగా సాగిపోతోంది. ముందర మావటీడు నడుస్తూ వుంటే వెనక నే ఆయేనుగు తొండం వయ్యారంగా ఆడింపుకుంటూ పోతోంది. ఏనుక్కి రెండు పక్కలా వేలాడే పెద్ద గంటలు 'టంగ్ - టంగ్' మని మోగుతూ కృష్ణరాయల బాహుప్రతాపాన్ని చాటుతున్నాయేమో అన్నట్టనిపిస్తున్నాయి. పిల్లలంతా గుమిగూడి ఏనుగుని చూస్తున్నారు సరదాగా గోలచేస్తూను. ఎవ రెంత గోలచేసినా మత్తగజం తనమార్గాన్ని తాను నడిచిపోతోంది బహు ఉదాత్తంగా; కుకవు లెంత గోల చేసినా లక్ష్యంచేయని సుకవి కవితా ధోరణిలాగ.

"రాఘవా! యెక్కడికీ యేనుగునిలా తీసుకుపోతున్నా" వన్నాడు తోవ నడిచే ఒక వ్యక్తి మావటివాడి నుద్దేశించి.

"పెద్దన్నగారి యింటికి బాబూ! ఆయన గురువుగారు యివ్వాళ ఆస్థానానికి దయచేస్తారట. ఆయనకోసమే యీ యేనుగు" అన్నాడు రాఘవుడు.

"ఏంటి విశేషం?"

"ఎవరో ఓ పెదకవి రెండు రోజులనించి మన అష్టదిగ్గజాలతో వాదిస్తున్నారట ఆయన్ని గెలిచేశక్తి వారికి లేకగాబోలు పెద్దన్నగారు వారిగురువు గారని తెప్పించేరు ఈరోజు ఆకొత్తాయనకి యీగురువుగారికి వాదం జరుగుతుందట."

"ఓహో! బహు రమ్యంగా వుంటుందైతే. ఈరోజు కోటలోకి వెళ్లి వారివాదం వినవలిసిందే. ఆయ నెవడో? మన అష్టదిగ్గజాలనే అల్లల్లాడించేడంటే మహా ఘటికుడన్నమాట."

"లేకపోతే పెద్దన్నగారి గురువుగారొస్తారా? బాబూ! రండి చూద్దురుగాని. ఈరోజు కొలువుకూటం కిటకిట లాడుతుం దనుకుంటున్నా రూరంతా. పెద్ద పెద్దవారంతా వస్తారట."

"భేష్! భేష్!! వెళ్లు మళ్లా వేళైపోతుంది" అని ఆవ్యక్తి తనపనిమీద తాను పోయేడు మావటి యేనుగుతో పెద్దన్నగారి యింటినిగూర్చి సాగిపోయేడు.

2

అప్పటికి సుమారు జాము పొద్దెక్కింది. రాయల కొల్వుకూటం కిటకిట లాడుతోంది. కవి పండిత గాయక ప్రభువులొక పక్కని, సామంత, మంత్రి, దండనాయకులొక తెన్నుని కూర్చున్నారు. విదేశ రాయబారులు వారికై నిర్ణయింపబడ్డ స్థలంలో ఆసనా లలంకరించేరు. రాయలసింహాసనానికిరుప్రక్కల రెండు రత్నపీఠా లమర్చబడి వున్నాయి. కుడిపక్క తిమ్మరుసు, యెడంపక్క ఆంధ్రకవితా పితామహుడు అల్లసాని పెద్దనగారు కూర్చున్నారు. పెద్దనగారి రత్నపీఠానికి కొంచెందూరంలో మరో రెండు ఆసనాలు వేయబడివున్నాయి. ఒక పీఠంమీద ప్రగడరాజ నరసరాజ కవీంద్రు లాసీనులైయున్నారు. మరోపీఠం పెద్దనగారి గురువుగారికై నిర్ణయింపబడి ఖాళీగా వున్నది. ఆయనింకా రాలేదు.

అంతలో ప్రతీహారివచ్చి ప్రభువుల రాక తెలియపర్చాడు. చప్పుడు గాకుండా అందరూ లేచి నిలబడ్డారు. రాయలు సభామందిరం ప్రవేశించగానే స్వస్తివాచకులు యీ కిందివిధంగా బిరుదావళులు ఉచ్చరించేరు

"జై శ్రీమత్ మహారాజాధిరాజ—రాజపరమేశ్వర- మూరురాయరగండ - అరిరాయ విభాడ - భాషిగెతప్పు వరాయరగండ - అష్టదిగ్గజ మనోభయంకర - పూర్వ, దక్షిణ, పశ్చిమ సముద్రాధీశ్వర - యవన రాజ్యస్థాపనాచార్య - గజపతి విభాడ - శ్రీ వీరప్రతాప - ఆంధ్రసామ్రాజ్య దిగ్జయ

> ఆ రాత్రి పిడుగుల ధమధమలతో వాన ప్రారంభమైంది. నిద్ర పోతున్న అబ్బాయి ఉలికిపడి లేచి "ఏమిటినాన్నా, ఇంతరాత్రప్పుడు రేడియో పెట్టావ్?" అన్నాడు కోపంగా.

స్తంభినాచార్య - శ్రీ శ్రీ శ్రీకృష్ణదేవరాయ సార్వభౌమా...బహుపరాక్, బహుపరాక్, బహుపరాక్" అని.

ముందు హెగ్గడికొండ్రు మార్గం చూపిస్తూవుండగా రాయలు గరుడాండ హారినీల మణిమయానేక రత్నసింహాసనాన్ని సమీపించి కూర్చుంటూ అందర్నీ కూర్చోమని చేసన్న నితెలియజేసేడు. సభికులంతా కూర్చున్నారు. ప్రభువులు మహామంత్రిని సాభిప్రాయంగా తిలకించేసరికి, విషయం గ్రహించిన పెద్దనగారు లేచి నిలిచి తమ గురువులింకా రాలేదని సవినయంగా మనవి చేసి కూర్చున్నారు.

అంతలోనే మదకరీంద్రం సభా భవనం ముందాగింది. పెద్దన గారు తక్కుంగల కవులు (అష్టదిగ్గజాలలోనివారు) బహుమాన పురస్సరంగా యెదురేగి తోడితెచ్చేరు పెద్దనగారి గురువుని. పెద్దన్నగారి గురువుగారు కొంచెం పొట్టిగా వుంటారు. చామనచాయ వర్ణం గలిగి, పెద్ద చెవులు, సామాన్యమైన కళ్లు ముక్కు గలిగివుంటారు. వారు సభలోకి రాగానే రాయలవారు సవినయంగా నమస్కరించేరు. కవి దిగ్దంతులైన పెద్దనగారి గురువర్యులు ప్రభువుల నాశీర్వదించేరు. గురువర్యులు తమకై నిర్ణయించబడ్డ ఆసనాన్నలంకరించ బోతూవుంటే, ప్రగడరాజు నరసరాజ కవీంద్రు డాయనను చూచి "అకారం హ్రస్వం" అన్నారు.

కూర్చో బోతూ వున్న పెద్దన్నగారి గురువు దిగ్గున లేచి "ఓరీ! నరసరాజా! నువ్వెంతో పెద్ద మహాకవీంద్రుడ వనుకున్నాను. మా పెద్దన్న నిన్నే గెలవలేక నన్ను పిలిపించేడా? నీపస వొక్క మాటలో తెలిసిపోయిందిరా. 'అ' కారం హ్రస్వమో దీర్ఘమో నీకు తెలియదటరా? పెద్దన్నా! నువ్విలాంటి వెర్రిబ్రహ్మకైపోయినా వేమిరా! (అ) కారం హ్రస్వమో దీర్ఘమో తెలియని వెర్రి వెంగళాయనే గెలువలేకపోయేవా! ఛీఛీ! నరసరాజా! తెలిసీ తెలియని వాగ్వివాదంతో రాయల దగ్గర వాగి బహుమానం పొందుదామనుకున్నావా? ఇప్పటికైనా నీ పొరపాటు గుర్తించుకుని సభ విడి వెళ్లిపో.

చ. తెలియని వన్ని తప్పులని,
దిట్టతనాన సభాంతరంబునన్
బలుకగ రాదు మోరి!
పలుమారు పిశాచపు పాడెగట్ట, నీ
పలికిన నోట దుమ్ముపడ,
భావ్య మెరుంగవు, పెద్దలైనవా
రల నిరసింతువా ప్రగడ
రాణ్ణరసా! విరసా!! తుసా!!! బుసా!!!

ఇలాంటి శుంఠతో నేను వాదించను సరిగదా విడి మొహమైనా నేను చూడను. ప్రభువులు నన్నేమనుకున్నా సరే ఒక్కక్షణమైనా యిక్కడ నిలబడను," అని తిరోహితుడవ బోయేడు పెద్దన్న గారి గురువు.

ప్రభువుల ముఖాన్ని చిరునవ్వు తాండవిస్తూ వుండగా "రామకృష్ణ కవీంద్రులు ఎంత విపరీతార్థం తీసేరు. వెళ్లడానికి వీల్లేదు. ఆగాలి" అన్నారు. పెద్దన్నగారి గురువు గతుక్కుమని ప్రభువులవంక చూస్తూ "రాయలవారు రామకృష్ణుడికిచ్చిన వరం జ్ఞాపకం తెచ్చుకోవాలి. రోజుకి నూరు తప్పులు కాస్తానని ప్రభువుల వాగ్దానం. ఇవ్వాళ ఇది మొదటిది" అని శిరం వంచి నిలబడాడు. సభ గొల్లుమని నవ్వేరు. తెనాలి రామలింగడేనంటే తెనాలి రామలింగడే నన్నారు. రాయలు చేసన్న సభలో కలకలం వారించి, "రామకృష్ణ కవీంద్రా! ఏం ముసలివేషం కట్టేరు. మీరు పోటిగా వున్నారనే వుద్దేశంతో నరసరాజ కవీంద్రులన్న వాక్యాన్ని ఆయనకే తిప్పికొట్టి బహు చమత్కారంగా వ్యవహరించేరు. అంచేత మీకు, పండితులైనందు కాయనకీ బహుమానాల నిస్తున్నాం" అని వారిద్దరిని తగువిధంగా బహూకరించి సభ చాలించేరు. "గొప్ప ముసలి వేషం కట్టేసు రామలింగ" డంటూ సభలో కరతాళధ్వనులు, రాయలవారికి జేజేలు మిన్నుముట్టేయి. రామలింగని తెలివితేటలు బహు విధాలుగా స్తుతించుకుంటూ సభికులు సభ విడిపోయేరు. ★

గ్రీకుపురాణ కథ:

భూదేవి

అరుణోదయ కాంతులు తూర్పు దిక్కున వెల్లివిరిశాయి. అప్పుడే తెలతెలవారుతూంది. పక్షుల కిలకిలా రవములతో ప్రకృతి ప్రతిధ్వనిస్తూంది. క్రిందటి దినమే పొలాలలో గింజలు చల్లారు. ఈ పొలాల మధ్య నుండి ఒక బంగారు రథము ఆ అరుణకాంతులలో తళతళ మెఱసిపోతూ తరలివెళ్తూంది. గింజలు చల్లిన పొలాల్లోనుంచి అలా రథం వెళ్తే, రథచక్ర భారానికి గింజలు మొలకెత్తుతాయా? బాగా పరికించి చూస్తే ఆ పొలం భూమికి అడుగు ఎత్తునే వెళ్ళిపోతూంది. భూమిని తాకడంలేదు.

ఆ బంగారు రథానికి కట్టిన నాలుగు గుఱ్ఱాలు శరవేగంతో పొలాలను దూసుకొని వెళ్లిపోతున్నాయి. రథంలో ఒక సుందరాంగి నిలుచుండి, తనచేతిలోనుండి దేనినో పొలాలలోనికి విసిరివేస్తూంది. ఒక చేతిలో కంకుల భారంతో వంగిపోతూన్న పైరుల కట్టలున్నాయి. ఆమె బంగారు వెంట్రుకలు పాదాలవఱకు జీరాడుతూ ఆమెకు ఒక వింత శోభను సమకూర్చుతున్నాయి. ధాన్యపు కంకులతో అల్లిన కిరీటము ఆమె శిరస్సుపై ఆ లేత సూర్యకిరణాలలో మెఱుస్తూంది. ఆమె రథమంతా పచ్చని ఆకుల తోరణాలతో, రంగురంగుల పూవులతో అలంకరించబడింది. ఈమె గ్రీకుల భూదేవి. సీరీస్.

ఈమె అత్యుదయాన్నే తన అంతఃపురాన్ని విడిచిపెట్టి, భూలోకంలో పంటలూ, ఫలాలూ, పుష్పాలూ విరివిగా పండించడంకోసరం తన రథంలో బయలుదేరుతుంది. పొలాలమధ్యగా వెళ్ళేటప్పుడు ఆ పొలాలన్నీ తన మహిమవలన విరివిగా పండేటట్లు ఆశీర్వదిస్తుంది. ఆమెరథం దాటి వెళ్లిన పొలాలన్నీ తామరతంపరగా పండుతాయి.

భూమినుండి పుట్టి ఫలించే అన్ని వృక్షాలకు, పైర్లకు, పుష్పాలకు ఈమే అధికారిణి. గ్రీకుల ఇష్టదేవతలలో ఈమె ఒకతె. తమ అనుదిన జీవితానికి కావలసిన ధాన్యమూ, కూరగాయలూ, మధుర ఫలములూ, పరిమళించే పుష్పాలు అన్నింటినీ ప్రసాదించే ఈ భూదేవిని గ్రీకులు అత్యంత శ్రద్ధాభక్తులతో పూజచేస్తారు. విత్తనము భూమిలో వేసినది మొదలు, అది మొలకెత్తి, పెరిగి, తన మధుర ఫలాలను మానవకోటికి అందించేవఱకూ దానిని సంరక్షించి, కాపాడేది, ఈమెయే! తమ దేశంలో సస్యసంపదకు కారణభూతురాలని ఈమె గ్రీకులవలన అనేక మన్ననలనందుకొంటుంది.

కరుణామయి అయిన భూదేవికి "ప్రోసర్పినా" అనే ఒకే ఒక్క ముద్దుల పుత్రిక ఉంది. భూదేవికి తన బిడ్డపై అపారమైన ప్రేమ. ఎంతో గారాబంగా పెంచింది. ఈ బిడ్డ శిశువుగా వుండేటప్పుడు తన అనుదిన ప్రయాణాలల్లో తనవెంట ఆమెను తీసుకొని వెళ్ళేది. కొన్నిసార్లు భూదేవి చాల దూర ప్రయాణము చేయవలసివచ్చేది. అప్పుడు బిడ్డను తనతో తీసికొని వెళ్ళడానికి వీలులేక పోయేది. అటువంటి సమయాల్లో భూదేవి తనబిడ్డను వదలలేక, వదలలేక విడిచి వెళ్లేది. తల్లీ బిడ్డ లిద్దరూ చాల ఏడ్చేవారు. మరి, భూదేవి వెళ్లకపోతే భూలోకంలో పంటలు ఎలా పండుతాయి? వెళ్ళక తప్పదు. చిట్టచివరకు ఎలాగో ధైర్యము చేసికొని వెళ్ళిపోయేది.

ఇలా కొంతకాలము గడిచింది. ప్రోసర్పినా పెరిగి పెద్దదయింది. ఇప్పుడామెలో యౌవనం తొంగి చూస్తూంది. తల్లిని మించిన సౌందర్యమూర్తి అయింది. తల్లి ఉదయాన్నే వెళ్లేటప్పుడు ఇద్దరూ ఎంతో దుఃఖించేవారు. చివరకు బిడ్డ కండ్లు తుడుచుకొని "త్వరగా వెళ్ళిరావే, అమ్మా. నీవు వచ్చేంతవరకూ నేను మనపొలంలో నుంచి నీ కొరకే చూస్తుంటాను. నాకేమీ భయంలేదులే. వెళ్ళిరా!" అని లేనిపోని చిరునవ్వు తెచ్చుకొని తల్లిని సాగనంపేది. కొన్నిసార్లు భూదేవి అందాల భరిణె అయిన తన బిడ్డకు ఏదైనా అపాయం కలుగుతుందేమోనని ఒక గుహలోపెట్టి తాళంవేసి వెళ్ళేది. ప్రోసర్పినాకు అలా గుహలో పడిఉండడం ఇష్టములేదు. "జాగ్రత్తగా ఆడుకొంటానే అమ్మా. నన్ను గుహలో ఒంటరిగా విడిచిపెట్టకే." అని బ్రతిమాలుకొనేది. అప్పటినుంచి ప్రోసర్పినా ఇతర దేవతాబాలలతో ఆడుకోడానికి వెళ్ళేది.

ఒకసారి భూదేవి చాల దూరప్రయాణము చేయాల్సి వచ్చింది. ఎక్కడో దూర దేశంలో పంటలు సరిగ్గా పండలేదట. అక్కడకు తక్షణమే వెళ్ళాలి.

"అమ్మాయీ! నేను లేని సమయములలో పొలాల్లో ఒంటరిగా తిరుగకు. నేను వచ్చేటంతవఱకూ జాగ్రత్తగా ఉంటావుకదూ!"

అని అనేకసార్లు హెచ్చరించి, మరీ రథం ఎక్కింది. "నాకేమీ భయంలేదే, అమ్మా! అంతట్లోకి సాయంకాల మౌతుంది, నీవూ వచేస్తావు"

అని బిడ్డ చెప్తూన్నమాటలు వింటూ భూదేవి తన రథముమీద వెళ్లిపోయింది.

అప్పటికే దేవతాబాల లంతా పొలాల్లో తిరుగుతూ ఆడుకొంటున్నారు. ప్రోసర్పినా కూడ పరుగెత్తుకొంటూ వెళ్లి వాళ్లను కలిసికొంది. అందరూ కలిసి పొలాల్లో పువ్వులు కోయడానికి మొదలుపెట్టారు. చక్కచక్కని పువ్వులు కోసుకొంటూ ప్రోసర్పినా చాలదూరం వెళ్లింది. తలఎత్తి చూచేటప్పటికి ఎవ్వరూ కన్పించలేదు. "పొలాల్లో ఒంటరిగా తిరుగకమ్మా!" అని తల్లి చెప్పిన మాటలు జ్ఞాపకానికివచ్చి, వెనుకకు మరలింది.

అంతట్లో ఆమెదృష్టి ప్రక్కనే ఉన్న ఒక వింతపుష్పము మీద పడింది. ఇందాక కన్పించలేదుసుమా! దానిలో ఎన్నో రేకలున్నాయి. పరిమళం వెదజల్లుతూంది. తనను ఆహ్వానిస్తూన్నట్లు తల ఊపుతూంది. "ఈ ఒక్కపువ్వూ కోసికొని వెళ్దామంటూ దగ్గరకు వెళ్ళింది."

ఆ సన్నని కాడ తుంపింది. ఊహుఁ... తెగలేదు. మళ్లా ప్రయత్నించింది. లాభంలేకపోయింది. చెట్టునే గట్టిగా లాగింది. పువ్వులోపాటు ఆ చెట్టే వ్రేళ్ళతో వచ్చేసింది. ఆ చెట్టు ఉన్నచోట ఒక రంధ్రము కన్పించింది. అది అంతకంతకూ పెద్దదైంది. ప్రోసర్పినా ఆశ్చర్యంతో ఆరంధ్రమువైపు చూస్తూ, నిలుచుంది. ఆ రంధ్రము ఒక సొరంగము అయినది. ఆ సొరంగంలోనుంచి నల్లని గుఱ్ఱాలు పూనిన ఒక బంగారురథం బైటకు వచ్చింది. దానిలోనుంచీ ఒక నవయౌవన సుందరుడు క్రిందకు దూకాడు. అతడు ధరించిన వస్త్రాలు నల్లనివి. కాని అతడు ఒక దేవతామూర్తిలా ప్రజ్వరిల్లిపోతున్నాడు. అతడు ప్రోసర్పినాను ఎత్తి, తీసికునివెళ్లి తన రథంలో కూర్చుండబెట్టుకున్నాడు. శరవేగంతో ఆ రథం, ఆ సొరంగములోనుంచి పాతాళలోకానికి వెళ్ళిపోయింది.

సాయంకాలము భూదేవి ఇంటికి తిరిగి వచ్చింది. తనను ఎదుర్కోడానికి పరుగెత్తుకొని వచ్చే బిడ్డ కనిపించలేదు. అది ఆమెకు అశుభసూచకముగా కన్పించింది. త్వరత్వరగా ఇంటిలోకి వెళ్ళింది.

(48-వ పేజీ చూడండి)

వనితా లోకం

మంచీచెడ్డా:

అనారోగ్యం కూడా నాగరికతే!

రచన: బొప్పన గంగాభవాని
(కనుమూరు)

ఈ రోజుల్లో నాగరీకుల మనుకునే వారి ఇళ్ళకు వెళ్ళి "కులాసాగా ఉన్నారా" అని అడిగితే అబ్బే! ఏం కులాసాలెండి, కొంచెం పనిచేస్తే చాలు గుండెదడ, నడుమునొప్పి వస్తాయండీ. వంట చేద్దామని పొయ్యి దగ్గరకు వెళ్ళితే కళ్ళవెంట వకటేనీళ్లు. అందుకనే వంట మనిషిని పెట్టుకున్నాము. ఏవో టానిక్కు పుచ్చుకుంటున్నాను" అని గ్రుక్క త్రిప్పుకోకుండా సమాధానం చెప్తారు. వారివయస్సు 20 సంవత్సరాలైనా ఉండవుగాని! ఏక బిగిన ఈ జబ్బులు తేలికగా చెప్పగలరు. అదోరకం ఫాషన్.

మా బంధువులలో ఒకరు పిల్లను చూడటానికి వెళ్ళి ఆపిల్ల చేతులు పని వల్ల మోటు తేలినవని, నాజూకుగా లేవని అంచేత ఆపిల్ల తమ కోడలు కొతగదని — తీర్మానించారు. పాపం! మొగవాళ్ళు ఏం చేస్తారు! అత్తకు నచ్చని కోడలిని తెస్తే సంసారం వీధిని పడుతుందనీ ఊరుకున్నారు.

"ఏమి ఆడవాళ్ళురా బాబూ! ఎంత షావుకార్లైనా మొగరాయుళ్ళలా, పొలం వెళ్ళి గడ్డి కోసుకొస్తారు" అని వెనుకబడిన జిల్లాలను సందర్శించ పోయినపుడు ముందు పడిన, జిల్లాలవారు అనడం వినేఉంటారు.

నేను ఒకసారి బంధువులఇంటికి వెళ్ళి నప్పుడు, వంటింట్లో పనిచేసే ముసలమ్మగారిని చూసి "ఎవరండీ ఆవిడ" అని అడిగితే "మా వంటమనిషి" అని తడుముకోకుండా సమాధానం చెప్పేసింది ఆ ఇల్లాలు.

ఈ మాటవిని, ఆ ముసలమ్మగారు ఉగ్రురాలై ఉన్న సత్యాన్ని బయటపెట్టి, ఆ ఇల్లాలుగారిని దులిపివేసింది. ఇంతకూ ఆవిడ గారు ప్రక్కింటివారు. పండుగరోజుగదా అని, ఈవిడ కోరితే సహాయం చేయటానికి వచ్చారు.

ఇంతకూ నేను చెప్పే దేమిటంటే ఈనాడు చాలామంది స్త్రీలలో, (ముఖ్యంగా నాగరికత తమసొత్తు అనుకునేవారు) పని చేస్తే పరువు తక్కువని, కుర్చీలో కూర్చొని, రేడియావింటూ, ఏమీ తోచక, టేబుల్ క్లాత్ మీద కుట్టినపూలే విప్పి కుట్టుటయే నాగరికత అనీ అనుకుంటున్నారు.

ఈ False Prestige వల్ల మధ్య తరగతి సంసారాలలో ఎన్ని ఒడుదుడుకులు వచ్చునో చెప్పకుండానే విజ్ఞులు వూహించుకోగలరు.

చిన్నప్పుడు చదువుకున్న కథ ఒకటి గుర్తుకు వస్తే వ్రాస్తున్నాను. అది బహుశా, మీ అందరికీ తెలిసివుండవచ్చు. ఒకాయన ఉదరం పెంచుకొని అనారోగ్యంతో వైద్యుని దగ్గరకు వెళితే, రోజూ ఉదయం రెండు మైళ్లు నడిచి ఆకులమీద రాలే మంచు బిందువులు జొన్ను తాగితే జబ్బు తగ్గుతుందని సలహా ఇచ్చారట. ఆయనగారు అలా చేయగా రోగం ఉపశమించిందట! శ్రమ ఫలితమో, హిమబిందు ఫలితమో నేను చెప్పనక్కరలేదు.

సుఖాలు పొందాలంటే ఆరోగ్యంగా లేకపోతే ఎలా? ఈ శ్రమ పడనిదే ఆరోగ్యంగా ఎలా ఉండగలము?

స్త్రీ శక్తి వంతురాలు కాకపోతే బిడ్డలు బలహీనులవుతారు. నేటి బాలబాలికలే రేపటి పౌరులు. దేశం భవిష్యత్తు వాళ్ల మీద ఆధారపడి ఉంది. మనకోసం కాకపోయినా, మనపిల్లల కోసం, మనదేశం కోసం; మనం శ్రమించి, బలవంతులుగా, ఆరోగ్యవంతులుగా ఉండాలి. ★



అలంకరణాలో పాత కొత్తలు

మోచర్ల రామాయమ్మ

[మద్రాసు]

పూర్వం హిందూదేశపు అలంకరణకూడా, విద్యా, విజ్ఞానముల వలెనే ప్రపంచ ప్రజలందరినీ దిగ్భ్రాంతులను చేసేది. అజంతా, ఎల్లోరా, శిల్ప సుందరులను దర్శించినప్పుడు పూర్వుల ఆభరణాలనూ, వాటి అలంకరణ విధానములనూ శాశ్వతముగా ఈ ప్రపంచకంలో నిలపగలగడమే ఆ శిల్పుల ఆశయమేమో అనిపిస్తుంది. కాళిదాసు మొదలైన ప్రసిద్ధ కవుల కావ్యాలను, పురాణాలనూ, చదివినా పూర్వాలంకరణ విధానం చక్కగా తెలియగలదు.

పేదలవద్దనుండి రాజులదాకా అందరి అలంకరణలోనూ నగలే ప్రముఖస్థానము నలంకరించినవి అనడానికి, "నాలుగూ పెట్టుకుంటే అమ్మక్క, లేకపోతే తిమ్మక్క" అనే సామెత చాలు.

పూర్వపురుషులు ఎంతభాగ్యవంతులైతే స్త్రీలు అంత విలువైన నగలు ధరించేవారు. ఆ కాలంలో ఒక్కొక్క శరీర భాగానికి రకరకాలైనవి, ఏభాగానికి ఆభాగానికి ప్రత్యేకంగాను ఒక విశిష్టమైనపద్ధతి నగలు ఉండేవి. భాగ్యాన్నిబట్టి నగలలో వేసే మణిమాణిక్యాల విలువా, తూకమూ మారినా, చేసే పద్ధతి, శిల్పం, ధరించే పద్ధతీ మాత్రం కులాన్నిబట్టి, వృత్తి ధర్మాన్నిబట్టి ఒకే తెగ వారందరిపీ ఒకే రీతిగా ఉండేవి.

శిరోభూషణాలు

పాపిడిపిందిరీలు, సూర్యుడూ చంద్రుడూ, రావిరేకు, మొగలిరేకు, రాగిడీ, నాగరం మొదలుగాగల నగలు కాక, బాలికలకు 20 ఏళ్ళదాకా జడకుప్పెలూ బంగారు జడా వేసేవారు. సీమంత మప్పుడు చూలింతరాలికీ, పెండ్లికూతురికీ (తమదగ్గర లేకపోతే ఎవరిదగ్గరేనా ఎరువు తెచ్చైనా) ఇప్పుడు మనం సినిమాలలో చూచే రాజకుమార్తె పెళ్ళికూతురు అలంకరణలా ముస్తాబు చేసేవారుట.

ఎంత సామాన్యులైనా కొప్పుమీద చామంతిపువ్వు, నెత్తిన రాగిడీ తప్పక ఉండేది.

ఒక "60" ఏళ్ళక్రితం ఒక్క రాగిడీ, ఓ చామంతిపువ్వూ పెట్టుకోడమల్లా జడ లేసుకొని, గుండ్రని సిగ లేక కొండిసిగా వేసుకోడంగా మారిపోయి 40ఏళ్ళక్రితానికే చిన్నపిల్లల జడలలోకి రిబ్బన్లూ పెద్దలకి సూదులు ఉపయోగించే గుండ్రసిగా, బర్మాముడీ మొదలైన సిగలూ వచ్చాయి. ఓ ముప్ఫయి ఏళ్ళక్రితానికి వాలు జడలు వనితలందరికీ సామాన్యమైపోయెయి. పైకి దువ్వి పక్క పాపిడి తీసి వదులుగా జడవేసుకొని చివర ఏమీ లేకుండా వదిలెయ్యడమో సగంలో రిబ్బను కట్టడమో 30, 35 ఏళ్ళ వాళ్ళకి కూడా సర్వసాధారణమైపోయింది. అప్పుడే చిన్నపిల్లలకి రెండుజడలు వెయ్యడంతో ప్రారంభమై ఓ పదేళ్ళక్రితానికి 40 సం॥ లోపులో ఏవయసువాళ్ళయినా రెండు జడలు వేసుకోడంలోకి దిగింది...తరువాత 10, 15 ఏళ్ళ క్రితం మొదట రంగురంగుల పట్టు కుచ్చులతో ప్రారంభంఅయి, మళ్ళీ 5,6 సం॥ క్రితం పూర్వపుబంగారు జడకుప్పెలు వాడుకలోకి వచ్చాయి. ఇప్పుడు ఏ వాలుజడని చూచినా అవే. 10, 15 ఏళ్ళక్రితం మొదలై మళ్ళా యువతులందరికీ రకరకాల సిగలు ఫాషన్‌అయి కూర్చున్నాయి. దానితోపాటే మధ్యకాలంలో ఒక 50 సం॥లు మాయమైపోయిన శిరోభూషణాలు నగలు కొన్ని విరివిగా వాడుకలోనికి వచ్చాయి. భరతనాట్యం డ్రస్సుగా పిల్లలకికూడా పాపిడిపిందిరీలు మొదలు అన్నినగల్నూ పెడుతున్నారు.



కర్ణాలంకారాలు


చెవులకు అతి ప్రాచీనకాలంలో కుండనాలు ఉండేవిట. కాని 100 సం॥ క్రితానికి మాత్రం చెవుతమ్మికి దగ్గరగా అంటివున్నట్లు

పెద్దపెద్ద జూకాలూ, కరిణిపువ్వులూ ఉండే విట. ఆ పువ్వులకి ఒకరింగు చెవుపైన జుట్టుకి తగిలించేలా కొక్కెంతో చెంపసరాలని, రాళ్ళతోనూ, ముత్యాలతోనూ, లేకపోతే ఉత్తిబంగారుతోనూ చేసినగొలుసు లుండేవి. చెవు పైకొనకి బావిలీలు, (పచ్చలతోటీ, కెంపులతోటీ, ముత్యాలతోటీ చేసినవి.) చిన్నచిన్న ముత్యాల బొగడలూ తమ్మె మొదలు పైనకొనదాకా ఐదారు రకాల ఆభరణాలు ఉండేవి ఈలాగే నత్తూ, బేసరీ రెండుముక్కులకీ చెరోటీ మధ్యముక్కుకి అడ్డబాసలేక బులాకీ వుండేవి 40 ఏళ్ళ క్రితానికే యువతులు పెద్దపెద్ద పొడుగైన లోలక్కులు భుజాలకి తగిలేలా పెట్టుకొనే వారు. అవే 2 సం॥ క్రితం పొడుగైన గొలుసుతోపాటు వాడుకలోకి వచ్చిన జూకాలు. మళ్ళీ ఇప్పుడు పూర్వంవలె పొట్టిజూకాలూ, కరిణిపూవులన బోలు పెద్ద పెద్ద దుద్దులూ వాడుకలోనికి వచ్చాయి. అక్కడక్కడ పిల్లలకు చంపసరాలుకూడా పెట్టుతున్నారు.

కంఠాభరణాలు

మెడలో కంటె కాసులపేరు సర్వసామాన్యమైన బరువునగలు వరహాలపేరు, పలకసరులూ, చంద్రహారం, మొహిరీల పేరులూ చాలా బరువైన నగలు /

గజ్జలపట్టెడ, కంఠపువ్వులూ, అక్షింతల పువ్వులూ చిన్నచిన్న ముక్కలుగానూ చక్కనిశిల్పం కలిగి సున్నితంగానూ ఉంటాయి మూడూకూడాపట్టునికట్టి మెడలో వేసుకునేవి ఇవి చక్కగా మెడనంటి ఉండేనగలు. ఇలాటివే తేలికగా వచ్చేవి అందరూ ఒక్కటేనా సామాన్యంగా కలిగిఉండేవి తీగనాను, జిగినీగొలుసూను పై వాటిమాట ఎలాఉన్నా నల్లపూసల కుత్తికంటూ పుస్తెలనాను అందరూ మాంగళ్య చిహ్నాలుగా ధరించేవి. నల్లపూసల కుత్తికంటులో బంగారు పాలకాయలూ పలక సరిపూసలూ, ఇంకా ఆనవాయితీకలవారికి పొగడాలు, వాటికి బంగారు ఉట్లూకూడా ఉండేవి ఓ నలభై సం॥ల క్రితానికే బంగారంవెల హెచ్చడం వల్లనైతే నేమి పాశ్చాత్య నాగరకతా ప్రభావమైతే నేమి, బరువునగలు అన్నీ ఉన్నవారికికూడా మోటు అయిపోయి, ఒకట రెండుపేటల గొలుసుతప్ప ఏమీ ధరించేవారు కాదు, నల్లపూసలుకూడా మోటు అయిపోయాయి పురాతనపు నగలన్నీ సున్నితమైనవికూడా ఒక 40 సంవత్సరాలు మాయమైపోయాయి మళ్లీ ఒ పది సం॥ క్రితంనుండీ నల్లపూసలు, గజ్జలపట్టెడా మొదలైన నగలు నవనాగరికులకి కూడా ఎన్నదగిన ఆభరణాలు అయిపోయాయి. ఇప్పుడు పెండ్లికాని వారుకూడా నల్లపూసలు ధరించడం ఫేషనైపోయింది.



సుమసుందరి

—ఫొటో. ఎస్. కె. విరల్

హస్తాలంకారములు


100 సం॥లు క్రితందాకా స్త్రీలకి జబ్బలకి పెట్టుకొనే ఆభరణాలు అయిదారు రకాలవి ఉండేవి. గట్టివంకీలు, అల్లిక వంకీలు, కట్టు వంకీలు, అనేవి బంగారుతో జబ్బకి సరిపోయేలా చేసేవారు. తావేదులు, రెండు మూడు రకాల బాజబందులూ, చిన్న చిన్న భాగాలుగా ఉన్నవాటిని గజ్జలపట్టెడలాగే పట్టుతో కట్టించి జబ్బలికి కట్టుకొనేవారు

ఒక అరవై ఏళ్ళ క్రితానికే ఈ నగలు అన్నీ ఉన్నవారూ, చేయించేవారూ అరుదు అయిపోయారు. వంకీలుమాత్రం ఏదో ఒక రకం ఉండేవి. 30, 40 సం॥ క్రితానికే జబ్బలకి ఆభరణాలు పద్ధతి మోటు అయిపోయి అంతా మానేశారు ఇప్పుడుకూడా ఎక్కడో బాగా పెద్దకాలం 80, 60 ఏళ్ళ ముత్తైదువలదగ్గరా, లేకపోతే ఏ భరత నాట్యంచేసేవారిదగ్గరో తప్ప ఈ ఆభరణాలు కనబడవు

ఇక ముంజేతికి అంటే మణికట్టు దగ్గర ఉండే జతలు ఒక్కొక్కరికి మోజేతుల దాకా ఉండేవిట అల్లికతోడాలు, పలకల మురుగులూ, బిళ్ళోరీగాజులూ, రంగూన్ పలకలగాజులూ, గొళ్ళెపుగొలుసులూ (ఉయ్యాల గొలుసులమాదిరివి) ఇవి సాధారణంగా అందరికీ ఉండేవిట


ఈకాలంలో అందరికీ వైర్ కట్టింగు గాజులు ఒకఫాషన్ అయిపోయాయి ఇది వరకు కంకణాలలా వెడల్పుగా ఉండేలాటి గాజులు ఒక 10, 15 ఏళ్ళ క్రితం బాగా వాడుకలోకి వుండేవి 30 ఏళ్ళ క్రితం ఎంత సన్నంగా ఎన్ని తక్కువ బంగారుగాజులు వేసుకొంటే అంతఫేషను, నవనాగరికతగా పరిగణించేవారు కాని మళ్ళీ 5, 6 సం॥ల నుండీ ఎన్ని ఎక్కువజతలు చేతికి ఉంటే అంతఫేషన్ అయిపోయినది

మన పోచీలకి విక్ఫతే బ్రేస్‌లెట్స్ అని



ముగ్గులు

జియం శ్యామల
యెమ్మిగనూరు



మేకా అహల్య
పిఠాపురం

★ అలంకరణలో పాతకొత్తలు ★

ఇంగ్లీషులో అనే నగలేమో? అవికూడా ఇప్పుడు వాడుకలోనికి వచ్చాయి.

ఇప్పుడిప్పుడే కంకణాలు కూడా ఉపయోగంలోనికి వస్తున్నాయి. ఉంగరాలు మాత్రం అట్టే మార్పు చెందలేదు అనిపిస్తుంది, పైనగలన్నిటిలో మార్పులతో పోల్చినప్పుడు. కాని అందరూ ఒకటి రెండు ఉంగరాలే పెట్టుకొంటున్నారు. పూర్వం కొందరు 10 వేళ్లకీ కూడా పెట్టుకొనేవారు. ప్రధానపు ఉంగరంఅనేది అంచె ఆకారంగా ఉండి సాధారణంగా వధువుకి, పెండ్లి నిశ్చయమవగానే అత్తవారు పెట్టేవారు.

నడ్డికి పెట్టుకొనే నగలు

వడ్డాణం. ఇందులో సాదాదీ, బెల్టు లాటిదీ, గజ్జలదీఅని, అనేక రకాలు వున్నాయి. ఇవికాక పట్టుతో కట్టుకు నేవి. గజ్జలపట్టెడలాటివి, కమ్మలపట్టా మొలత్రాడు, చామంతి మొగ్గల మొలత్రాడూ, జాజి మొగ్గల మొలత్రాడు, మొహరీలు మొలత్రాడు. ఒక 60 ఏళ్లక్రితం ఒక్క వడ్డాణమే ఆచారమై, క్రమక్రమంగా చేయించుకొనే సామర్థ్యము లేకా, మోటు అనీ చాలామంది ఆ వడ్డాణం కూడా మానేశారు. అది ఇప్పటి చీరలు కట్టే విధానానికి నప్పకో, చీరలకి నప్పకో ఉన్నా ఒడ్డాణం పెట్టుకొనే యువతులే లేరు.

కాళ్ళ జతలు

కాళ్ళకి వెండితో 200 తులాలకి తక్కువ కాకుండా నగలు, పెట్టుకొనేవారుట. ఎన్ని ఎక్కువ రకాలు ఎంత బరువు ఎక్కువవి పెట్టుకొంటే అంత గొప్పగా తలంచేవారుట. కాళ్ళకి నాలుగైదుతులాలు మొదలు 20 తులాలుదాకా ఉండే మట్టెలూ లేక చుట్లు కాళ్ళ బొటనవేళ్ళ పక్కవేళ్ళకి పెట్టుకొనేవారు. అవి మాంగళ్య చిహ్నంగా అత్తవారు పెళ్ళిలో పెట్టేవారు. అవి సువాసినులందరికీ ఉండేవిట. మిగతా చిన్న వేళ్ళకి పిల్లెళ్ళు అనేవి (ఉంగరాల లాటివే) పెట్టుకొనేవారు.

ఒక 60 ఏళ్ళక్రితం పాశ్చాత్య నాగరికతా ప్రభావంవల్ల నాజూకు వచ్చి ఒక 50, 60 తులాలవి రెండు, మూడు జతలు పెట్టుకొనేవారు. అందెలు అసలు 50 ఏళ్ళ క్రితానికే ఎక్కడా కనపడకుండా పోయేయి. కాని 20 సం||లు క్రితం దాకా కాళ్ళకి ఏదో ఒకటి లేకపోవడం తప్పుగానే భావించేవారు. 40 సం||కు పూర్వమే జోళ్లు వేసుకొనే అలవాటు యువతులుకూడా మొదలుపెట్టడంతో కాళ్ళజతలు అన్నీ ఒక్కటొక్కటిగా మాయమైపోయాయి.

15, 20 సం||ల నుండీ జోళ్లు కాళ్ళకి రక్షణకికాక మనం కటుకొన్న బట్టలకీ, అలంకరణకీ సహాయపడే పాదాలంకారాలుగా మారుటచేత ఇతర ఆభరణాలకి చోటు లేకుండా పోయినది.

వస్త్రధారణ

పూర్వకాలంవాళ్ళంతా అనుదినం తడిపి ఆరవేయడానికి వీలైన చీరలను కట్టేవారు. ఆయాచీరలకు నప్పే రంగులుగల రవికలు, వంటికి పూసుకున్నారా అనిపించేటంత బిగుతుగా ఉండి చేతులు పొడుగుగా ఉండి మోచేతులదాకా దిగే రవికలూ తొడుగుకొనేవారు. అవి ఇంచుమించు ఇప్పటి చోళీలలా ఉండేవిట. పేరంటాలకీ, పెత్తనాలకీ సన్నని నేతచీరలు వెడల్పు జరీవి కట్టేవారుట. వాటిలో ప్రసిద్ధి అయినవి బొబ్బిలి, శ్రీకాకుళం, ఉప్పాడ, గుంటూరు, చీరాల, వెంకటగిరి జరీచీరలు. ఇక పెళ్ళిళ్లకీ, వడుగులకీ సాధారణులంతా పెద్దాపురం, బెంగుళూరు పట్టుచీరెలూ, గొప్పవారు బెనారస్ జరీపట్టుచీరెలు (భణారస్ అనేవారు) కట్టేవారు. ఏది ఏమైనా అప్పటివారు ఉన్నకొద్దీ వీలైనకొద్దీ నగలే చేయించుకొనేవారు, కాని బట్టలకి ఎప్పుడూ ఏమీ డబ్బు పెట్టేవారు కాదు.

అంటే వారి ఉద్దేశం నగలు అయితే మళ్ళీ డబ్బుగా మార్చుకోవచ్చు గాని బట్టకిపెట్టి ఏంలాభం అని అనుకుంటాను. ఉన్నంతలో బట్టలు వారి అలంకారానికి మెరుగుపెట్టేవిగానే ఉండేవి కాని అలంకరణ అంటే నగలనే భావమే వారికి ఉండేదనిపించక మానదు. ఆ పూర్వకాలంలోనూ ఒక 60 ఏళ్ళక్రితం దాకానూ చీరకట్టు అంటే కచ్చాపోసికాని, గోచీపోసికాని కట్టవలసిందే కాని గూడకట్టు 15 ఏళ్ళ పిల్లకూడా కట్టకూడదు. ఓ 50 ఏళ్ల క్రితం యువతులు 20 లేక 30 ఏళ్లదాకా 'గూడకట్టు' కట్టుకోడంతో ప్రారంభమై ఇప్పుడు అంతా గూడకట్టులో దిగిపోయారు.

ఇంగ్లీషువారి జార్జెట్లూ, ప్రింట్లూ విరివిగా దిగుమతి అవడంతో చిన్నపిల్లలు వాటిని మొదలుపెట్టి ఇప్పుడు ఎవరికేనా పరికిణీమీద జార్జెట్లూ, ప్రింట్లూ కట్టడం ఒక ఫాషన్ అయిపోయింది. ఒక ఇరవై ముప్ఫైఏళ్ల క్రితం గొప్పగా మేచింగ్ అని చెప్పకొని ఒకేరకం చీరా రవికా తొడిగేవారు. వీలైనంతవరకూ గాజులూ నగలూ వాటికి నప్పేవే వేసుకొనేవారు. మళ్లీ ఇప్పుడు చీర అంచు రంగులాటికాని చీర ప్రక్క చక్కగా ప్రకాశించగల రవిక (చోళీ)గాని నాగరికత (ఫాషన్)గా పరిగణింపబడుచున్నది. కాని మనం అదేదో క్రొత్త అని చెప్పకొనే నప్పిన రంగుల కలయిక (Matching colour combination) మనపూర్వులకే ఎక్కువ తెలుసు ననిపించుతుంది. బహుశా అందుకే వారు ఎల్లప్పుడూ చీరా రవికల గుడ్డా జతగానే ఇచ్చే ఆచారం వచ్చిఉంటుంది.

ఒక నలభైఏళ్లక్రితం ఇంగ్లీషు బ్లౌజులనుపోలిన (చీరలో వరకూ ఉండి పొట్టిచేతులూ, బుట్టలవీ, కాలరూ ఉన్న) రవికలు వాడుకలోకి వచ్చాయి. మళ్లీ ఒక,10,15 ఏళ్ల క్రితం బుట్టచేతులు పొడుగై మళ్ళా సాదా చేతులై ఇప్పుడు తిరిగి పూర్వకాలపు చోళీలు ఫాషన్ అయిపోయాయి. బంగారం ప్రియం కావడంతో బట్టలకి అలంకరణలో ప్రాముఖ్యం హెచ్చినది. రకరకాల ప్రింటుతో ప్రారంభమైన ఇంగ్లీషు మిల్లుబట్టలనూ మన మిల్లుచీరలనూ ధరించడం నాగరికతా, నాజూకుగా భావించేవారు ఎక్కువ అయ్యారు.

పూర్వం పరికిణీపైన చీరకట్టడం అంటే అయ్యో అదేం సోద్యమమ్మ సానిపాపలాగ అనేవారు. ఇప్పుడువచ్చే పల్చటి బట్టలకీ కట్టే గూడ కట్టుతీరుకీ, పరికిణీ వేసుకోక పోతే చాలా అసహ్యకరంగా ఉంటుంది కనుక పరికిణీలు కట్టేఅలవాటు 50 ఏళ్ళ స్త్రీలలోకూడా సర్వసాధారణమై పోయింది.

ఇప్పుడు "లేటెస్టు ఫేషన్" షిఫాన్, నినాన్, నైలాన్ చీరలూ, పేపర్ జార్జెటు అనే మరీ పల్చని చీరలూను. కాని ఈచీరలు అతి పారదర్శకముగా ఉండి. మానరక్షణ కోసం ఏర్పడిన బట్టలుకట్టుకొనే ఆచారం ఆఖరికి అలంకారమే ప్రయోజనంగా అయిపోయిందేమో అని భ్రాంతి కలిగించక మానదు.

మైపూతలూ; సువాసన ద్రవ్యాలు

పూర్వం అందరూ విధిగా కొద్దీ గొప్పా భేదం లేకుండా వుపయోగించే మైపూత ఆచారంగా ఉండేది. అదిచూచి సుభకరముగాను, మాంగళ్య ద్రవ్యంగానూ దానిని ప్రజలు పరిగణించేవారు. వారమునకు ఒకసారి తైలం వంటినిండా రాసి, తాహతునిబట్టి మంచి గంధం, లేకపోతే పిండీ, మరీ గొప్పవాళ్ళు అయితే పునుగూ, జవ్వాజి నలిచి తలంటి నీళ్ళుపోసుకొనేవారు.

ఆ తలంటే కేశసంపదనూ, చర్మసౌందర్యాన్నీ కాపాడ్డమేకాక వాటినిహెచ్చించేటందుకు ఉపయోగపడేది. కాటుక కళ్ళకి అలంకారప్రాయంగా ఉండడమే కాక కళ్ల జబ్బులనుండి కళ్ళని కాపాడగలిగి ఉండేది. బొట్టు మాంగళ్య సూచకముగానూ అదిలేకపోడం చాలా తప్పుగానూ అప్పటి

అలంకరణలు

వారే కాక ఇప్పటికీ చాలామంది నమ్ముతారు.

ఈ కాలంలో కూలినాలి చేసుకొనే స్త్రీ దగ్గరనుండీ ఫేస్ పౌడర్ సబ్బు లేనిదే ఎవ్వరికీ రోజు గడువదు. ఎక్కువ ధనవంతులైన కొద్దీ అలంకరణ ద్రవ్యాలు (టాయిలెట్ సామాన్లు) ఎక్కువ అయిపోతాయి. సబ్బు రెండు రకాల క్రీములూ, పౌడరూ, లిప్‌స్టిక్, క్యూటెక్స్ కనుబొమ్మలకి వేసేరంగూ ఇలా అనేకం. ఈమధ్య యువతులు అన్నీ ఏరి కొనుక్కోనే అవస్థలేకుండా Mark factors అనేవి హాలీఉడ్డు నుండి అన్నీ ఒకే సెట్టుగా దిగుమతి అవుతున్నాయి. అవి అమ్మేచోటే ఒక "బ్యూటీ" స్పెషలిస్టు ఉండి ఎవరికి ఏవి బాగుంటాయో సలహా ఇస్తాడు. ఇవి ఉపయోగించడానికి అధమం నెలకో 25 రూపాయలూ రోజూ రెండు వేళలా రెండుగంటల టైమూ అవసరం. ఇంతాచేస్తే ఒక్కరోజు అవి మానేస్తే వారికి సహజసౌందర్యంకూడా రాణించకుండా పోతుంది. బొట్టులోకూడా అనేకరకాలు మారినా ఇప్పుడు మళ్ళీ డాబుగా బొట్టు పెట్టుకోడమే నాగరికత అయింది.

ఎన్ని సౌందర్యపోషణ వస్తువులను వాడినా అవి అన్నీ సహజ సౌందర్యానికి ఈడురావు. అసలు ఎంత వేష ఆడంబరం వున్నా విజ్ఞానం, విద్యా లేనినాడు అవి వున్నవాళ్ళ దగ్గర సౌందర్యవతుల అందం తీసికట్టే. నిజంగా మనిషికి సరియైన సంస్కారం ఉన్న నాడు విద్యా, విజ్ఞానములూ, అనుభవం ఆ వ్యక్తి కళ్ళలోనే ప్రతిఫలించుతూ ఉంటాయి కనుక వేషం ఎంత నిరాడంబరంగా శుచిగా ఉంటే అంత మంచిది. గౌరవప్రదం. ఏది ఎలాఉన్నా మన స్త్రీలు పూర్వులలా అన్నినగలూ ధరించకపోయినా మన జాతీయత మాత్రం మన వేషధారణలో నిలుపుకోడం గౌరవప్రదం, ఆవశ్యకముగా తలంచాలి.

మన ప్రాచీనాభరణాలు వాడుకలోకి వచ్చిన ఈరోజులలో ఆ విశిష్టమైన అభరణాలకు నప్పే మనదేశీయమైన చీరలూ రవికలూ కట్టితే అందంగా ఉంటుంది కాని విదేశీ అనుకరణలో కూడిన నైలాన్, షిఫాన్ మొదలయిన చీరలు (ఆఖరికి జార్జెట్ కూడా) మన నగలకు నప్పక ఆ నగల అందంపోయి, ఇటు ఈ చీరలూ అటు ఆనగలూ వెలవెలలాడి కట్టిన వ్యక్తిని చూడగానే ఏదో వినోద ప్రదర్శన అలంకారంగా (Cartoon) అనిపించక మానదు.

కనుక అలంకరణకు మొదలుపెట్టినప్పుడే ఒకదానితోఒకటి నప్పి అందాన్ని ఇనుమడింపజేసేలా చూచుకోవాలి. ★

చాదస్తం; పరిశుభ్రత

★ **కొత్తపల్లి రాజ్యలక్ష్మి** ★

"పరిశుభ్రత"కి కూడా ఒక హద్దు అంటూ వుండాలి. శుభ్రంగా ఉండడం అంటే తలారా స్నానంచేసి, తడిబట్ట కట్టుకొనగానే సరికాదు. మావీధిలో ఒకామె వుండేది. వాళ్ళింట్లో నాలుగు భాగాలకు కలసి ఒక కొళాయి ఉండేది. ఇక ఆమె నీళ్ళు పడుతున్నప్పుడు ఆ పరిసరాలకుకూడ ఎవ్వరూ రాకూడదనేది. అంత ఆచారం. పోనీ తనకు కావలసిన నీళ్లు పట్టుకొని వెళుతుందా! అదీ లేదు. పనిమనిషి తోమి కడిగిన గిన్నెలన్నీ వాటడయితే పంపు క్రింద పడేసి మళ్ళీ వాటికన్నిటికి యింత బూడిద పట్టించి మరలా తోమి కడిగివేస్తుంది. ఇంతలోపల ఆమె కూతురు మడితో వస్తుంది. గుమ్మందగ్గర మొదలుకొని, కుళాయిదగ్గర కొచ్చేవరకూ దారిపొడుగునా నీళ్లుపోసుకుంటూ వస్తుంది. తోమిన గిన్నెలను మరలా ఆమెకూడా బూడిదతో, తోమి కడిగి అప్పుడు గిన్నెలను లోనికి తీసికెళుతుంది. అప్పటి కెన్నినీళ్లు వృధా అయిపోతవో చూడండి? తక్కినవారంతా ఎప్పుడు పట్టుకుంటారు. ఏమన్నా అంటే ఆ తల్లీ కూతుళ్ళతో గెలవలేరు. ఆమె నీళ్లదగ్గర కొచ్చిందంటేనే చిరాకనిపిస్తుంది.

పోనీ యింతాచేసి వాళ్ళిల్లుగాని సామానుగాని శుభ్రంగా ఒక తీరుగా వుంటుందా అంటే అదీలేదు. ఇక వంటయిల్లు తేమగా వుంటుంది. ఎవరొచ్చి అడుగువేసినా ఒక బిందెనీళ్ళు పోసి కడిగేస్తుంటారు.

ఇక ఆఫీసుకెళ్లే భర్తకు వేళకు ఇంత కాఫీ అయినా ఇవ్వదా యిల్లాలు. పాపం అతను ఏ హోటల్లోకోపోయి కాఫీ తాగుతాడు. శుభ్రత అనగా అదా చెప్పండి? ఉదయమే లేచి పనిమనిషి (ఉన్నవారికి) ఇల్లూ వాకిలి అంటగిన్నెలూ శుభ్రంచేసిన తరువాత, ముఖం కడుగుకొని, స్నానంచేసి పొయిదగ్గరకు పోయి ఆఫీసుకెళ్ళేవారికి వేళకు కాఫీలవీ ఇచ్చి వారిని పంపించి తరువాత, పసిబిడ్డలకు పాలూ నీళ్ళూ అవీ చూచుకుని, ఆపైన చక్కగా వంటపని ముగించుకుని ఉండాలి. అంతేగాని యిరవైనాలుగు గంటలూ కడిగిందే కడిగి తోమిందే తోముతుంటూ ఉంటారా? దీనిని శుభ్రత అనరు. చాదస్తం అంటారు.

కొందరు వంటయింటిని చిన్న మార్కెట్టుగా తయారుచేస్తారు. మా బంధువుల్లో ఒకామె వుంది. ఆమెకు ఇద్దరు పిల్లలు. అన్ని పనులకూ పనిమనిషి వుంది. ఆమె భర్త ఏడింటికే ఆఫీసు కెళ్ళాలి. డ్యూటీకెళ్ళే భర్తకు ఏడయినా యిన్ని కాఫీనీళ్ళయినా అందించదు ఆవిడ. ఆయనగారే విసుక్కుంటూ కసుక్కుంటూ కాఫీచేసుకుని త్రాగి వెళ్ళిపోతాడు. ఇక పదిగంటలయినా పొయిమీదకు అన్నం గిన్నె ఎక్కదు. ఒక ప్రక్క పంచదార డబ్బా, కాఫీడబ్బాలు, ఇంకొక ప్రక్క చేటలో ఏ కందిపప్పో, బియ్యమో, ఒక ప్రక్క ఒలిచిన వుల్లిపాయలు, మరొకప్రక్క ఏవో కూరలు దొర్లుతూవుంటవి. చివరకు పొయ్యిమీద పసిబిడ్డకు నీళ్ళు పడివుంటాయి. లేకపోతే చల్లారిన కాఫీ పడివుంటుంది. ఆ పొయ్యి నీళ్లుకారుతూ వుంటుంది. ఇరుగుపొరుగులతో సోది అయితే విసుగు లేకుండా గంటలతరబడీ వేసుకుంటుంది. ఆకలికూడ ఎరగదు. అప్పుడు అరకే పడకొండు అవవొచ్చింది, వారు వచ్చే వేళయింది అని ఆదరా బాదరా వంట అయిందనిపిస్తుంది. ఒక్కొక్కసారి ఈ హడావుడిలో అన్నం మాడటం, చారు కిందామీదా ఒలకడం జరుగుతుంది. భోజనంవేళకు భర్తగారు వచ్చే టప్పటికి, పోపులు సుయ్‌మంటుంటాయి. ఆయనగారు వంట కాలేదని ఆకాశాని కెగురుతాడు. గొంతులో మెతుకు లేసుకోగానే మళ్ళీ పోవాలి. అతనికి సుఖ మెక్కడిది చెప్పండి? వూరికే గంటలపర్యంతమూ పొగలో వంటిట్లో తిరుగుతూ కాలక్షేపంచేసి, చివరకి హడావుడిగా వుడకేసి, వంట అధ్వానంగా చేసుకోవడ మెందుకు? ఉదయమే లేచి, గబగబా నాలుగు పనులు ముగించుకుని తీరిగ్గా కూర్చోవాలిగాని!

★

అనవసర ప్రసంగము

మొన్నీమధ్య ఒకరోజున నేనూ మా అన్నయ్యా కలసి ఏదో ఒకసినిమాకి వెళ్ళాము. ఆవేళ చాలా రష్‌గావున్నది. సరే ఎట్లాగో కూర్చున్నాము. సినిమా మధ్యలో కరంటు ఆగిపోయింది. పావుగంటవరకు తిరిగి మొదలు కాలేదు. అప్పుడు సినిమాహాలు ఒక నరకములాగా అనిపించినది. ఒకటేగోల, కేరింతలు, నవ్వులు, గొడవ గొడవగా ఉంది. ఇంక చుట్టపొగలతోటి సిగరెట్లు బీడీల పొగ తోటి వళ్ళు బట్టలు కంపు గొట్టుచున్నాయి. దానితోటి తలనొప్పి బయలుదేరింది. అసలే చస్తుంటే మా ప్రక్క నున్నావిడ పలకరించింది.

సరే ఈవిడతోనన్నా కొంచం మాట్లాడితే ఆ గొడవవీ మా వినిపించదని తలంచి ఆవిడ అడిగే ప్రశ్నకు సమాధానము చెప్పటకు సిద్ధమయ్యాను.

ఆవిడ మొదట "మీ రెవరు? అన్నది. అదేమి ప్రశ్నరా బాబూ అని అనుకొని సమాధానము చెప్పేను. తరవాత మీ యిల్లెక్కడ అని అడిగి వాళ్ళెక్కడున్నారో చెప్పింది. అట్లాంటివి ఆవిడ చెప్పుచు ఉంటే నేను వూ కొట్టాను.

ఇంతవరకూ ఫరవాలేదు. ఏదో ఒక కొత్త మనిషి పరిచయం అయిందనుకోవచ్చు కాని ఆవిడ, మా అన్నయ్యవేపు చూచి తల తాటిస్తూ, నన్ను "మీఅత్తగారు వూరేది"అని అడిగేటప్పటికి ఉలిక్కిపడ్డాను. వళ్ళు మండిపోయి, ఇ దేమిగొడవరా బాబు అనుకుని ఎట్లాగో "ఆ అబ్బాయి మాఅన్నయ్య; నాకు వివాహము కాలేదు" అని చెప్పాను.

మొన్న ఆమధ్య సుశీలాదేవిగారు (ఆంధ్ర వారపత్రిక నవంబరు 7) చెప్పినట్లు ఎవరైన అబ్బాయి అమ్మాయి కలిసి ఎక్కడికైనా వెళ్తే ఎవరైనదీ ఆలోచించకుండా చటుక్కున మొగుడు పెళ్ళాం అనేస్తారు. దాని వలన కలిగే లాభము ఏమీ యుండదు. పైగా వారి తెలివితక్కువతనము బయటపడుతుంది.

సరే అంతటితో ఆమె వూరుకోనక "అవునమ్మా పెండ్లిచేసికొని పాట్లు పడేకంటే ఏ హైపోషారుహాండ్లో చేర్చుకోంటే నయము. నేను ఈ పిల్లలతోటి చస్తున్నాను. మా అత్తగారు ఇట్లా మా ఆడబడుచులు వేధించు తింటారు. మా వారు మంచివారు కాదు. నాకు చిన్నప్పుడే మాఅమ్మ నాన్న పెండ్లి చేసేరు. మా చెల్లెలికి అంతేచేసేరు"అని గుక్క తిప్పుకోకుండా ఇంక ఏమిటేమిటో చెప్పుకొనిపోయింది. ఇది అంతా అనవసర ప్రసంగము గాక మరేమిటి? ఇట్లాంటివారిని తెలివి తక్కువవారు అనక మరేమిటంటారు. వారిని జూస్తే చాలా జాలివేస్తుంది. కాని ఇట్లాంటి ప్రసంగము అంతా ఎవరికిబడితే వారికి చెప్పితే వారి విలువ గౌరవం పోయి, ఎదటివాళ్ళకి చులకనగా వుంటుంది. ముఖ్యముగా సినిమాహాల్సులో ఇటువంటి ప్రసంగాలు మొదలెడితే పక్కవారికి చికాకుగలుగుతుంది. అయినా సినిమాను చూడటానికి వచ్చినప్పుడు ఆ కాసేపు ఆనందించక గొడవా సోది మొదలెట్టితే అసహ్యముగా వుంటుంది. ఇంకా బస్సు ప్రయాణములలోను రైలు ప్రయాణములలోను అయితే వారి మాటలను విని వారిని ఓదార్చ బుద్ధిపుడుతుంది. ఇట్లాంటి అమాయకులు కొద్దిమంది మాత్రమే ఉన్నారు. వారు కూడా ఇలాంటి మంచి చెడ్డలు తెలుసుకొందురనే ఆశించుదాము.

—ఆర్. ఎస్. లక్ష్మి (కాకినాడ)

* * *

ఎవరి మట్టుకు వారు మంచివారే

చాలామంది ఒకళ్లు బాగా ఉంటే చూడలేరు. ఎవరైనా ఒక చీర కాని ఒక వస్తువు కాని కొనుక్కుంటే ఎన్నో వంకలు పెడతారు. ఇలాంటిది ఇదివరకే మా ఇంట్లో కొన్నారనో లేకపోతే అబ్బే! ఇది ఇంత ఖరీదు చేయదు అనో అంటారు. అవతలవాళ్లు ఎంత ఖరీదు పెట్టి కొన్నా సరే. ఎంతో తేలిగ్గా కొట్టిపారేస్తారు. దానివల్ల వాళ్ళకి ఏమీ కలిసిరాకపోయినా సరే అలా అంటే వాళ్ళకి ఒక విధమైన ఆనందమే కాని అవతలివాళ్లు ఏమనుకుంటారోనని ఉండదు.

ఇంకోరకంవాళ్ళు ఉన్నారు. వాళ్ళకి ఏవైనా కుట్లు కాని అల్లకాలు కాని వస్తే ఇతరులకు చెప్పరు. సరికదా ఒకవేళ మనం ఖర్మంచాలక వాళ్లు కుడుతున్న వేళ వెడితే కుడుతూకుడుతూన్నది ఆపేసి ఏమీ ఎరగనట్టుగా ఉంటారు. మా చుట్టాలమ్మాయి ఒకావిడ ఉంది. ఆమెకి ఎన్నో రకాల ఎంబ్రాయిడరీ కుట్లు వచ్చును. ఏవైనా కుడితే మా ఇంట్లో తెగమెచ్చుకుంటారు. ఎలా కుట్టేవని మేమడిగితే నవ్వేస్తుంది అడిగినవాళ్లు చిత్తయిపోయేలా. కాని ఎలా కుట్టిందీ చెప్పదు. (ఒక్క కుట్లూ అల్లకాల విషయంలోనేకాని మరేదైనా అడిగితే ఒక గంట లెక్చర్ ఇస్తే కాని వదలదు.) పైగా అడిగితే నాకేం వచ్చు ఏదో తోచక కుడుతున్నాను అంటారు ఇలాంటివాళ్ళు. అక్కడికి అడిగినవాళ్ళకి మహా వచ్చేసినట్టుగా. లేకపోతే ఇది కుట్టడం చాలాకష్టం అంటారు. అక్కడికి మనం శుద్ధ మొద్దావతారం అయినట్టుగా. అది వాళ్ళే కాని మనం కుట్టలేమన్నమాట. లేకపోతే అబ్బే, ఇది చాలా సులువు అంటారు; అక్కడికి అది చూడకుండానే కుట్టేయవచ్చుని అర్థం వచ్చేలా. అంతేకాని ఎలాకుట్టింది చెప్పరు.

మొదటిరకం ఎలాగా కుట్టలేం, రెండవ రకం చెప్పక్కరలేదు. పోనీ రావంటారనుకోండి. వాళ్ళు కుట్టినవి, అల్లినవి గొప్పగా చూపిస్తారు. ఎందుకంటే అబ్బ! ఎంత బాగా కుట్టావోనని మెచ్చుకుందుకు.

చెప్పేవారు లేరా అంటారేమో వాళ్ళూ ఉన్నారు. మా ఊరికి ఒక సోషల్ ఆర్గనైజర్ గా ఒకావిడను వేశారు. ఆవిడ B. A. Pass అయ్యారు. కుట్లు రావు. నేను ఏవైనా కుట్లుగురించి గాని మరేదైనా సరే అడిగితే ఆవిడకు రాకపోయినా నేర్చుకొని నాకు చెప్పారు. అలాంటి మంచి వాళ్ళూ ఉంటారు కాని మంచీ, చెడూ లేకపోతే అనుకోవలసిన అవసరమే లేదు. భగవంతుడు ఇచ్చిన రూపానికి మనం ఏమీ చేయలేము కాని గుణాలని కొంతలో కొంతైనా మరమ్మత్ చేసుకోవచ్చు ప్రయత్నిస్తే. చిత్రమేమిటంటే ఎవరిమట్టుకు వారికి తాము అలాటివాళ్ళం కామనిపిస్తుంది.

—ఎస్. రాజేశ్వరి, మాకవరపాలెం.

* * *

పిల్లలను భయపెడితే

నాలుగేళ్ళ రాము ఆడుకుంటూ కుండీలో వున్న సన్నజాజి మొక్కను లాగేశాడు. "రామూ అందులో బూచివున్నది. మొక్కను

(56-వ పేజీ చూడండి)

పిల్లల పెంపకంలో:

"తోటకూర నాడే చెప్పకపోతివి గదమ్మా!"

మ: దిగంటి అనసూయ

(తణుకు)

వెనుకటికొక ఇల్లాలు ఉండేదిట. పిల్లవాడు ఇరుగింటా పొరుగింటా చిన్న పెద్దా వస్తువులూ, ఆ తోటనించి ఈ మడినించి, తోటకూరలాటివీ ఎత్తుకొస్తూఉంటే చూస్తూ ఊరుకొనేదట. తీరా కొడుకో ఘనవ్యాపారంలో సాటిలేని మేటియై, శ్రీకృష్ణజన్మస్థానానికి పోయేఘట్టం వచ్చినరోజున ఆవిడ కళ్లు తెరచి "ఎంతపని చేశావురా నా తండ్రీ" అని మొత్తుకుందిట.

"ఓయమ్మా నాకేం తెలుసు ఇంతవరకూను. తోటకూరనాడే చెప్పకపోతివిగదమ్మ ఇపుడేడిచి మొత్తుకుని లాభం ఏమిటి" అన్నాడట కుమారుడు.

చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే ఏం ప్రయోజనం? తోటకూర ఎత్తుకొచ్చిననాడే పిల్లవాణ్ని మందలించి దారిలో పెడితే ఈ స్థితికి వచ్చేవాడుకాదుగదా అని ఆవిడ వాపోయింది.

శ్రీనాథుడు రచించిన కాశీ ఖండంలోని గుణనిధి తల్లికూడా ఈ సందర్భంలో జ్ఞాపకం రాక మానదు. కొడుకుమీద మితిమీరిన వాత్సల్యమే అతని జీవితాన్ని నాశనం చేసింది' ఆమె పచ్చని సంసారానికి కూడా చిచ్చుపెట్టింది.

పిల్లలపైని ఇటువంటి వల్లమాలిన మమకారంతో, వారిని పెడత్రోవ పట్టించి, చివరకి ఏమీ చేయలేక చింతించే తల్లులీనాడూ చాలా మంది ఉన్నారంటే సత్యదూరం కాదనుకుంటా. అసలు పిల్లలు చెడిపోవడానికి కూడా వారే ప్రారంభోత్సవం చేస్తుంటారు.

ఏడుస్తున్న పిల్లల పోరణచడానికి (వాళ్లు ఆకలేసి ఏడ్చినా, మరెందుకేడ్చినా సరే) చిరుతిళ్లు అలవాటు చేస్తుంటారు. స్కూలుకు పోక మారాంచేసే పిల్లల్ని అర్ధణా, అణా చొప్పున డబ్బులిచ్చి, వాళ్ళని మభ్యపెట్టి బడికి పంపడం నేర్పుతారు. ఇక మర్నాటి నుంచి వాళ్ళే డబ్బులిస్తావా, ఛస్తావా అంటూ నెత్తికెక్కి కూర్చుంటారు. ఇస్తే సరేసరి, ఒకవేళ ఇవ్వకపోయిందా ఇంట్లో అర్ధణా, అణా, పావలా రూపాయి చొప్పుని డబ్బులు మాయమవడం, ఆతల్లి దాసీలు నౌకర్లమీద అనుమానపడి రౌద్రరూపం దాల్చడం సంభవిస్తుంటుంది.


కాస్త తెలివివుండి, బాధ్యత తెరిగిన తల్లులైతే సంగతి కనిపెట్టి పిల్లల్నినయనా, భయానా మందలించి ఈ దుర్లక్షణా లలవడకుండా కాపాడుకుంటారు.

కాని కొందరు తల్లులు, లేక బామ్మలు, అమ్మమ్మ లుంటుంటారు. పిల్లలమీది వెర్రి ప్రేమతో (అట్లా అనడంకంటె మూర్ఖత్వమంటేనే బాగుంటుందేమో) ఇట్లాంటి విషయాల్ని పట్టించుకోరు. తెలిసినా చూసీ చూడనట్లూరకుంటారు. 'అఁ! కుర్రవాడులే! పెద్ద అయాక వాడే మానేస్తాడు' అని నిర్లక్ష్యం చేసేస్తారు. అంతా ఎరుగుండీ వాళ్ళనేమీ మందలించరు, సరికదా తండ్రికి తెలిస్తే ఏం కొడతాడో, దండిస్తాడోనని పిల్లల నేరాల్ని తెలియనియ్యకుండా కప్పిపుచ్చుతారు.

ఇక తల్లుల ఆసరా చూసుకున్న ఆ పుత్రరత్నాలకు పట్టపగ్గా లుండవు. తెలిసినా అమ్మ ఏమీ అనదు. నాన్న కసలిలాంటి వేమీ తెలియవు. ఇంకేం! ఆపైన పైసలతో ప్రారంభమైన ఈ దుర్లక్షణం క్రమక్రమాభివృద్ధిచెంది తండ్రి జేబుల్లో దొంగిలించడం నుంచి పరాయిచోట్లకి పాకి మెల్లిగా పెద్ద పెద్ద వ్యవహారాలలోకి దిగుతుంది. ఇంట్లోంచి వెండి బంగారాలు తరిగిపోయి అదృశ్యమై పోతూండడం చూసి ఇటు తల్లి గాబరా పడిపోతూంది. అటు తన పేర వూళ్ళో ఎక్కడ పడితే అక్కడ కొట్లల్లో కాతలూ ఇంకా స్నేహితులదగ్గర అప్పులూచూసి తండ్రి తెల్లబోతాడు.

ఇట్లా తల్లికి దండ్రికి మెళకువ వచ్చే సరికి ఆ ప్రబుద్ధుడు తనవృత్తిలో ప్రవీణుడై లొంగిరాకపోవడంకూడా సంభవిస్తుంది. ఈలక్షణమలవడితే ఒకింతట వదలదు. దానికి మితి ఉండదు. ఒక్కొక్కళ్ళ దౌర్భాగ్యంవల్ల దీనికిదగ్గర చుట్టాలయిన బీడీలు, సిగరెట్లు తాగడం, చీట్లపేకలు, జూదాలు ఆడడం, అమ్మాయిలను వేటాడడంకూడా కద్దు. ఓ! ఒకటేమిటి ఆ పుత్రులు సర్వలక్షణం సంపన్నులై, కుటుంబానికి "కులదీపకులై", ఇంటికి, వంటికికూడా వినాశాన్ని కొనితెచ్చుకోవడం జరుగుతుంది.

చాలామంది ఇళ్లల్లో పిల్లలకీ లక్షణం సాధారణంగా అబ్బుతోనే ఉంటుంది. నిర్లక్ష్యంచేస్తే విషమపరిణామాలకు దారితీయడం సర్వసాధారణం. కనుక ఇటువంటి వాటిని చాలతేలిక లెక్కగట్టి కొట్టివెయ్యడానికివీల్లేదు. ముఖ్యంగా ఈ విషయంలో శ్రద్ధవహించవలసిన బాధ్యత తల్లిదే. కొద్ది సూక్ష్మంగా పరిశీలించితే చాలు పిల్లలలోని ఈ లక్షణాన్ని పట్టెయ్యొచ్చు. ఆ వెనువెంటనే ఈ గుణాన్ని మొగ్గలోనే పుణికి వెయ్యాలి, కాని వికసింప నీయకూడదు. మొక్కని తుంచడం సులభంకాని, మ్రాను అయ్యాక వంచడం మనేది అసాధ్యమనే సంగతిఅంతా ఎరుగున్నదే కదా! ★



పూలగుత్తులు

మొట్టుపల్లి సుబ్బలక్ష్మి, విజయవాడ.

(34-వ పేజీ తరువాయి)

"అమ్మాయీ! అమ్మాయీ!"

అని పిల్చింది. ఇంటిలో ఆమె స్వరం మాత్రము ప్రతిధ్వనించిందికాని బిడ్డ కన్పించలేదు. భూదేవి తక్కిన దేవతా బాలల ఇండ్లకు వెళ్ళింది.

"మా అమ్మాయి కన్పించిందా?"

"ఉదయం మాతోనే ఆడుకోడానికి వచ్చింది"

"తిరిగి వచ్చేటప్పుడు కన్పించినట్లు లేదు"

భూదేవి ఎంతో విచారించింది, శ్రద్ధగా ప్రతిచోటు వెదికింది. కొండలూ, లోయలూ, గుంటలూ, మెట్టలూ, ప్రతిపాద వెదికింది. ఎక్కడా తన ముద్దులబిడ్డ కన్పించలేదు. పుత్రికా వియోగంవల్ల ఆమెకు పిచ్చి ఎత్తినట్లు అయింది. ఆ రాత్రి అంతా ఆమెను వెదకుతూనే ఉంది.

మరుసటిదినము ఉదయము భూదేవికి తన పని మీద వెళ్ళాలి అనే ధ్యాసే కలగలేదు. బిడ్డను వెదకుకొంటూ తిరుగుతూంది. బిడ్డ కన్పించలేదు. భూదేవి బిడ్డకై విచారిస్తూ తన గృహంలోనే ఉండిపోయింది.

భూదేవి లేకపోతే భూమిలో పంటలు పండించేదెవరు? పువ్వులు పూయించేదెవరు? కాయలు కాయించేదెవరు? భూలోకమంతటా భయంకరమైన క్షామము కలిగింది. చెట్లు చేమలు ఎండిపోయాయి. పొలాలు నిలువునా ఎండిపోయాయి. పిందెలతో చెట్లు మలమల మాడిపోయాయి. ఎక్కడా ఒక్క పచ్చని ఆకు కన్పించలేదు. ఒక పువ్వుము పూయలేదు. ప్రపంచములోని జీవరాసులన్నీ ఆకలికి మలమల మాడిపోయారు. అలమటించారు. వారి ఆక్రందనాలతో దిక్కులు మారుమ్రోగాయి.

దేవలోకాధిపతియైన "జూపిటర్"కు ఈ ఆక్రందనాలు విన్పించాయి. ఒక్కనిమిషంలో భూలోకంలోని కఱవునకు కారణము తన దివ్యదృష్టివలన తెలిసికొన్నాడు. భూదేవి తనపుత్రిక లేకుండ పొలాలు పండించదు. ఆమెను అడిగి లాభం లేదు: జూపిటర్ తన దివ్యదృష్టితో దేవలోకాలన్నీ వెదికాడు. ప్రొసర్పినా కన్పించలేదు. భూలోకంలోని మారుమూలలన్నీ వెదికాడు. ఊహుఁ... భూదేవిపుత్రిక కన్పించలేదు. చివరకు తన దృష్టిపాతాళలోకంవైపు ప్రసారించాడు.

అది తన తమ్ముడయిన ప్లూటో శుద్ధాంతః పురము. అక్కడ పాతాళలోకాధికారియైన ప్లూటో సముఖములో కన్పించింది ప్రొసర్పినా. ఒక పళ్లెరములో దానిమ్మపండు ఆమె కిస్తున్నాడు ప్లూటో.

పాతాళలోకంలో ఏదైనా తింటే ఎవరూ తిరిగి భూలోకానికి రారు. కనుక వెంటనే తన సేవకుని ప్లూటోదగ్గరకు పంపించాడు. తనతమ్మునికి ఇలా సందేశము పంపాడు:

"ఈ సేవకునితో భూదేవిపుత్రికయైన ప్రొసర్పినాను పంపించి వేయాలి. తన బిడ్డ లేకపోవడంవల్ల భూదేవి పనిచేయడములేదు. తత్ఫలితంగా భూలోకంలో ఘోరమైన కఱవు విజృంభించింది."

పాతాళలోకాధిపతి తన అన్నగారిమాట తిరస్కరించగలడా? తాను అత్యధికంగా ప్రేమించి, పెండ్లాడిన ప్రొసర్పినాను వెంటనే భూలోకానికి పంపించాడు. ఎలాగో తల్లితో మాట్లాడి తిరిగివస్తానని ప్రొసర్పినా భర్తనువదలి భూలోకానికి వచ్చింది.

బిడ్డను చూడగానే భూదేవి సంతోషానికి మేరలేదు. తల్లిబిడ్డ లిద్దరూ సంతోషించారు.

"అమ్మాయీ! పాతాళలోకంలో ఏదైనా తిన్నావా?"

"ఒక్క దానిమ్మపండులో నాలుగవవంతు తిన్నానమ్మా!" అని పుత్రిక జవాబిచ్చింది.

"అయితే సంవత్సరానికి మూడు నెలలూ నీవు పాతాళానికి వెళ్ళాలి."

"భర్తతో మూడు నెలలూ గడుపవచ్చని సంతోషించింది ప్రొసర్పినా. భూదేవి సంతోషంగా తన రథమెక్కి లోకమంతా తిరిగి తనపనిని ప్రారంభించింది. ఎండిన మోడులన్నీ చిగిరించాయి. పైర్లు అన్నీ పచ్చబడ్డాయి. ఫలవృక్షాలన్నీ చిగిర్చి పుష్పించి, ఫలించాయి. తిరిగి భూలోకంలో వసంతఋతువు వచ్చింది. ధాన్యాలు, కూరగాయలు, తియ్యనిఫలాలతో భూమి నిండిపోయింది. భూలోకంలో కఱవు మాయమైపోయింది. ధనధాన్యాలతో, పాడిపంటలతో భూలోకం సుభిక్షంగా ఉంది.

ప్రతి సంవత్సరమూ మంచు దట్టంగా కురిసే శీతాకాలముమాత్రము ప్రొసర్పినా భర్తతో, కాపురము చేయడానికి పాతాళలోకము వెళ్తుంది. అప్పుడు భూదేవి ఏ పనీ చెయ్యదు. తిరిగి ప్రొసర్పినా భూమిమీద అడుగు పెట్టగానె వసంతఋతువు ప్రారంభమౌతుంది. తల్లీబిడ్డలు భూలోకాన్ని సస్యశ్యామలంగా చేయడంలో నిమగ్నులౌతూంటారు. ★

పతిత జనోద్ధరణం

(19-వ పేజీ తరువాయి)

అన్నాడారుణి. తరవాత అతనికిక ఏమన డానికి ఏమిపాలుపోలేదు:

"అది సరేగాని మీ అమ్మ తిరిగి ఇక్కడికి వచ్చి నిన్నిక్కడించి తీసుకుపోతుందేమోనని భయపడుతున్నాను."

అని ఆరుణి పరిశీలనగా ఆమె వైపు చూచాడు:

"ఏమైనా సరే! నేనిక ఆ నరకకూపంలో ప్రవేశించ దలచుకోలేదు. మీకు నేనిక్కడ నివసించడం ఇష్టం లేకపోతే నానిందు ప్రాణాలా గంగాదేవి కర్పించి వేస్తాను. అంతే!"

"తప్పు! తప్పు! అలాగనకూడదు. ఆత్మహత్య మహాపాతకమని ధర్మశాస్త్రవేత్తలు ఘోషిస్తున్నారు. అది సరేగాని నీవు తిరిగి వెళ్ళకపోతే మీ కుటుంబం అంతా అన్నవస్త్రాలు కూడా లేక ఆత్మహత్యలకు పాల్పడతారేమో. అప్పుడా మహాపాతకం అంతా నీ మెడకు చుట్టుకుంటుంది. ఆవిషయం ఏమైనా ఆలోచించావా".

"మీరన్నది నిజమే! అయితే నాకిక ఈ సంసారకూపం నించి విముక్తి లేదా? నేనీఅంధకూపంలో పడి ఇలాగే మగ్గిపోవలసిందేనా? ధర్మవేత్తలైన తామే ఇలాగ సెలవిస్తే ఇక నే నేమనగలను!"


ఆమాటకేమని సమాధానం చెప్పాలో ఆరుణికి స్ఫురించలేదు:

"అయితే మీ అమ్మతిరిగివచ్చినప్పుడాలోచించుకోవచ్చులే!"

అని ఒక్క నిట్టూర్పు విడిచిపెట్టాడు. పిమ్మట మెమ్మదిగా మెమ్మదిగా అడుగులు వేసుకుంటూతన కుటీరంలోకి వెళ్ళిపోయాడు.

—సశేషం.

★



రేపు

ధర్మరాజు వదాన్యతను
ధరణీప్రజ పొగడుట విని
పేద పాఱు డొకడు చనియె
మోదముతో నతని కడకు.

సింహద్వారంబు చెంత
జేరి, యచటనున్న భీమ
సేనునితో తనకోరిక
జెప్పి యంగలార్చుకొనియె.

సాదరముగ సమీరజుడు
భూదేవుని వృత్తాంతము
విని, ధర్మజు దర్శింపుమ
నెను మిక్కిలి జాలిపొంది.

ఆతడు కొండంతయాశ
నరిగి చొచ్చె నాస్థానము;
అప్పుడె చాలించుచుండె
నకటా ధర్మజుడు కొల్వు.

ధరణీసురుడు తనవాంఛిత
మెఱిగించెను భూవిభునకు;
సమయము మించినది రేపు
చనుదెమ్మనె కౌంతేయుడు.

హతాశుడై తిరిగిపోవు
అవనీసురు గని భీముడు
"ఏమి జరిగె" ననగ సతం
డెఱిగించెను సంగతెల్ల.

పకపక నగి పవనజుండు
పగులగొట్టె తన గదతో
అచటనున్న నగారాను
అతిభయంకరముగ మోది.

ఆ శబ్దమునకు పట్టణ
మందలి వారెల్ల రచట
జేరిరి; ధర్మజుడుకూడ
చేరి "ఇదే"మని యడిగెను.

"నమ్మగ వెఱతురు బ్రహ్మ
జ్ఞానులు సైతము రేపును
అట్టిదాని నీవు నమ్మ
టబ్బురంబు కాకేమగు?

అన్నయ్యా! యిదియే నా
హర్షమునకు కారణ"మన
సిగ్గుపడి శమనపుత్రుడు
శిరము వంచుకొని, పాపము!

అప్పుడె బ్రాహ్మణుని బిలిచి
యమిత ధనమొసంగి పంపె;
కావున రేపనుటకంటె
కలదె వెఱ్ఱి తలప నిలను.

★ ఆర్. దొరసామి ★


మంత్రి యుక్తి

పి. వి. యల్. నరసింహారావు

అనగా అనగా ఒకరాజు. అతడికి ముగ్గురు కొడుకులు. రాజు ఎంతో ప్రజారంజకంగా రాజ్యాన్ని పరిపాలించేవాడు. చివరకు ఆయనకు అవసానదశ వచ్చింది. ముగ్గురు పుత్రులను దగ్గిరికి పిలిచి ఐకమత్యము యొక్క ఆవశ్యకతను వాళ్లకు బోధించి చివరకు తను చెప్పినట్లు వాళ్లు నడుచుకొంటామని వాళ్ళచేత ప్రమాణము చేయించుకొన్నాడు. తన రాజ్యాన్ని యావత్తు మొదటివాడిని సగమూ, రెండవవాడిని నాల్గవ వంతు, మూడవవాడిని ఐదవవంతూ తీసికొనమని సెలవిచ్చి ఆయన ప్రాణాలను వదిలేశాడు.

వాళ్ళు ముగ్గురు తండ్రి ఆజ్ఞ ప్రకారము యావత్తు రాజ్యాన్ని పంచుకున్నారు. కాని, చివరకు ఏనుగులు పంచుకోటానికి వచ్చేటప్పటికి పెద్ద చిక్కు వచ్చింది. మొత్తం పందొమ్మిది యేనుగులు ఉన్నాయి. మొదటివాడు అందులో సగము తీసికోవాలికదా? ఎలా తీసికోవటం? ఏనుగును కోసి తీసుకొంటే అది చచ్చిపోతుంది గదా? ముగ్గురు తలలు బ్రద్దలు చేసికోసాగారు. కాని, వాళ్లకు ఎంతకూ ఉపాయము తోచలేదు. చివరకు ముఖ్యమంత్రి విచ్చేశారు. ఆయన వీరిబాధ ఏమిటని ప్రశ్నించి కారణము తెలుసుకొని చిరునవ్వు నవ్వారు. మీకు నేను రేపు ఉదయము ఏనుగులను పంచి యిస్తాను, ఈలోపల హాయిగా పోయి నిద్రపొండి అని సెలవిచ్చారు.

మరునాడు ఉదయము రాజకుమారులు ముగ్గురు కోట ఆవరణలోకి వచ్చేటప్పటికి ఏనుగులు పందొమ్మిది ఒక వరుసలో ఉంచబడి వున్నాయి. ఇంతలో మంత్రిగారు ఒక ఏనుగుమీద అచ్చటికి విచ్చేశారు. ఆయన క్రిందకు దిగుటతోడనే ఆయన ఎక్కివచ్చిన ఏనుగు సైతమూ ఆ వరుసలోనికి తీసికొనిపోబడినది. "ఇప్పుడు ఎవరిభాగాలు వాళ్ళు తీసికొండి" అన్నారు మంత్రిగారు. మొదటివాడు పది ఏనుగులు, రెండవవాడు ఐదు, మూడవవాడు నాలుగు తీసికొన్నారు. అందరూ మంత్రిగారి యుక్తికి ఆశ్చర్యపోతుంటే ఆయన ఎక్కివచ్చిన ఏనుగుపై తిరిగీ ఎక్కి నవ్వుకొంటూ వెళ్ళిపోయారు. ★



నెల్లూరు టౌన్‌హాల్

ఫోటో: సి. సుబ్బారెడ్డి—నెల్లూరు.

ఒక బ్రాహ్మడిభార్య మహాగయ్యాళిది. ఆవిడ రోజూ ఉదయాన్నే లేచి, ఆ పిమ్మట ఒక కొరడాపుచ్చుకుని భర్తను పాతికసార్లు వీపుమీద కొడుతూ వుండేది.

ఒక రోజు ఏదో పనిమీద బ్రాహ్మడు పొరుగూరికి వెళ్లాడు. తిరిగి పదిరోజులవరకు రాడు. ఈ పది రోజులూ బ్రాహ్మడిభార్య కొరడా ఏమేట్లో కలిసిపోను? పాపం, ఆవిడ చేతులు ఆవురావురు మన్నాయి. ఇక వుండబట్టలేక ఆమె, ఇంటివాకిట వున్న జువ్విచెట్టుమీద ఆ పది రోజులూ తన కొరడా ప్రయోగించింది.

ఆ జువ్విచెట్టును ఆవహించి ఒక బ్రహ్మరాక్షసి వున్నది. రోజూ బ్రాహ్మడిభార్య కొట్టే కొరడాదెబ్బలను ఆ బ్రహ్మరాక్షసి భరించలేకపోయింది. మరి భరించక ఏంచెయ్యగలదు? ఎలాగో పదిరోజులు ఉగ్గబట్టుకుంది. పదకొండో రోజు బ్రాహ్మడు తిరిగివచ్చాడు. మళ్లీ కొరడా యథాప్రకారం బ్రాహ్మడి వైపుకు పోయింది.

జువ్విచెట్టుమీది బ్రహ్మరాక్షసికి బ్రాహ్మడిమీద జాలికలిగింది. పది రోజులభాగ్యానికే తనపని ఉక్కిరిబిక్కిరి అయిపోయిందే, ఇన్నేళ్ళనుంచీ ఈ వెర్రిబ్రాహ్మడెలాగ భరిస్తున్నాడో ఆ దెబ్బల్ని! అనుకుంది. ఎలాగేనా సరే ఈ బ్రాహ్మణ్ణి ఆ గయ్యాళి బారినుండి తప్పించి పుణ్యం కట్టుకోవాలనుకున్నది.

ఒకరోజు బ్రాహ్మడు జువ్విచెట్టు కింద కూర్చుని సంధ్యవార్చుకుంటున్నాడు. అదిచూచి బ్రహ్మరాక్షసి అదృశ్యరూపంలో చెట్టు దిగివచ్చి బ్రాహ్మడి పక్క నిల్చుని చెవిదగ్గర గొణిగింది.

బ్రాహ్మడు "ఎవరూ?" అని అడిగాడు.

బ్రహ్మరాక్షసి తిరిగిగొణిగింది. "నేనయ్యా! ఈ చెట్టు మీద వుంటున్న బ్రహ్మరాక్షసిని" అంది.

పట్రాతుల రామచంద్రయ్య

బ్రాహ్మడికి గుండె లవిసిపోయినయ్.

"అంతగా భయపడతా వెందుకయ్యా బ్రాహ్మడా! నిన్నేం చెయ్యనులే. పైగా నీకు చేతనైన ఉపకారం చేద్దామనే వచ్చాను." అంటూ బ్రహ్మరాక్షసి బ్రాహ్మడికి తన ఉద్దేశ్యం వివరించి "ఈ గయ్యాళి భార్యతో ఇంకా ఎన్నాళ్ళని అవస్థ పడగలవు? మనిద్దరం ఒక్కక్షణం కూడా ఇక్కడ వుండొద్దు. రా, ఎక్కడికేనా పోయి సుఖంగావుందాం" అని చెప్పింది.

బ్రాహ్మడికి చాలా ఆనందమయింది. "నువ్వుచెప్పేది మంచిదే. నేనూ "ఎన్నాళ్లకురా భగవంతుడా ఈ కాళికాంబ పీడ విరగడ కావటం?" అనే తలపోస్తున్నాను. కాని ఇంకోచోటుకు లేచిపోయినా మనం బ్రతికే దెలా?" అన్నాడు.

"ఓయి పిచ్చిబ్రాహ్మడా! ఈ పీడ విరగడకావాలేగాని, ఇంకో చోట బ్రతకడమనే దొక ప్రశ్నా? అయినా అందుక్కూడా పథకం వేసే ఉంచానులే. విను. నేను వారం రోజులు ముందుగా పోయి రాజుగారి కుమార్తెకు పడతాను. పట్టినదాన్ని, వెయ్యిమంది మాంత్రికులు వచ్చినా జవాబు చెప్పక నానా గోలా చేస్తాను. ఆ తర్వాత నువ్వువచ్చి ఆమె చెవిలో "జువ్విచెట్టు బ్రాహ్మణ్ణి" అని గొణుగు. వెంటనే విడిచి పోతాను. ఇక తరువాత చూచుకో నీ పని; రాజుకూతురూ, రాజ్యమూ!" అంది బ్రహ్మరాక్షసి.

బ్రాహ్మడు ఎగిరి గంతేసి వొప్పుకున్నాడు.

వాళ్లు వేసుకున్న పథకం ప్రకారమే బ్రహ్మరాక్షసి పోయి రాజకుమార్తెకు ఆవేశించింది. కొమ్ములు తిరిగిన మాంత్రికు లెందరో వచ్చి చూశారు. లాభంలేదు. వారం రోజుల పిమ్మట బ్రాహ్మడు వెళ్ళి రాజకుమార్తె చెవిలో "జువ్విచెట్టు బ్రాహ్మణ్ణి" అని గొణిగాడు. రాజకుమార్తెకు పట్టిన రాక్షసి విడిచి పోయింది.

పోతూ పోతూ బ్రహ్మరాక్షసి బ్రాహ్మడికో హెచ్చరిక చేసి పోయింది: "నేను వెళ్ళి ప్రక్క రాజ్యంలోని రాజకుమార్తెకు పడతాను. నువ్వక్కడికి రాకూడదు.

★ రాజయినవాడు ★

ఇక్కడ విడిపించినట్లే అక్కడా విడిపించవచ్చనుకుని వస్తేవా-జాగ్రత్త!" అని చెప్పిపోయింది.

బ్రాహ్మడు రాజుగారి అల్లుడయ్యాడు. రాజుగారికి మగసంతతి లేనందున, రాజ్యభారం అల్లుడికి వప్పజెప్పి విశ్రాంతి తీసుకుంటున్నాడు.

చెప్పినట్లే బ్రహ్మరాక్షసి పొరుగు రాజ్యంలో రాజకుమార్తెకు పట్టింది. అయితే ఆ రాజుగారు ఇతర మాంత్రికుల నెవ్వరినీ పిలిపించలేదు; బ్రాహ్మడినిగురించి ఈవరకే విని వున్నందువల్ల. అంచేత ఆయన విశ్రాంతి తీసుకుంటున్న రాజుగారికి కబురుచేశాడు: "శ్రమ అనుకోనక మీ అల్లుణ్ణి ఒకసారి పంపించండి" అని.

బ్రాహ్మడికి పచ్చివెలక్కాయ గొంతులో పడ్డట్లయింది. ఆ రాజుగారు కబురుచేశాడు; ఇక్కడ మామగారుకూడా, వెళ్ళి బాగుచేసి రమ్మంటున్నాడు. అలాగని వెడదామంటేనా, బ్రహ్మరాక్షసి పెట్టిన షరతు! వెళ్లకుంటేనా, అటు రాజుగారితో, ఇటు మామగారితోనూ నిష్ఠూరమే! "ఎలాగూ ఇది చావుకే వచ్చింది. అంతగా ఐతే ఆ బ్రహ్మరాక్షసి చేతిలోనే చద్దాం" అనుకుని బ్రాహ్మడు పొరుగు రాజ్యానికి బయలుదేరాడు, రాజలాంఛనాలతో.

ఆ రాజుగారు బ్రాహ్మణ్ణి చాలా ఘనంగా మర్యాదచేశాడు. రాజకుమార్తెకుపట్టిన బ్రహ్మరాక్షసి గదిలో బుసలుకొడుతోంది. "అంత వుపకారంచేసి, ఇక్కడికి రావొద్దని షరతుపెట్టినక్తే, ఆ విశ్వాసమైనా లేకుండా ఆ బటాచోర బ్రాహ్మడిలా తెగించి వస్తాడా! రానీ వాణ్ణి మింగేస్తాను" అనుకుంది.

రాబోయే పరిస్థితిని ముందే వూహించిన బ్రాహ్మడు రాజుగారితో చెప్పి రాజకుమార్తెను ఇనుప గొలుసుల్తో కట్టివేయించి, ఆగదిలో మరెవ్వర్నీ వుండొద్దనిచెప్పి తను వొక్కడూ గదిలోకి వెళ్లాడు.

"రా, నీచుడా నిన్నేంచేస్తానో!" అని హుంకరించింది బ్రహ్మరాక్షసి. బ్రాహ్మడు దగ్గరికి వెడుతూ,

"శాంతించు. నేను చెప్పేదంతా కాస్త శాంతంగా విను. తర్వాత నీ యిష్టంవచ్చినట్టు చేసుకోవచ్చు" అన్నాడు.

బ్రహ్మరాక్షసి కొంచెం చల్లబడింది. "ఏమిటది?" అని ప్రశ్నించింది.

బ్రాహ్మడికి కొంచెం స్థిమితం కలిగింది. దగ్గరకుపోయి, మెల్లగా "—మరేంలేదు. ఆ గయ్యాళి వున్నదే, నా మునుపటి భార్య, మనిద్దరికోసం దేశదేశాలూ గాలించి, ఎలాగైతేనేం మన వునికి కనిపెట్టింది. మనం పారిపోయి వచ్చింది మొదలు నేటివరకూ ఎన్ని కొరడా దెబ్బలు తప్పించుకున్నామో, అన్ని దెబ్బలకు వందరెట్లు మనిద్దర్నీ మోగించేందుకు, అది కొరడాలను బండిమీద వేసుకు వస్తోందిట. ఇక నీవు ఇక్కడే వుండి ఆ దెబ్బలే తింటావో, ప్రాణం కాపాడుకుంటావో—నీ యిష్టం. చెప్పవలసింది చెప్పాను" అన్నాడు.

బ్రహ్మరాక్షసి గజగజా వణికిపోయింది. తన కావర్తమానంచెప్పి రక్షించినందుకు బ్రాహ్మడి కొక నమస్కారం చేసి, తిరిగి వెనక్కి చూడకుండా పారిపోయింది.

ఇప్పుడు బ్రాహ్మడు ఇద్దరు రాజకుమార్తెలకూ, రెండు రాజ్యాలకూ భర్త! ★

ఆ ఘడియ రావాలి

(12-వ పేజీ తరువాయి)

కోటలు నేలమట్టమయినయ్. ఆ అమ్మాయి కూడా దానితో మట్టిలో కలిసిపోయింది.

భార: (అదిరిపడి) అంటే?!

యువ: అంటే ఆత్మహత్య చేసుకుంది.

రామ: ప్రకాశం గారూ! ఏమిటిదంతా? మీరు చెప్పేది.

యువ: క్షమించండి రామనాథంగారూ! నేను మీరు అనుకునే ప్రకాశాన్ని కాదు. సి. ఐ. డి. ఇనస్పెక్టర్ని.

రామ, భార, సం } ఆఁ!

యువ: సంధ్యా దేవిగారూ! భారతమ్మగారూ! మీరిద్దరూ నన్ను క్షమించాలి. మీ అబ్బాయి యిప్పుడు అరెస్టు వారెంట్‌లో ఉన్నాడు. అతన్ని పట్టుకోవటానికి మాకతని ఫోటో కావాల్సి వచ్చింది. అందుకే మీయింటికి వచ్చాను. అదృష్టవశాత్తు నాపని తేలికగా అయిపోయింది. మీ అల్లుని-అదే కాబోయే అల్లుని-పుణ్యాన.

[టెలిగ్రాం! సార్! టెలిగ్రాంఅని కేక]

సం: చూడు నాన్నా! టెలిగ్రామేదో వచ్చింది.

(ఒకక్షణం నిశ్శబ్దం)

రామ: (చించి చదువుకుంటాడు)

భార: ఏమిటండీ అది: మాట్లాడరేం? (గాద్గదికంగా)

సం: ఎక్కడనుండి నాన్నా అది?

భార: మాట్లాడరేమండీ! అలా చూస్తారే? అమ్మాయ్! నువ్వన్నా చూడవే అదేమిటో!

సం: ఇలాయియ్ నాన్నా (చదవుకుంటుంది)

భాః: ఏమిటి అది చెప్పూ మాట్లాడవేమీ?

సం: అన్నయ్య వస్తున్నాడే.

భార: ఎప్పుడూ? ఎక్కడినుండీ?

సం: రాత్రి మెయిల్‌కు వస్తాడుట. కాకినాడనుండి వచ్చింది టెలిగ్రాం.

యువ: మైగాడ్! అయితే కాకినాడలోనే ఉన్నాడా భాస్కరం! చిలక చిక్కింది రామనాథంగారూ ఇక నేను...

[టెలిఫోన్ గణగణమని మోగుతుంది]

రామ: ఆ! ... యస్ ... రామనాథం గారే మాట్లాడేది... పోలీస్ సేషన్ నుండా మీరు మాట్లాడేది... ఎవరు కావాలీ?... ఇన్‌స్పెక్టర్ ప్రభాకరంగారా?...ఉన్నారు.

ఇనస్పెక్టరుగారూ! మీకేకదూ ప్రభాకరం అంటే.

యువ : అవును!

రామ: మిమ్మల్ని పిలుస్తున్నారు పోలీస్ స్టేషన్ నుండి.

యువ. (రిసీవరు అందుకొని) యస్... నే నేనండీ...ఇన్‌స్పెక్టర్ ప్రభాకరాన్ని... ఎవరూ?...ఓ! మీరా! ...రంగారావుగారా... ఆఁ!... ఆ!...మనం పొరపడ్డాం అంటారా... ఇప్పుడే వస్తున్నాను.

(ఫోన్ డిస్కనెక్ట్ చేస్తాడు)

రామనాథంగారూ! ఎక్స్‌ట్రీమ్లీసారీ! మేము చాలా పొరపడ్డాం. నేరస్థుడు మీఅబ్బాయి కాదు...యస్. భాస్కరం అనే కుర్రాడు యింకొకడున్నాడుట. బెజవాడ నేటివ్. అతనేవచ్చి పోలీస్‌స్టేషన్లో నేరం ఒప్పుకున్నాడుట. మిమ్మల్ని చాలా కష్టపెట్టాను. భారతమ్మగారూ! సంధ్యాదేవిగారూ! క్షమించాలి మీరు కూడా.

భార: (కళ్లుతుడుచుకుంటూ) దానిదేముందిలే నాయనా! ఎంతటి వాళ్ళకయినా పొరపాటనేది తప్పదు. చచ్చి బతికినట్లుంది. ఆ అబ్బాయి ఏమయ్యాడో అసలు వచ్చినట్లు లేదే?

యువ: ఎక్స్‌ప్రెస్ లేటయిందిలా ఉంది సంధ్యాదేవిగారూ! విష్ యు గుడ్ లక్. రామనాథంగారూ ఇక వస్తాను.

(యువకుని నిష్క్రమణ సిమ్మాద్రి ప్రవేశం)

సిమ్మా: బాబుగోరూ! ఇందాకొచ్చినోయన ఈ సీటీ ఇచ్చిపోయిండు...సూడండి.

రామ: (చదువుకుని) అయ్యో! ఎంత పని జరిగిందీ! ఆ అబ్బాయి రావటమూ అయింది పోవటమూ అయింది.

భార: అయ్యో! అదెప్పుడండీ.

సిమ్మా: మరిగయితే వరండాలో కూర్చున్నబ్బాయి గోర్దా, బాబూ అల్లుడుగోరూ?

రామ: అవున్రా అతనే 'మీ సాంప్రదాయం బాగా తెలుసుకున్నాను...నీతికి నేను చాలా విలువనిస్తాను'—అని రాశాడు ఈ చీటిలో.

సం: ఎంతసేపయింది సిమ్మాద్రీ ఆ అబ్బాయి వెళ్ళి.

సిమ్మా: ఎంతోసేపు లేదు సిన్నమ్మగోరూ! టెలిగరేం వచ్చే ముందు.

సం: ఫోన్ కాల్ వచ్చేదాకా ఉంటే సరిపోయేది.

రామ: కాలం విలువ అదే మరి! ఒక్కక్షణం జీవితగమనాన్ని ... జీవిత గతులనీ మార్చగలదు. ఒక్క క్షణంలో ఓడలు బళ్లూ, బళ్లు ఓడలూ అవుతయ్. ఫోన్ కాల్ వచ్చేదాకా ఉంటే శుభ్రంగా పెళ్ళి చూపులయిపోయేవి. సంబంధం కుదిరేది కూడాను.

సిమ్మా: ఎంత పొరపాటు జరిగిందమ్మగోరూ! ఆయినప్పైటేను సూసి...ఆసూటూ బూటూ, కళ్లద్దాలూ...సూసి ఆకే అల్లుడుగోరనుకుండా గదండీ సీ! ఎదవబతుకు నా నేటికీ! మీబోటి మారాజులలో గిల్లలో ఉంటమేటీ! ఉత్త తెలివితక్కువవాణ్ణమ్మని.

భార: ఎందుకు సిమ్మాద్రీ, నిన్ను నీవు తిట్టుకుంటావ్? మన చేతిలో ఏముంది చెప్పు. ఎక్కడ రాసిపెట్టి ఉందో అంతా దైవలిఖితంగదా. ఏక్కడో పుట్టి పెరుగుతుంటాడు గాని పుట్టకుండా ఉండడు గదా! మనం ఎంత ఘట్టి ప్రయత్నం చేస్తే మటుకు ఏం లాభం?—ఆఘడియరావాలి గాని!!

[ఫేడౌట్] ★

సినిమా

ఎవరికెవరూ తీసిపోరు

జనవరి 20 న జెమినీ స్టుడియో ఆవరణలో, జరిగిన సన్మానసభతో టాకీ రజతోత్సవాలు పరిసమాప్తమయ్యాయి. చలన-చిత్ర పరిశ్రమ తొలిరోజుల్లో చిత్రాలు నిర్మించి, సత్సంప్రదాయాలు నెలకొల్పి మార్గదర్శకులైన దర్శకనిర్మాతలకు, నటీనటులకు ఛాయా, శబ్దగ్రహణ ప్రవీణులకు, కళా, సంగీత దర్శకులకు డా॥ సి. పి. రామస్వామి అయ్యర్ రజతోత్సవ ప్రశంసాపత్రా లిచ్చి గౌరవించారు. మన ఆచార సంప్రదాయాలకు తత్వానికి అనుగుణమైన పద్ధతులలో, వాటిని గౌరవిస్తూ, సమకాలిక జీవితాన్ని సమస్యలను చిత్రించే కథలతో చిత్రాలు నిర్మించాలని డా॥ రామస్వామి అయ్యర్ హితవచనాలు చెప్పారు. చలన-చిత్రాలు వక్రమార్గాలుపట్టకుండా హద్దుల్లో ఉంచడానికి మించి, ప్రభుత్వం దీనితో ప్రమేయం పెట్టుకోవడం ఉభయత్రా మంచిదికాదనికూడా ఈ సందర్భంలో ఆయన చెప్పారు.

* * *

ఈ ఉత్సవాలు నిర్వహించిన దక్షిణ భారత ఫిలిం వాణిజ్యమండలివారు, ఆదరాబాదరాగానే ఏర్పాట్లు చేయవలసివచ్చింది. నిజానికి బొంబాయిలో ఫిలిం ఫెడరేషన్ పెద్దలే ఆదరాబాదరా ఏర్పాట్లుచేశారు. ఉత్సవాలు జరిగే ముహూర్తందాకా, జరిగేదీలేనిదీ గుట్టుగా ఉంచారు. ఈ వ్యవహారంలో "అనైక్యతా లక్షణం" దెబ్బతినకుండా ఉండగలందులకు చాలా విశమత్యంతో కృషిచేశారు. దానాదీనా బొంబాయిలో పండుగ చాలవరకు ఆదరాబాదరాగానేఏర్పాటైంది. కాగా, ముగ్గురు నలుగుర్ని మినహాయించి, నటీనటులు ఎవరూ పట్టరాని ఆనందోత్సాహాలతో ఆ ఉత్సవాలలో పాల్గొనబో లేదు. ఒకరినిచూచి ఒకరు గైరుహాజరయ్యారు. ఎటొచ్చి అక్కడ ఆఖరురోజున వినోదప్రదర్శనం జరిగింది. అక్కడకూడా చాలమంది తారలు గైరుహాజరవాలన్న సంగతి మర్చిపోయారుకొందరు.

* * *

ఇక్కడ మద్రాసు నటీనటులుకూడా ఇలాంటివిషయాలలో ఎవరికెవరూ తీసిపోరని ఋజువు చేశారు. ఇక్కడ పండుగ పేరుచెప్పి ఒక్క వినోదప్రదర్శనంలాటిది కూడా జరగలేదు.

ప్రదర్శనం అనతగ్గదల్లా, తొలిరోజునే సాగింది. మిడ్‌లాండ్ థియేటర్‌లో శ్రీమతి సేతుపార్వతీబాయి ప్రారంభోత్సవం జరిపిన తరువాత, పాతచిత్రాలలో భాగాలన్నిటినీ కలిపి ఒకసారి ప్రదర్శించి నాటినుండి నేటికి సాగిన యాత్రను చూపించారు.

ఫిలిం చేంబరు సంయుక్త కార్యదర్శి, దర్శకనిర్మాత అయిన శ్రీ పి. రామకృష్ణ 1934 నుండి 1956 వరకూ (అతఃపూర్వం చిత్రాల ప్రతులు లభ్యంకాలేదు) తయారైన చిత్రాలలో, ఆయా సంవత్సరాలకు స్థూలంగా ప్రాతినిధ్యం వహించేవాటిని మండలిసభ్యులతో కలసి ఏరారు. అనంతరం రెండు మూడురోజుల వ్యవధిలో, వాటి నుండి కొన్ని భాగాలను తీసుకొని ఎడిట్ చేసి మూడురీళ్ళ చిత్రంగా రూపొందించారు. అందులో ప్రదర్శితంఅయినచిత్రాలు: భామా విజయం (త-1934), హరిశ్చంద్ర, నవీన సారంగధర, మధురైవీరన్ (త-1935), పట్టినత్తార్ (1936), మనోన్మణి 1937,

(53-వ పేజీ చూడండి)



"సతీ అనసూయ" చిత్రంలో సుమిత్రా దేవి.

చిత్రసమీక్ష:

అన్నపూర్ణవారి తోడికోడళ్లు

శరత్ చంద్ర చటర్జీ పుస్తకాలు పాతిక వరకూ ఏకబిగిన చదివేసిన ఒక లాయరు గారిని అభిప్రాయం అడిగాడాయన మిత్రుడు.

"ఏముంది. బండెడు పాదధూళీ కుండెడు కన్నీళ్లూ" అన్నాడు లాయరుగారు టూకీగా.

టూకీగా శరత్ కథ 'నిష్కృతి'ని తెనిగించి, తెరమీదికెక్కించడంలో, "తోడికోడళ్ళు" (అన్నపూర్ణా పిక్చర్స్) చిత్ర నిర్మాత మధుసూదనరావు, దర్శకుడు ఆదుర్తి సుబ్బారావు, రచయిత ఆత్రేయ కలసి, కథలో సారాన్ని మటుకు పరిగ్రహించి, బండెడు పాదధూళి మీదా కుండెడు కన్నీళ్ళు గుమ్మరించేసి, ఇందులో బెంగాలీ ధూళి చెలరేగకుండా సర్దుబాటు చేసివేశారు. (అందువల్ల బెంగాలీ కథ గురించిన బెంగ అనవసరం.)

ఆపైన, పని తెలిసిన దర్శకుడూ, మితి తెలిసిన నటులూ కలసి ఒక మంచి తెలుగు చిత్రాన్ని తయారు చేశారు. ఇది ఎక్కడా విసుగెత్తకుండా కులాసాగా గంటకి గంటన్నర వేగంతో సాగిపోయి మూడు గంటల పొడుగు చిత్రం రెండు గంటల్లో పూర్తి అయినట్లనిపిస్తుంది.

మతి మరుపు కుటుంబరావుగారు అనే ప్లీడరాయన డబ్బు గట్టా బాగా గడించాడు. అదే ప్రయోజకత్వం అదే పరమార్థం సర్వస్వం అని నమ్మినవాడు ఎం. ఎం. కుటుంబరావు. కక్కుర్తీ దురాశా లేకపోయినా మొత్తానికి డబ్బు మనిషి. ఆయన భార్య అన్నపూర్ణమ్మగారు జబ్బు మనిషి. కృష్ణా రామా అనుకుంటూ, ఇంట్లో పిల్లల్ని ఆడిస్తూ కాలక్షేపం చేసేది. ఇల్లు చక్కబెట్టే భారం అంతా "మాయింటి మాలక్ష్మి" సుశీలకే ఒప్పగించారు దంపతులు. ఈ మా లక్ష్మి పదేళ్ళనాడు వారింట కాలు పెట్టాకనే, ఇంటిని సిరివరించింది. అందుకని వారికి ఆమెమీద గురి. లాయరుగారి పినతండ్రి కొడుకు సత్యానికి ఆమె నిచ్చి పెళ్ళి చేశారు. సత్యం మంచి మనసువాడు. కొన్నాళ్ళవరకూ సిగరెట్లూ అవీ కాలుస్తూ "కారులో షికారుచేసే నారి"మీదా, ఆ 'పాలబుగ్గలచాన' కట్టిన "చీర నేసిన వారి" మీదా కూడా కలిపి కవిత్వం చెప్పే స్థితిలో ఉన్నా క్రమక్రమంగా, లోకంలో అన్యాయాలను చూస్తూ అడుగడుక్కీ ఆశ్చర్యపడుతూ బాధపడుతూ చివరకు కష్టజీవులమధ్య నిలచి వారిని ఆదుకున్నంత మంచివాడు. ఐతే, అతడి ఈ యాత్రకి కారణం ఇచ్ఛాపూర్వకమైన సంకల్పం కాదు; వాళ్ళింటికి అనసూయ రావడం.

అనసూయ భర్త రమణయ్య, లాయరు కుటుంబరావుగారికి స్వయానా తమ్ముడు. పేకాటా, పెళ్ళాంమాటా యీ రమణయ్యకి జవదాటరానివి. వాళ్లి ఒక్కగానొక్క బిడ్డడు అల్లరిమొద్దుగా పెరిగినవాడు. ఈ ఇస్తోకుపాడి పల్లెనుండి పట్నం వచ్చినప్పటినుండీ సమష్టి కుటుంబంలో కలతలు ఆరంభం అయ్యాయి. అనసూయ దుర్గుణవతి. ఆవిడ ఇంట్లో నూటిపోటీమాటలు పితూరీలూ మొదలెట్టుతుంది. తత్ఫలితంగా "డబ్బుగడించి ప్రయోజకుడు" కాలేకపోయిన సత్యం ఇల్లువదలి వెళ్ళవలసివస్తుంది. అన్నగారి ఆజ్ఞప్రకారం, పల్లెకు వెళ్ళి అక్కడ బంజరుగా పడివున్న మెరక పొలాన్ని కష్టపడి సాగుచేస్తాడు. అక్కడి కష్టజీవులనూ ఆదుకొంటాడు.

పట్నంలో కుటుంబరావుకీ అన్నపూర్ణకీ కన్ను మరగేసి డబ్బు దొంగిలిస్తున్న అనసూయ కన్ను మరగేసి దుర్మార్గాన చెలరేగ సాగిన రమణయ్య, మిల్లుమానేజరు వైకుంఠాల అవసరాలు పట్నంలో ఇనప్పెట్టి దగ్గిర్నించి చివరికి పల్లెలో పొలం మీదికి తిరుగుతాయి.




పేకాటా, పెళ్లాంమాటా

"సిస్టర్! నో ఫియర్స్" మిస్టర్! నో టియర్స్

నాదే నిష్కృతి... నాకే నిష్కృతి...

ఆవేళకి తగవు పెరిగి, దున్నేవాడిదే పొలంఅన్న నినాదం దాకా, దాని మీదనుంచి హైకోర్టు దాకా వెళ్తుంది కథ.

హైకోర్టు వారు దీన్ని పరిష్కరించడం ఎందుకన్నట్టు లాయరు కుటుంబరావే, తన స్వతస్సిద్ధమైన బేఖాతరీ తరహాలో, మతి మరుపు తనంతో, సాగుచేసుకోండి పొండి అని వివాదాస్పద భూమిని మంజూరు చేసేస్తాడు. ఆ నినాదం, ఆ సమస్య అక్కడితో వదిలివేశారు. దుష్టులెవరో శిష్టులెవరో తెలుసుకున్న కుటుంబరావు, శిష్టుల కష్టాలకీ, తన మతిమరుపుతనమూ, నిర్లక్ష్యం కారణమని గ్రహించి, ఆ మంచి వాళ్ళకి తన ఆస్తిని రాసిచ్చి నిష్కృతి చేసుకుంటాడు. మంచి వాడైన సత్యం అతని భార్య సుశీ ముస్తాబై జటకా ఎక్కి ఝూం మని పట్నం వచ్చేస్తారు. జంకూ గొంకూ లేకుండా (సిస్టర్!



వెంకటేశ్వరా ఫిలిమ్స్‌వారి "కన్నకడుపు"లో జమీందారు నారాయణరావుగా మిక్కిలినేని, భార్యగా విద్యావతి, చదలవాడ, కుటుంబరావు, కోటీశ్వరరావు.

గ్లోఫియర్స్) దుర్మార్గపు పనులు చేసి, అందర్నీ అవస్థపెట్టిన విలన్ వైకుంఠం చివరకి, కంటనీరు పెట్టాల్సిన అవసరంకూడా లేకుండా టూకీగా తనకితనే చెంపలేసుకుని దాసుడితప్పులు దండంతో సరిపెడతాడు.

ఇదీ కథ. ఇందులో హాస్యం, చక్కని నృత్యాలూ, మనసుకు హత్తుకునే సన్నివేశాలూ పొందుపరచి దీన్ని హుషారుగా నడిపారు.

ఈ హుషారుకి సగంబలం, కుటుంబరావుగా నటించిన రంగారావు సామర్థ్యం. చాలా రోజులతరవాత, ఈచిత్రంలో రంగారావుకు నటించడానికీ, ప్రేక్షకులనుచూచి ఆనందించడానికీ సజీవమైన ఆహ్లాదకరమైనభూమికరూపొందింది. దీన్ని ఇంతచక్కగా తీర్చిదిద్దినందుకు దర్శకనిర్మాతలూ, నటుడూగూడా అభినందనీయులు. ఆత్రేయవ్రాసిన మాటలు, దీనికి అన్నివిధాలా తగినస్థాయిలో, చైతన్యంతో ఒప్పాయి. హుషారుగా సాగాయి. "ఇది" అనే పదంమీద ఆత్రేయ విన్యాసాలు మొదట్లో 'కొంతఇది'గానే ఉన్నా [illegible], 'ఇది'' అనిపించి పోను పోను "పూరీ 'ఇది'"గా తయారయ్యాయి.

పాటలన్నీ బాగున్నాయి. వాటి వరసలు విన్నవారికి నోటికొచ్చేటంత తేలికగా, నేర్చుకోవాలనిపించేటంత అందంగా హాయిగా ఉన్నాయి. సుశీల, జిక్కి, ఘంటసాల మొదలగువారు ఈ పాటలు పాడారు. సంగీత దర్శకుడు వేణు. ఇవి కాక, ఇ. వి. సరోజ, [illegible] నృత్యం ఒకటి ప్రత్యేకం చెప్పుకోతగ్గది.

నటీ నటులు అందరూ ప్రతిభావంతులే. సుశీలగా సావిత్రి, అన్నపూర్ణగా కన్నాంబ, అనసూయగా సూర్యకాంతం, మిల్లు మేనేజరుగా జగ్గయ్య, రమణయ్యగా స్టార్ వాల్యూకు రెట్టింపు ప్రతిభగల రేలంగి, వడ్డీవ్యాపారస్థుడుగా చదలవాడ మొదలగువారంతా ఆయా పాత్రల అవస్థలమేరకు చక్కగా నటించారు.

ఉన్నవారిలో, ప్రత్యేకం ప్రశంసించతగ్గకృషి నాగేశ్వరరావుది. అతడు నటించిన సత్యంపాత్రకు సమగ్రమైన రూపకల్పన జరిగినట్టు కనబడదు. ఈపాత్ర గుణగణాలు, [illegible], మాటలు, ప్రవర్తన ఆద్యంతం పొసగలేదు. దీన్ని భూసంస్కరణల సమస్యతో జోడించి, దానిని అయోమయంచేసి వదిలివేయడంవల్లా, పరిస్థితుల మూలంగా పల్లెటూరువచ్చి, పరిస్థితులు అనుకూలించగానే మళ్ళీ మామూలుగా పట్నం వెళ్ళిపోయినట్టు చూపించడంవల్లా ఈ పాత్రకు ఆపాదించిన నిజాయితీ కొంత దెబ్బతిన్నట్టు కనబడుతుంది. ఈ లోపం కొట్టొచ్చినట్టు కనబడకుండా, నమ్మతగినంత చక్కగా నాగేశ్వరరావు ఈ భూమికను పోషించడానికి ప్రయత్నించి మంచి ఫలితాలు సాధించాడు. కొంత బాగారూపొందించిన భూమిక ఉన్నప్పుడు, సమర్థుడైన నటుడు దానిని నిర్వహించినప్పుడూ మాత్రమే ఎవరికైనా ఈ అంశాలు చర్చనీయాలు అవుతాయి. లేకపోతే రోజూ వినబడే నినాదాలలాగా వీటినీ పట్టించుకోకుండా వదిలివేయవచ్చు.

ఎందుకైనా, నినాదించేముందు కొత్త నిదానించి మరీ అంశాలు పూనుకోవడం వాంఛనీయం. ★

స్త్రీ మతిగా శ్రీమతి భానుమతి

భోగిపండుగనాడు

భానుమతి లేతాకు పచ్చచీర ధరించి, భరణీ స్టుడియోలో ఆకుపచ్చని పచ్చిక తివాసీమీద మెల్లిగా పచార్లు చేస్తూ, కొంచెం దూరాన వాళ్ళ అబ్బాయి భరణి, అతగాడి నేస్తాలు ఆడుతున్న క్రికెట్ చూస్తూంది. కాల్‌షీట్ అయిపోయిందా? మొదలు కాలేదా? అసలివాళ్టికి ఆటవిడుపా? ఉంటే ఏచిత్రానికి? ఈ నాలుగింటిలో ఏ ఒక్కటన్నా చాలు. ప్రత్యామ్నాయాలు ఇంతకు మించిలేవు.

"నే నిప్పుడు—ఈ నిముషానికి భరణీ పిక్చర్స్ వారి "వరుడు కావలెను" లో నటిస్తున్నాను" అన్నదామె నవ్వుతూ. చుట్టుపక్కల ఏ చెట్టు మాటునా కెమెరాశాస్త్రి కనబడలేదు.

"ఇక్కడ కాదు. ఇండోర్ సెట్. స్టూడియోలో నే వాళ్ళు నన్నింకా పిలవలేదు. పిల్చేదాకా రెస్టు" అన్నది భానుమతి.

తరువాత, కబుర్లలో సంక్రాంతి ప్రస్తావనకి వచ్చింది. ఒక్కసారిగా భానుమతి కంఠంస్థాయి ఉత్సాహంతో రెట్టింపయింది.

"ఇట్టే వచ్చి ఇట్టే వెళ్ళినట్టయిపోయింది. అసలు పండగరాకముందే ఎంతో బావుటుంది వస్తూం దొస్తుందని ఎదురుచూడచ్చు" అందామె హుషారుగా.

మన సంప్రదాయాలు ఆచారాలు (చాదస్తాలు మినహా) పాటించే నాగరికులలో భానుమతిది అగ్రస్థానం.

భోగి, సంక్రాంతి, దసరా, బొమ్మల కొలువులూ, పేరంటాలూ అంటే పంచప్రాణాలూను.

పండగ రెండ్రోజులూ ఆమె కాల్‌షీట్లకి సెలవిచ్చేసింది. తెల్లారితే భోగి అనగా, వాళ్ళ ఇల్లంతా సరంభంతో నిండిపోయింది.

తెల్లారగట్టే లేచి తలంట్లు. తెల్లారేలోగా గుమ్మంలో ముగ్గులు పెట్టడం తరువాత బొమ్మల కొలువూ భోగిపళ్ళూ...

తెల్లవారుఝామున మూడుగంటలకి ఇంట్లో అందర్నీ నిద్రలేపింది భానుమతి. తలంట్లకి ఏర్పాట్లు జరిగేలోగా చలిమంట వేశారు పిల్లా జల్లా అంతా.

"కాని, చిక్కొక్కడంటే చలెయ్యదు గదా" అంది భానుమతి.

అందుకని, చలిచాల నందువల్ల చలిమంట ఉండాల్సినంత ఉత్సాహకరంగా లేక పోయింది. పైగా ఉక్కపోసింది కూడాను.


"భలే దానివే. ఇందుకేనా పొద్దున్నే లేపావు" అన్నారు పిల్లలు.

"అబ్బే ఇందుకే కాదులే. తలంటి పోసుకుంటారని"

తెలతెలవారుతో ఉండగా, తెల్లటి వెలుతురులో భానుమతి, ఆమె చెల్లెలూ, గుమ్మంలో పెద్ద పెద్దముగ్గులు తీర్చిదిద్దారు.

"వెయ్యిదీపాల కళవచ్చింది ఆముగ్గులతో మా యింటికి" అంది భానుమతి నాలుగు రోజులనాటి ఆఉదయాన్ని గుర్తుకు తెచ్చుకుంటూ.

ఆవేళ సాయంత్రం మా అబ్బాయి భరణికి చక్కగా భోగిపళ్లుపోశాం కూడా అందామె.



1956 లో విడుదల అయిన చిత్రాలలో న్యూయార్క్ టైమ్స్ ఉత్తమశ్రేణివిగా ఎన్నికచేసిన పదింటిలో ఒక చిత్రం "అరౌండ్ ది వరల్డ్ ఇన్ 80 డేస్" (80 రోజులలో భూప్రదక్షిణం). ప్రఖ్యాత ఫ్రెంచి రచయిత జూల్స్‌వర్న్ నవల ఆధారంగా మైకెల్-టాడ్ నిర్మించిన ఈ చిత్రంలో డేవిడ్ నివెన్ ముఖ్యపాత్ర నిర్వహించాడు.

కాని, ఆ అబ్బాయి ఈ ఐడియా విని ఆహ్లాదంగా ఉండన లేదు. ఏతేసేం ఎవరిముచ్చటవాళ్లది. అందుకని ఒప్పుకున్నాడు చివరికి. "నీకు సరిగా ఐదు నిముషాల టైమిస్తాను. ఏం చెయ్యాలో చెప్పు" అన్నాడు గడియారం చూసు కుంటూ.

భానుమతి, ఆ అబ్బాయిని కుర్చీలో కూర్చోపెట్టి, భోగిపళ్ళుపోసి, హారతిచ్చింది, చెల్లెలు పిల్లల్తోపాటు.

"నీముచ్చట మరీ బావుంది. నువ్వూ నీసర దాలూనూ అన్నారు వారు అవన్నిచూసి. మొత్తానికి సంక్రాంతి పండగ హుషారుగా, తెలుగు దేశంలో అందరిలాగా మేమూ చేసు కున్నాం" అంది భానుమతి సగర్వంగా సంతోషంగా.

అంతలోకీ సెట్ మీదకు రమ్మని పిలుపు వచ్చింది దర్శకుడు రామకృష్ణ వద్దనుంచి.

'మతిపోయిన సి/బి మతి'

సరిగ్గా అది పదినిమిషాల పని.

మధ్యాహ్నం షూట్ చేసిన ఒకసన్నివేశం తాలూకు చివరి అంకం అప్పుడు పూర్తి చేశారు.

ఆడపిల్లల హాస్టల్ భవనముందు దీపాల వేళ టాక్సీఒకటి ఆగిఉంది. డ్రైవరు మెట్ల మీద ఒకపక్క కూర్చుని, అరోజు బేరాలు బేరీజు వేసుకుంటున్నాడు.

లోపల్నించి, భానుమతి (వేషం పేరు కూడా అదే) గబాగబా వచ్చేస్తోంది. వెన కాలే, "ది మోస్ట్ బ్రిలియంట్ స్టూడెంట్" మిస్టర్ బైరాగి ఆదరాబాదరా వచ్చేస్తు న్నాడు.

ఈ హాస్టల్లో ఈభానుమతికాక చంద్ర మతి అనే ఇంకొకపిల్ల ఉంది. ఈఇద్దరూ కవల పిల్లలు (ట).

నిజానికిద్దరిలోను ఒక "మతే" ఇక్కడ ఉంది. అయినా ఆవిడ అవసరాన్నిబట్టి ఇద్దరు "మతు"లు గానూ క్షణానికో రకాన నటించి కమ్ముకవచ్చేసరికి ఎప్పటికప్పుడు మతిపోయినంతపని అవుతోంది.

బి. మతిని బైరాగి ప్రేమిం చా డు. సీ. మతి ఇంకో ఆనందకుమారస్వామి అనే ప్రొఫెసర్ని ప్రేమించింది.

ఇపుడు ఈ శ్రీమతి, సీ. మతి (చంద్ర మతి) భూమికలో ప్రియుడిని చూడబోయే వేళకు బి. మతికోసం బైరాగివచ్చేశాడు. అతనికీ సీ. బీ మతులిద్దరూ ఒకయువతే తప్ప ఇద్దరుకాదని అనుమానం—అయినా తేల్చుకో లేదు. ఈస్థితిలో మతిపోయిన అతగాడికి, సి. మతి టోకరాఇచ్చి, గుమ్మంలోఉన్న టాక్సీఎక్కి ఉడాయించింది.

ఎవరికెవరూ తీసిపోరు

(49-వ పేజీ తరువాయి)

శకుంతల (త-1938), వల్లి 1939, నాం ఇరు వర్ 1942, భక్తపోతన 1943, స్వర్గసీమ 1946, లైలామజ్నూ (తె) 1948, చండీ రాణి (హిందీ), షావుకారు, ప్రసన్న (1950) అవ్వయ్యార్ (త) దేవదాసు (తె) - 1953, కనవనే కణ్ కండదైవం 1954, మధురైవీరన్, ఆలీబాబా 40 మంది దొంగలు (వర్ణచిత్రం)- 1955, దేవత (హిందీ) 1956.

బుధవారం సాయంత్రం దక్షిణ భారత ఫిలిం జర్నలిస్టుల సంఘంవారు తొలి ఫిలిం జర్నలిస్టులకు సన్మానం చేశారు. తొలి తెలుగు ఫిలిం జర్నలిస్టు పేరు ఈనాడు చాల మందికి తెలియకపోవచ్చు. ఆయన శ్రీ వడ్ల మన్నాటి కుటుంబరావు. 1933-34 లలో ఈయన మద్రాసులో ఉంటూ అప్పటి నటీ నటులతోనూ, దర్శకులతోనూ ఇంట ర్వ్యూలు జరిపి కృష్ణా పత్రికలో వ్యాసాలు వ్రాశారు. నాలుగేళ్లు ఈ రంగంలో ఉన్న తరువాత 1938 లో హెచ్. ఎం. రెడ్డిగారి 'రోహిణీ' సంస్థకు జనరల్ మానేజర్ అయ్యారు. 1951 నుండి 'భరణీ' జనరల్ మానేజరుగా ఉంటున్నారు. తరువాత, శ్రీయుతులు తాపీ ధర్మారావు, ఇంటూరి వెంకటేశ్వరరావుకూడా సన్మానం అందు కున్నారు. మొట్టమొదటి భారతీయ ఫిలిం జర్నలిస్టు శ్రీ ఎస్. కే. వాసగం. ఈయన దాదాసాహెబ్ ఫాల్కే మొదటి మూకీ చిత్రం నిర్మించినప్పుడే, హిందూస్థాన్ ఫిలిం కంపెనీ (ఫాల్కే స్వంత సంస్థ) నడిపిన 'మూవీమిరర్'కు సంపాదకులుగాపనిచేశారు. ప్రస్తుతం ఈయన దర్శకుడు. శ్రీ ఎ. వి. మెయ్యప్పన్ వీరికి ప్రశంసా పత్రాలిచ్చి గౌరవించారు.

జనవరి 16 నే మద్రాసు ఫిలిం ఫాన్స్ సంఘంవారు "ఎడిసన్ కథ", "చలన చిత్ర ప్రదర్శన విధానం" అనే రెండు హ్రస్వ చిత్రాలను ప్రదర్శించారు. ★



"ఏక్ ఝలక్"లో వైజయంతిమాల, ప్రదీప్ కుమార్.

ఈసన్నివేశంలో సీ. మతిగా శ్రీమతి భానుమతి, బైరాగిగా టి. ఆర్. రామచంద్రన్ నటించారు.

"ఫాబ్యులస్ సెన్యోరిటా" ఆధారంగా తెలుగు తమిళభాషలలో తయారవుతున్న ఈచిత్రానికి శ్రీ రామకృష్ణ దర్శకుడు. రచన రావూరు సత్యనారాయణ, కెమరా: వెంకట్. భానుమతి, జగ్గయ్య, అమర్ నాథ్, రామన్న పంతులు మొదలగు వారు పాల్గొంటున్నారు. ★

★ షిరిన్ ఫర్హాద్ ★

(ఆంధ్ర వారపత్రిక బొంబాయి విలేఖరి)

ఇటీవల బొంబాయిలో విడుదలయిన చిత్రాలలో చెప్పుకోతగ్గది షిరిన్ ఫర్హాద్.

ఆస్పి ఇరానీ నిర్మించిన "షిరిన్‌ఫర్హాద్" చిత్రంలో కథ, జగత్ప్రసిద్ధమైన, "లైలా మజ్నూ," "రోమియో అండ్ జూలియట్" శ్రేణిది. ప్రేయసీ ప్రియులుగా మధుబాల, ప్రదీప్ కుమార్ నటించారు. ఇతర ముఖ్య నటీనటులు అమితా, కైలాస్, కమల్, రామ్ అవతార్, ఉమాదత్, జగదీష్‌కమల్



"షిరిన్ ఫర్హాద్"లో ప్రదీప్ కుమార్.

ప్రభృతులు. స్క్రిప్టు, సంభాషణలూ హకీం లత్తా వ్రాశారు. పాటలు తన్వీర్ అన్వాక్ వ్రాశారు. సంగీత దర్శకుడు ఎస్. మొహిందర్. లతా, హేమంత్ కుమార్, తలత్, రఫీ, ఆశాభోస్లే పాటలుపాడారు. ఛాయాగ్రహణం దాలీ దారూవాలా.

దర్శక నిర్మాత అస్పి ఇరానీ, అసలు కథను తారుమారు చేయకుండా తర్జుమా దోషాలు తగలనీకుండా, అత్యంత ప్రతిభావంతంగా ఇందులో తీర్చి దిద్దారు. దీనికి అన్ని విధాలా అనువైన సంగీతం, సాహిత్యం, సెట్‌లు, నటీనటులూ అమరారు. అందువల్ల, అక్కడక్కడ సుదీర్ఘమైన సంభాషణలున్నా, ఏవీ ఎబ్బెట్టు అనిపించవు సరిగదా, కొన్ని కొన్ని సన్నివేశాలు హృదయాలను కదలించేటంత బలంతో రూపొందాయి. రమణీయమైన ప్రణయఘట్టాలతో ఆరంభమైన కథకు, దర్శకుడు అతిచాకచక్యంతో, సౌలభ్యం ఉట్టిపడేలాగ, కృత్రిమ లక్షణాలకు చోటివ్వకుండా, క్రమంగాబలం, జవంచేకూర్చి పతాక సన్నివేశానికి నడిపారు.

మరణించిన ఈ ప్రణయజీవులను ఆ ఘట్టంలో కానీ కలవటానికి ప్రకృతి ముందుకు వచ్చిన ఈ సన్నివేశాన్ని, సాధ్యాసాధ్యాల జోలికి ఎవరూ పోజాలనంత హృదయంగమంగా చిత్రించారు. అక్కడ వినబడే చక్కనిపాట మరింత దోహదం చేసింది.

ఫర్హాద్‌గా ప్రదీప్‌కుమార్, షిరిన్‌గా మధుబాల ఉత్తమంగా నటించారు. తొలిఘట్టాలలోమటుకు మధుబాల నటన కొంచెం బెట్టుగా, అందువల్ల కొంత ఎబ్బెట్టుగా సాగింది. టెహరాన్ ప్రభువుగా పి. కైలాస్ తన విగ్రహపుష్టికి ప్రతిభను జోడించి మంచినటన ప్రదర్శించాడు. ఛాయాగ్రహణం, సెట్స్ మొదలైనవన్నీ బాగున్నాయి. పాటలవరసలూ వాటిని పాడిన తీరులూ హాయిగా ఉన్నాయి.

నృత్యాలుమటుకు. మిగతా హంగులన్నిటిలాగే, కథకూ, కథాకాలానికీ అతుకులా అనువుగా ఉందని చెప్పలేము. ★

"అల్లూరి సీతారామరాజు"

భేరీ తూర్యనాదాలు హోరు మోగుతూ ఉండగా పదహారు పురుష కంఠాలు, జోహారులర్పిస్తూ పాడిన పాటతో, నేషనల్ ఆర్ట్ థియేటర్స్ వారి కొత్త చిత్రం "అల్లూరి సీతారామరాజు"కు నటుడు శ్రీ ఎన్. టి. రామారావు ఈ నెల 17న వాహినీ స్టుడియోలో ప్రారంభోత్సవం జరిపించారు. ఆ ఉదయం 9 గంటలకు ఎన్. ఏ. టి. కార్యాలయంలో ప్రారంభోత్సవపూజ జరిగింది. చలన-చిత్రపరిశ్రమలో ప్రముఖులు, శ్రీరామారావుమిత్రులు పలువురు వచ్చి అభినందనలూ శుభకాంక్షలూ అందచేశారు.

పది గంటలకల్లా వాహినీలో రికార్డింగ్‌కు రిహార్సల్ పూర్తిచేసి, టేక్‌కు సర్వసిద్ధం చేశారు.

సంగీత దర్శకుడు శ్రీ టి. వి. (జయసింహ) రాజు, వాద్యబృందానికీ, గాయకులకూ, సలహాలు ఇచ్చి, మానిటర్‌కు రెడీ అన్నారు. గాయకుల మైక్ దగ్గర పేరు పోసిన గాయకులు శ్రీయుతులు ఘంటసాల వెంకటేశ్వరరావు మాధవపెద్ది సత్యం, పిఠాపురం నాగేశ్వరరావు, ఎం. ఎస్. రామారావు, మరి పన్నెండుగురు యువకులూ నిల్చున్నారు.

రికార్డింగ్ రూములో, వాహినీ సౌండ్ ఇంజనీరు శ్రీ కృష్ణయ్యర్, వల్లభజోస్యుల శివరాం సన్నాహాలు చేసుకున్నారు. ఛానెల్ ద్వారా వచ్చే విధాన పాట వినడానికి, ఆగదిలో రామారావు, ఆయన తమ్ముడు (నిర్మాత) శ్రీ విక్రమరావు, దర్శకులు శ్రీ కమలాకర కామేశ్వరరావు, శ్రీరామాగావంద్ కామెరామన్ రెహమాన్, సాహిణీ (పెంకిపెళ్లాం) ప్రొడక్షన్స్ నిర్మాత శ్రీ డి. బి. నారాయణ, ప్రముఖ రచయిత, నవ దర్శకుడు (అశ్వరాజ్ వారి "వినాయకచవితి") అయిన శ్రీ సముద్రాల రాఘవాచార్య మొదలగు వారంతా కూర్చున్నారు.

రికార్డిస్ట్ కృష్ణన్, పాటను ప్రారంభించమన్నారు. పాట మొదలైంది.

"హర హరోం హరమహా
ఓంకార నాదాన
పొంగరా ఉప్పొంగి
ఓ తెలుగుబిడ్డా...
తొడగొట్టి చేపట్టు
జయము మొనగాడా!"

ఉత్సాహ స్ఫూర్తియుతంగా సాగిపోయింది పాట.

పూర్తికాగానే మిత్రులు టి. వి. రాజును అభినందించారు.

"ఆయనది అల్లూరి సీతారామరాజు ప్రాంతమే అందుకని మరింత ఉత్సాహంగా ఈ వరస కూర్చారు అన్నారు" రామరావు.

పాటరాసిన ఆయన పేరు పడాల రామారావు. ఈయన సీతారామరాజు కథను నాటకంగా వ్రాశారు.

ఒక నిముషం తరవాత రికార్డిస్ట్ కృష్ణన్ 'టేక్' ప్రారంభించారు.

ఈచిత్రంలో ముఖ్యభూమిక నిర్వహించేది రామారావు అన్న విషయం ఈపాటికే అందరికీ తెలిసి ఉంటుంది. రచన సముద్రాల జూనియర్, పడాల రామారావు. ఛాయ గ్రహణం రెహమాన్; కళా దర్శకుడు తోట. ★

★ న్యూఢిల్లీ లేఖ ★

(9-వ పేజీ తరువాయి)

ఉంటేనే తమ దేశంలో తమ మనుగడ అని వారిద్దరికీ తెలుసు. అయితే ఈ దుస్మ్థితి పోతకు అసలు కారణం పాకిస్తాన్ ఆర్థిక బలహీనత.

* * *

భారతదేశంలో ఉన్న ఒకేఒక్క స్త్రీల వైద్యకళాశాలను రద్దు చేస్తున్నారు. దాని పేరు లేడీహార్డింజ్ మెడికల్ కాలేజి అనే ఉంటుంది. అయితే అది ఇదివరకటిలాగా ఆడవాళ్ళకి ప్రత్యేకింపబడదు. ఆడవాళ్ళకి, మగవాళ్ళకి కూడా అందులో ప్రవేశం ఉంటుంది.

ఇరవై ఏళ్ళ కిందట విద్య, ఆరోగ్యం, భూములశాఖ కార్యదర్శిగా పనిచేసిన కీ॥ శే॥ గిరిజాశంకర్ బాజ్పాయ్ ఢిల్లీ కొక వైద్య కళాశాల ఏర్పాటు చేస్తామని వాగ్దానం చేశారు. అంటే లేడీ హార్డింజ్ కాలేజ్ కాక మరొకటన్నమాట. కొత్త కాలేజీని అప్పటి కేంద్ర పాలిత ప్రాంతాలకు, రాజపుత్ర స్థానంలోని సంస్థానాలకు పనికి వచ్చేదిగా చేయాలని ఆయన ఆశయం. ఆయన ఆశయాన్ని అందరూ హర్షించారు. కాని ఇంతలో యుద్ధం రావడం మూలంగా ఆయన పథకం మూలపడింది. సర్ గిరిజా శంకర్ ఉద్యోగం కూడా మారింది.

భారత స్వాతంత్ర్య సిద్ధి అనంతరం ఢిల్లీలో వైద్యకళాశాల పెడతామనే వాగ్దానము మళ్ళీ వినవచ్చింది. ఈవాగ్దానాన్ని అనుసరించే ఇప్పుడు లేడీహార్డింజ్ కళాశాలను మార్చి వేస్తున్నారు. కేంద్ర ఆరోగ్య మంత్రిణి ఈ నిర్ణయానికివచ్చే ముందు బాగా ఆలోచించుకుని ఉండాల్సింది. ఎందుకంటే ఆమెచేసిన నిర్ణయం ఆమె తరవాత రాబోయే ఆరోగ్యమంత్రులను కూడా బాధ్యులుగా ఉంచుతుంది.

ఆరోగ్య శాఖకు ప్రస్తుతం మంత్రిగా ఉన్న శ్రీమతి రాజకుమారి అమృతకౌర్ హయాం ప్రారంభమైనప్పటి నుంచీ లేడీ హార్డింజ్ కళాశాల ఎలా పనిచేస్తోందీ అనేది ప్రధానమంత్రి విచారణ జరిపించి తేల్చాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆకళాశాలకు ప్రిన్సిపాలుగా అమెరికన్ వనితను లోగడ నియమించాల్సిన అగత్యం ఏమి వచ్చింది? ఎప్పుడూ లేనిది ఇప్పుడు ఒక మగ డాక్టరును ప్రిన్సిపాలుగా ఎందుకు నియమించారు? ఇది విచారణ చేయాల్సిన విషయం.

ఈ కళాశాల విషయమై ఇప్పటి దాకా ఏ స్త్రీల సంఘమూ శ్రద్ధ వహించకపోవడం, ఇప్పుడు జరగబోయే మార్పును ప్రతిఘటించకపోవడం శోచనీయం.

డా॥ సుశీలానయ్యర్ ఈ కళాశాలనుంచే వచ్చారు. ఆమె మహాత్మ గాంధీ అడుగుజాడల్లో నడిచిన వ్యక్తి. పార్లమెంటు సభ్యత్వంమీదకంటె నిర్మాణ కార్యక్రమం మీదనే ఆమెకు ఆసక్తి జాస్తి. ఆమెను ఈ కళాశాలకు ప్రిన్సిపాలుగా నియమించి, దానిని అఖిలభారత కళాశాలగాను, స్త్రీల కళాశాలగానూ ఉంచడమే యుక్తం.

విద్యార్థినులకు వసతి సౌకర్యాలు, ఒక ఆస్పత్రి కూడా ఉన్న వైద్య కళాశాల నిర్మించే నిమిత్తం 1912 లో లేడీ హార్డింజ్ భారతీయ ప్రజలకు, సంస్థానాధీశ్వరులకు చేసిన విజ్ఞప్తి ఫలితంగా ఈ కళాశాల ఏర్పడింది. 15 లక్షల రూ॥లు చందాలు పోగైనాయి. 1921 నాటికి రూ. 28,14,000 చందాలు పోగైనాయి. లేడీ రీడింగ్ నిధి నుండి మరొక రూ 8 లక్షలు 1922 లో వచ్చాయి. 200 మంది రోగులకు వసతి సౌకర్యాలున్న ఆస్పత్రి, నర్సుల శిక్షణ పాఠశాల, 100 విద్యార్థినులకు వసతిగల హాస్టలు, ఉపాధ్యాయులకు, నర్సులకు వసతి సౌకర్యాలు ఏర్పాటు చేయబడ్డాయి. అసలా కళాశాలకు మొదట క్వీన్‌మేరీ వైద్యకళాశాల అని పేరు పెడదామనుకున్నారు. కాని శంకుస్థాపన చేసిన మూడు నెలలకు 1914 జూన్‌లో లేడీ హార్డింజ్ చనిపోవడంతో, రాణీ ఆదేశానుసారం లేడీ హార్డింజ్ వైద్యకళాశాల అని నామకరణం చేశారు. కళాశాల, దానికి చేరిన వైద్యశాల మొత్తం రూ. 38,91,301 వ్యయంతో నిర్మితమైనాయి, ఈ వ్యయమంతా చందాలతో సేకరించినదే.

వైద్య కళాశాలను మొదట్లో పంజాబు విశ్వ విద్యాలయానికి అనుబంధించారు. దీని వ్యయమంతా భారతప్రభుత్వమే భరించేది. రాష్ట్ర ప్రభుత్వాలు గ్రాంట్లు ఇవ్వడానికి సుముఖత చూపలేదు. 1917 లో భారత ప్రభుత్వం ఏర్పాటుచేసిన రూ. 2 లక్షల గ్రాంటు సరిపోలేదు.

కళాశాల పరిపాలకసంఘం విజ్ఞప్తులు చేయగా, చేయగా, కళాశాల అవసరాలను గూర్చి నివేదిక తయారుచేయమని భారత ప్రభుత్వం 1925 లో ఒక కమిటీని నియమించింది. నివేదిక రాగానే, గ్రాంటును రెండులక్షలనుండి 8,11,000 రూ॥ లకు జాలు గెళ్ళ పాటు పెంచారు. మరొక 98,000 రూ॥ ప్రత్యేక గ్రాంటుకూడా ఇచ్చారు.

హార్డింజ్ ప్రభువు "మై ఇండియన్ ఇయర్స్" అనే గ్రంథంలో ఇలా వ్రాశారు:

"నేను ఇండియా వదిలిరావడానికిముందు మూడు ఘనకార్యాలు చేయగలిగినందుకు నా కెంతో సంతోషంగాఉంది; ఇతరులకు కూడా అవి సంతృప్తి కలిగించాయి.

మొదటిది, ఢిల్లీలో ఆడవారికోసం లేడీ హార్డింజ్ మెడికల్ కాలేజికి, ఆస్పత్రికి ప్రారంభోత్సవం చేశాను. వీటికి నా భార్య లక్ష పౌనుల దాకా చందాలు వసూలు చేసింది. ఏడాదికి మరొక 1500 పౌనుల చందాలు ఇస్తామని ఆమెకు వాగ్దానాలుకూడా చేశారు. అటువంటి కాలేజీ భారతదేశంలో అత్యవసరంగా కనబడింది. భారతీయులలో కొన్ని కులాల స్త్రీలు వైద్యురాండ్రచేతనేగాని వైద్యం చేయించుకోరు. వైద్య విజ్ఞానంలేని మంత్రసానులచేత వైద్యం చేయించుకుని ఎంతమంది స్త్రీలు అకాలమృతి పొందుతున్నారో లెక్కలేదు. భారతీయ ప్రజలుకూడా ఈ సంగతి గుర్తించారు. అందుచేత చందాలకు విజ్ఞప్తి చేయగానే విరివిగా చందాలు రాసాగాయి. ఇతర రకాల సహాయంకూడా వచ్చింది. కళాశాలస్థాపనాశయం విజయవంతంగా నెరవేరింది. భారతదేశంలో మొట్టమొదటి స్త్రీల వైద్యకళాశాల అదే. ప్రారంభమైన నాటి నుంచీ అది అతి త్వరగా పెంపొందింది. మెడికల్ డిగ్రీలు పుచ్చుకుని అనేకమంది ఆడ డాక్టర్లు ఆ కళాశాలనుంచి ఉత్తీర్ణులైనారు. ఆ కళాశాలకు అనుబంధించిన ఆస్పత్రికి వచ్చే రోగుల సంఖ్యకూడా అధికమే. ఇంతకంటె మంచి స్మారక చిహ్నం ఏ స్త్రీకీ లభించదు." ★

అనవసర ప్రసంగము

[41 వ పేజీ తరువాయి]

కీకేస్తే కరుస్తుంది. ఇవతలకి రా. ఇంకేమన్నావున్నదా" అని తల్లి గట్టిగా పిలిచేసరికి భయపడి తిరిగివచ్చి తల్లివళ్ళో దూరాడు. ఎప్పుడన్నా ఆడుకుందామని ఆదొడ్డిలోకి వెళ్ళితే బూచి గుర్తుకువచ్చి రాగంతీస్తూ లోపలికెళ్ళిపోతాడు. అప్పటినుంచీ ఆచాయలకే పోడు. అసలు పిల్లలను భయపెట్టగూడదు. వాళ్ళు పెద్దవాళ్ళయినా ఆభయం వాళ్ళని విడిచిపెట్టదు. పిల్లలను ఎంత జాగ్రత్తగా పెంచితే వాళ్లు అంత ధైర్యవంతు లవుతారు. ఇది తెలీని తల్లులు ఉంటారు. పిల్లలు అన్నం తినకపోతే బూచీ రావే మాబాబు అన్నం తినటంలేదని వాళ్ళని జడిపించటానికి అంటారు. నిజమేనని తినేఅన్నం మానేసి ఆరున్నొక్కరాగంతో మరీ ఏడుస్తారు. వాళ్లురోజూ వాళ్లు అన్నం తినేటప్పటికి బూచి గుర్తుకొచ్చి భయపడి కొన్నాళ్ళకి అన్నంకూడా మానేస్తారు. చివరకి అబ్బేది భయం. ఒక సంగతి గుర్తుకొస్తున్నది. మా అక్కగారబ్బాయి రసం త్రాగనని మారాం చేసేవాడు. అదుగో బూచివున్నది. రసం బూచి త్రాగేస్తుంది అని ఇంటికప్పవైపుకి చూపించేది. నిజమే ననుకుని మారాం చేయకుండా రసం త్రాగేవాడు. వాడికి రసం త్రాగేముందు బూచి గుర్తుకొచ్చేది కాబోల్సును. రోజూ రసంత్రాగే ముందు వూ, వూ, అంటూ ఇంటికప్పుకేసి చూపించేవాడు. మంచి అయినా, చెడు అయినా. మన పెంపులోనే ఉంటుంది.

ఇట్లా రావేరా అని గట్టిగా పిలిస్తే ఎక్కడ కొడుతామోనని భయపడి ఒక్క అంగలో వీధిలోకి వుడాయించేస్తారు. బాబూ ఇట్లా రామ్మా అని పిలిస్తే చప్పునవచ్చి వళ్ళో దూరుతారు. ఏదయినా మన పిలుపులో వుంటుంది. అంతేగాని తిట్టితే మనకు దూరంగా తప్పుకు తిరుగుతారు. పిల్లలను భయపెడితే పెద్ద అనర్థాలకే దారితీస్తుందనటంలో సంశయం ఏమీలేదు. మనం చెప్పిన మాట పిల్లలు వినేటట్టుగా తిప్పుకోవాలి. ఒకసారికి రెండుసార్లు చక్కగా చెప్పుకుని వినయ విధేయతలు ఉట్టిపడేలా మాట్లాడటం నేర్పాలి గాని పిల్లలను భయపెట్టి మనం వాళ్లతో ఏపనీ చేయించలేం. ఒకవేళ భయపెడితే వాళ్లు లొంగరు. ఈ తాటాకు చప్పుళ్ళకి మనం బెదరక్కర్లేదు, అనుకుంటారు పదేపదే చెప్పితే.

వీరపనేని అన్నపూర్ణ - సరోజనీదేవి
(రాచపట్నం)

★

మంత్రాలు; నమ్మకాలు

(31-వ పేజీ తరువాయి)

దులు యిచ్చారు. ఇక యిది నయము కాదు వెళ్ళిపొమ్మని చెప్పారు. 1948 సం॥లో మద్రాసు జనరల్ ఆసుపత్రిలో చేరాను. వారు నయాటికా అని నిర్ణయించారు. మూడు మాసములు ఔట్ పేషంటుగా వున్నాను. వారు కూడా నయముకాదని చెప్పారు. అంతట హోమోపతి వైద్యము చేయించాను. కాని నయము కాలేదు. ప్రతి సంవత్సరము ఆబాధ వచ్చేది. వచ్చినప్పుడు రెండు లేక మూడు మాసములు వుండేది. ఆ బాధ ఒక్కసారిగా 10 తేళ్ళు కుడితే యెంత బాధో అంతగావుండేది. రెండు లేక మూడు పర్యాయములు భావిలో పడి చనిపోవుటకు కూడా నిర్ణయించాను. కాని నా కుటుంబంలోవారు కనిపెట్టుటవల్ల నా నిర్ణయము భగ్నమైనది. 1954 వ సంవత్సరము వరకు ఆ బాధ అలాగే వేధించుతూ వచ్చింది. తిరిగి 1954 డిశంబరు 20 వ తారీఖున ఆ బాధ వచ్చింది. ఒంగోలు ఆస్పత్రిలో చేరాను. బాధ యెక్కువైంది. ఒకరోజు అనగా 26-12-54 తేది ఒక స్త్రీ రోగిని అక్కడకు వచ్చింది. నా బాధ చూచింది. ఆ రాత్రికి వారి గురువుగారిని ధ్యానించిన తదుపరి 'యిది జబ్బుకాదు, భూతవైద్యము చేయించితే పోతుంది' అని చెప్పింది. 27-12-54 తేది ఉదయం ఒంగోలులోని ఒక భూతవైద్యుణ్ణి (మహమ్మదీయుడు) పిలిపించాను. ఆయన వచ్చి చూచినాడు. "ఇది దాటుడు. సాయంత్రానికి పోతుంది" అని చెప్పి వెళ్లి ఆ సాయంత్రం 5 ఘంటలకు వచ్చి ఒక యంత్రము నా శరీరమునకు కట్టినాడు. ఆ యంత్రము శరీరము తాకగనే వళ్లు పులకరించి ఆ బాధ అంతయు మాయమైంది-అప్పటి నుండి యింతవరకు ఆ బాధ రాలేదు. ఆ మాంత్రికుడు యిప్పుడు ఒంగోలులో శ్యాంప్రసాదు టాకీసు హాలు దగ్గిర కాపురం. దయ్యాలసాయిబు అని అంటారు.

గాన వాసువంటి వారలు మంత్రాలు లేవని చెప్పి ప్రజలను మోసగించ కుండ వుందురని ఆశించుచున్నాను.

గుళ్ళపల్లి వెంకయ్య
గుండ్లాపల్లి, ఒంగోలు తాలూకా

★

శ్రీ రామ రక్ష

(3-వ పేజీ తరువాయి)

"కాలంతోపాటు కళలు కూడా మారిపోతున్నవి. నేడు ఆంధ్రలో కళలను పాత కళలనీ చెప్పడానికి వీల్లేదు; కొత్తవనీ చెప్పడానికి వీలేదు. ఒక అయోమయస్థితిలో పడిపోయాం" అంటున్నారు విసన్నవారు. పాత కొత్తల మేలుకలయికను సాధించలేకపోగా, పాతకళలను ప్రేత కళలుగా మార్చి పాతిపెట్టడంలో మనకు మనమేసాటి!

* * *

భారత ప్రభుత్వ ప్రతిపాదనలను అనుసరించి వేతనాలు హెచ్చించకపోతే, విద్యార్థుల సగటుహాజరుసంఖ్య హెచ్చింపు ఉత్తర్వును ప్రభుత్వం ఫిబ్రవరిలోగా రద్దుచేయకపోతే, ఫిబ్రవరి 14 నుంచీ నిరాహార దీక్షకు ఉపక్రమించి పాఠశాలల్లో పని చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఉపాధ్యాయ సమాఖ్య జనరల్ కౌన్సిల్ ఈమధ్య విజయవాడలో సమావేశమై తీర్మానించింది. ఉపాధ్యాయుల వేతనాల అభివృద్ధి విషయంలో రాష్ట్ర ప్రభుత్వం సానుభూతి ధోరణి ప్రదర్శించని మాట నిజమే. కేంద్ర ప్రభుత్వం ఆర్థికసహాయం చేస్తామన్నా, రాష్ట్ర ప్రభుత్వం ఒక స్థిరమైన నిర్ణయానికి రాలేకపోతున్న మాటకూడా నిజమే.

అయితే, 'తిండి మానివేసి పనిచేస్తా'మని బెదిరిస్తున్నారు ఉపాధ్యాయ సమాఖ్యవారు. తిండితోపాటు పనికూడా మానేస్తామంటేనే చలించని ప్రభుత్వం ఈ "తాటాకు చప్పుళ్ళకు" భయపడుతుందా? చాలీ చాలని జీతాలతో దుర్భరమైన జీవితాలు గడుపుతున్న ఉపాధ్యాయులు ఇదివరకల్లా "మహా తింటున్నట్లు" ఇక "మానివేస్తా మన్నట్లు" మాట్లాడితే ఎంతవరకు ప్రయోజన ముంటుందన్నదే అనుమానం.

—"భార్గవ"

★

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radha Krishna at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor S. Sambhu Prasad.

Regd. No. M. 4479. Andhra Patrika Illustrated Weekly



డిస్ట్రిబ్యూటర్లు:

ఆంధ్ర: ప్రీమియర్ ఫిలిమ్స్ * సీడెడ్: విజయ పిక్చర్సు * నైజాం: పూర్ణాపిక్చర్సు